www.visalaandhra.com

మంగళవారం
20-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి: 09, సంచిక: 238
పేజీలు: 8, వెల: రూ.5.00

Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

దేశానికే తలవంపు

- మధ్యప్రదేశ్ మంత్రి వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం
- సైనిక అధికారిణిపై అనుచిత వ్యాఖ్యల పర్యవసానం
- క్షమాపణ ఏమాత్రం సరిపోదని వ్యాఖ్య
- 'సిట్'తో దర్యాప్తునకు మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ఆదేశం
- ముగ్గురు ఇతర రాష్ట్రాల ఐపీఎస్‌లతో దర్యాప్తు బృందం
- 28 నాటికి నివేదిక ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ: సైనిక అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన చెప్పిన క్షమాపణ ఏమాత్రం సరిపోదని, ఈ వ్యాఖ్యలు దేశానికే తలవంపులు తెచ్చేలా ఉన్నాయని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సోమవారం ఈ కేసుకు సంబంధించిన విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంత్రి విజయ్ షా తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'మంత్రి వ్యాఖ్యలతో యావత్ దేశం సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తోంది' అని వ్యాఖ్యానించింది. నిజాయతీగా క్షమాపణ చెప్పడం ద్వారా లేదా సరైన పశ్చాత్తాపం వ్యక్తం చేయడం ద్వారా తన తప్పు సరిదిద్దుకోవాలని మంత్రికి

- మిగతా 2 లో

భారత్ ధర్మశాల కాదు

శ్రీలంక పౌరుడి పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అందరికీ ఉచితంగా ఆశ్రయం ఇవ్వడానికి ఈ దేశం ధర్మశాల కాదని సుప్రీంకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. శరణార్థిగా తనకు భారత్‌లో ఆశ్రయం ఇవ్వాలని శ్రీలంక జాతీయుడు చేసిన అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ)తో సంబంధాలున్నాయనే అనుమానంతో 2015లో పిటిషనర్‌ను అరెస్టు చేశారు. తనను శరణార్థిగా పరిగణించాలని కోరుతూ అతను వేసిన తాజా పిటిషన్‌పై న్యాయమూర్తులు దీపాంకర్ దత్తా, కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. శ్రీలంక జాతీయుడికి 2018లో విచారణ కోర్టు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2022లో మద్రాసు హైకోర్టు అతని జైలుశిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్ష పూర్తికాగానే దేశం విడిచి వెళ్లాలని, దానికి ముందు శరణార్థి శిబిరంలో ఉండాలని

- మిగతా 2 లో

77 మంది డీఎస్పీల బదిలీ

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో భారీగా డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీలు, ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరికొంతమందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. జగిత్యాల ఎస్డీపీవోగా ఎన్.వెంకటస్వామి, ఇంటెలిజెన్స్ డీఎస్పీగా డి.రఘుచందర్, బాలానగర్ ఏసీపీగా పి.నరేశ్ రెడ్డి, శంషాబాద్ ఏసీపీగా వి.శ్రీకాంత్ గౌడ్, మాదాపూర్ ఏసీపీగా సీహెచ్ . శ్రీధర్, చిక్కడపల్లి ఏసీపీగా సీహెచ్. శ్రీకాంత్ బదిలీ అయ్యారు. మేడ్చల్ ఏసీపీగా సీహెచ్.శంకర్ రెడ్డి, సంతోశ్ నగర్ ఏసీపీగా సుఖ్‌దేవ్ సింగ్, మలక్‌పేట

- మిగతా 2 లో

ప్రొఫెసర్ అరెస్ట్‌పై సత్వర విచారణకు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ: అశోకా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్ అరెస్ట్‌పై అత్యవసర విచారణకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సోమవారం అంగీకరించారు. సోనిపట్‌లోని రాయ్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లు రద్దు చేయాలని మౌఖికంగా విజ్ఞప్తి చేశారు. 'దేశభక్తి ప్రకటన చేసినందుకు ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేశారని, దయచేసి రేపు లేదా మరుసటి రోజు జాబితా చేయండి' అని

- మిగతా 2 లో

అణు సంకేతాలు లేవు: విక్రమ్ మిస్రి

న్యూఢిల్లీ : రెండు అణ్వాయుధ పొరుగు దేశాల నుంచి 'అణు సంకేతాలు లేవు' అని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి చెప్పారు. జమ్మూకశ్మీర్ సమస్యలపై మాట్లాడే అర్హత ఏ ఇతర దేశానికి లేదని అన్నారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత ఇటీవల భారత్-పాకిస్థాన్ సైనిక ఉద్రిక్తతలపై విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి సోమవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి వివరణ ఇచ్చారు. ఈ వివాదం పూర్తిగా సంప్రదాయ బద్ధంగానే ఉందని అన్నారు. పాక్‌లోని సూత్రధారులతో ఉగ్రవాదులు సంభాషించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఉగ్రవాదులు పాక్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారని చెప్పారు. కాల్పుల

- మిగతా 2 లో

గిరిపుత్రుల అభ్యున్నతికి కృషి

- ఆత్మగౌరవంతో బతికేందుకే 'ఇందిరా సౌర గిరి జల వికాసం'
- రూ.12,600 కోట్లతో నల్లమల డిక్లరేషన్
- ప్రజాశీస్సులతో అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి: రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తుందని, నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మాచారంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణతో కలిసి సోమవారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లమల డిక్లరేషన్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ... ఒకప్పుడు నల్లమల ప్రాంతం అంటే ఎంతో వెనుకబడిన ప్రాంతమని... ఎవరో నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలనే వారు... కానీ ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి ఈ ప్రాంతాన్ని కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ ప్రాతినిధ్యం వహించిన మహేంద్రనాథ్, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా రాణించిన జైపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు పుట్టిన ప్రాంతమని... ఈ విషయంలో తను నల్లమల బిడ్డగా ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఎంత బాధ్యత ఉందో తనకు ముఖ్యమంత్రిగా అంతే బాధ్యత ఉందన్నారు. నల్లమల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని, నిధులు విడుదల చేయాలని, ఉద్యోగ, విద్య అందించాలని మంత్రులకు తెలిపానన్నారు. ఈ ప్రాంతంలో రైతన్నలు పోడుభూములను సారవంతమైన భూములుగా మార్చారని, గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించే విధంగా 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ రోజు తమ చెంచు ఆడపడుచు అలివేలు అనే మహిళ తోటల పెంపకం గురించి అవగాహన కల్పిస్తుంటే

- మిగతా 2 లో

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అధిక ప్రాణనష్టం

బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి చాలా స్పష్టంగా కనిపిస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఘటనా స్థలానికి వచ్చిన అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడం శోచనీయమన్నారు. మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ ఇంజిన్‌లో నీళ్లు ఉంటే అగ్నిప్రమాదంలో ప్రాణ నష్టం తగ్గేదన్నారు. చివరకు ప్రాణాలకు తెగించి బాధితులను కాపాడేందుకు వచ్చిన ఫైర్ బ్రిగేడ్‌కు కూడా మాస్కులు లేకపోవడంలో వాళ్లు లోపలికి వెళ్లి బాధితులను కాపాడలేకపోయారన్నారు. అందాలపోటీలపై పెట్టిన శ్రద్ధ, ఇలాంటి మౌలిక సదుపాయల కల్పనపై పెడితే బాగుంటుందన్నారు. 125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరం అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అగ్నిప్రమాద స్థలాన్ని సోమవారం కేటీఆర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గుల్జార్ హౌస్ గురించి తెలియని వాళ్లు హైదరాబాద్, తెలంగాణలో ఎవరూ లేరని చెప్పారు. అగ్నిప్రమాదం జరగగానే స్థానికులైన హిందువులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చి మమ్మల్ని కాపాడారని... మాకు జరిగిన నష్టం రాబోయే రోజుల్లో ఎవరికీ జరగకూడదని వారు కోరుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. తాను రాజకీయం చేయడానికి రాలేదన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలన్నారు. ప్రాణాలు పోయిన తర్వాత నష్టపరిహారం ఇచ్చి చేతులు

- మిగతా 2 లో

బనేగా కోసం పోరాటాలు

- అందరికీ ఉపాధి లక్ష్యంగా జాతా
- ఎన్నికల సంస్కరణల కోసం సంతకాల సేకరణ
- కార్పొరేట్ల ప్రయోజనాలకే కేంద్రం పాట్లు
- రోషన్‌కుమార్ సిన్హా సుఖ్జీందర్ మహేసరి

విశాలాంధ్ర బ్యూరో- తిరుపతి: భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం(బనేగా-బీఎన్‌ఈజీఏ) కోసం పోరాడతామని ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్‌కుమార్ సిన్హా, జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్జీందర్ మహేసరి ప్రకటించారు. దేశంలో అర్హత గల ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో నాలుగు రోజులు జరిగిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు అనంతరం సోమవారం సిన్హా, మహేసరి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో యువత ప్రధానంగా నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటుందని రోషన్‌కుమార్ సిన్హా చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రమే ప్రయోజనం కలిగిస్తోందని ఆరోపించారు. అర్హతగల ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పనే ప్రధాన డిమాండ్‌గా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రత్యేక జాతా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎన్నికల సంస్కరణల అవసరాన్ని పేర్కొంటూ త్వరలో ఐదు కోట్ల మంది సంతకాలతో వినతిపత్రాన్ని కేంద్రానికి పంపిస్తామని వివరించారు. సుఖ్జీందర్ మహేసరి మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు విజయవంతమయ్యేందుకు సహకరించిన సీపీఐ జిల్లా, రాష్ట్ర శాఖలకు, ఆహ్వాన సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. దేశంలో అత్యధికంగా యువత ఉందని, అందరికీ ఉపాధి కల్పించేందుకు భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు కోసం ఉధృత పోరాటాలు చేస్తామని తెలిపారు. యువత ప్రధానంగా ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను కేంద్రం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు అమలు చేస్తూ సమాజంలో విభజనకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రాల మధ్య, వివిధ మతాల మధ్య సోదరభావం ఉందని, ఈ భావాన్ని మరింత పెంపొందించేందుకు ఏఐవైఎఫ్ కృషి చేస్తుందని వెల్లడించారు. కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగిస్తున్న బీజేపీ ప్రభుత్వం సాధారణ ప్రజల సమస్యల

- మిగతా 2 లో

ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రోషన్ కుమార్ సిన్హా, సుఖ్జీందర్ మహేసరి

అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నూతన జాతీయ కార్యవర్గం ఎన్నికైంది. ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా రోషన్ కుమార్ సిన్హా, ప్రధాన కార్యదర్శిగా సుఖ్జీందర్ మహేసరి ఎన్నికయ్యారు. ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతిలో ఈ నెల 15వ తేదీ నుంచి 18 వరకు ఘనంగా జరిగాయి. మహాసభల చివరి రోజు నూతన కమిటీని ఎన్నుకున్నారు. 105 మందిని జాతీయ సమితి సభ్యులుగా ఎన్నుకోగా... అనంతరం జరిగిన సమితి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ వివరాలను ఏఐవైఎఫ్ నాయకుడు తిరుమలై రామన్ ప్రకటించారు. ఏఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులుగా భారతి, ప్రదీప్ సేథీ, హిమాన్షు, ఆర్తి రాధేకర్, కార్యదర్శులుగా జిస్మోన్, హరీశ్‌బాల, డాక్టర్ సయ్యద్ వలీవుల్లా ఖాద్రీ, పరుచూరి రాజేంద్రబాబు ఎన్నికయ్యారు. వీరితోపాటు 45 మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

ఇదీ లోకం!

ప్రస్తుతానికి మా బాబుకి హెలికాప్టరు కొంటున్నాను. తర్వాత మీ బాబుకి తల్లికి వందనం వేస్తా!

'సుప్రీం' ప్రధాన న్యాయమూర్తిపై ప్రభుత్వతీరు

ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం: చాడ

విశాలాంధ్ర- హైదరాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ... తన సొంత రాష్ట్రమైన మహారాష్ట్రకు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కనీస మర్యాదలు చేయకపోవడం ప్రజాస్వామ్య విలువలకు పాతరేయడమే అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఈ విషయంలో మానసిక వేదకు గురయ్యారని పేర్కొన్నారు. రాజ్యాంగంలో ప్రధానమైన న్యాయవ్యవస్థపై మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని అన్నారు. శాసన, కార్యనిర్వహణ, న్యాయ వ్యవస్థలు రాజ్యాంగంలో ప్రధాన అంగాలుగా పిలవబడుతాయని, పరస్పరం గౌరవించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం

- మిగతా 2 లో

నలుగుర్నీ కస్టడీకి ఇవ్వండి

మద్యం కేసులో సిట్ పిటిషన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులు నలుగురిని కస్టడీకి ఇవ్వాలని విజయవాడ కోర్టులో సిట్ సోమవారం పిటిషన్ దాఖలు చేసింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ సీఎం ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డితో పాటు ఈ కేసులో ఏ1గా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ గోవిందప్పను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. వీరు నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని సిట్ బృందం స్పష్టం చేసింది. మద్యం ముడుపులు, కమీషన్ వ్యవహారంలో ఈ నలుగురికి తెలిసి కొన్ని విషయాలు జరిగాయని, అందువల్లే

- మిగతా 2 లో

చెంచు ప్రతినిధులను

విడుదల చేయండి

అక్రమ అరెస్ట్ ప్రజాస్వామ్యానికి చేటు: హరీశ్ రావు

విశాలాంధ్ర - హైదరాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్ కర్నూల్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసే ప్రయత్నం చేసిన చెంచు ప్రతినిధులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా మీరు అంటున్న ప్రజాపాలన అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నల్లమల అడవుల నుంచి వచ్చానని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి... అడవి బిడ్డల సంక్షేమంపై మీరు చూపే ప్రేమ ఇదేనా అంటూ నిలదీశారు. తమ సంక్షేమం కోసం

- మిగతా 2 లో

గాజా స్వాధీనమే లక్ష్యం: నెతన్యాహు

టెల్ అవీవ్: గాజా మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా పోరాడుతున్నామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచల ప్రకటన చేశారు. దౌత్య కారణాలకు లోబడి గాజాలో క్షామాన్ని నివారిం చాల్సి అవసరాన్ని తాము గుర్తించామని ఆయన చెప్పారు. "మా పోరాటం తీవ్రస్థాయిలో ఉంది. మేం పురోగతి సాధిస్తున్నాం. ఆ ప్రాంతం మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకుంటాం. ఇందులో వెనక్కి తగ్గేదేలేదు. విజయం సాధించాలంటే.. మనల్ని అడ్డుకోలేరనే విధంగా వ్యవహరించాలి" అని సోషల్ మీడియా వేదికగా నెతన్యాహు ఒక వీడియో పోస్టు చేశారు. ఇజ్రాయిల్-హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల వేళ గాజాలో మరోసారి దాడుల తీవ్రతను పెంచిన క్రమంలో నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు ఇటీవల నెతన్యాహు వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా గాజాలోని రెండో అతి పెద్ద నగరమైన ఖాన్ యూనిస్, సమీప ప్రాంతాలను ఖాళీ చేయాలని స్థానిక ప్రజలకు ఇజ్రాయిల్ సైన్యం ఆదేశాలు ఇచ్చింది. వాటిని ప్రమాదకరమైన పోరాట ప్రాంతాలుగా పరిగణిస్తునట్లు పేర్కొంది. మరోవైపు దోహాలో జరుగుతున్న చర్చల్లో హమాస్ బహిష్కరణ అంశాన్ని ఇజ్రాయిల్ తెరపైకి తీసుకొచ్చిందని తెలుస్తోంది. యుద్ధం శాశ్వతంగా ఆగాలంటే గాజా పాలన నుంచి హమాస్ వైదొలగాలని, ఆయుధాలు అప్పగించాలని, ఆ సంస్థ ఉగ్రవాదులంతా ఇతర దేశాలకు వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేస్తోంది. అయితే గాజా నుంచి వెళ్లడానికి, ఆయుధాల అప్పగింతకు తాము సిద్ధంగా లేమని హమాస్ స్పష్టం చేసినట్లు సమాచారం. ఇటీవల పశ్చిమాసియా పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గాజా గురించి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. గాజాలోని పలస్తీనియన్లు ఖాళీ చేయాలని గతంలో ప్రతిపాదించిన ట్రంప్.. దానిని అమెరికా నియంత్రణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బనేగా కోసం పోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారంపై శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం సైన్యంలో తెచ్చిన మార్పుల కారణంగానే నాలుగేళ్ల కాలానికి కాంట్రాక్టు పద్ధతిన ఎంపికైన జవాన్ మురళీ నాయక్ మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ఒకసారి రాజకీయాల్లోకి వచ్చాక శాశ్వతంగా పదవులు అనుభవిస్తున్నారని విమర్శించారు. ఈ విధానంలో మార్పు కోసమే ఎన్నికల సంస్కరణలకు ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు హరీశ్ బాల, కత్తి రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నలుగుర్నీ కస్టడీకి ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని, అప్పుడే ఈ కేసు దర్యాప్తునకు ఆటంకం లేకుండా ఉంటుందని పిటిషన్‌లో పేర్కొంది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగే అవకాశం ఉంది. అటు..రాజ్ కసిరెడ్డి వాంగ్మూలం రికార్డు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజయవాడ కోర్టులో మూడు రోజుల క్రితం పిటిషన్ వేసిన విషయం విదితమే. దీనిపై ఏసీబీ కోర్టుకు విచారణకు వచ్చింది. కసిరెడ్డి వాంగ్మూలం రికార్డు చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని ఈడీ తరపు న్యాయవాదులు కోరారు. ఈ విచారణను ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. ఇదే సమయంలో నలుగురు కీలక నిందితుల కస్టడీ పిటిషన్‌పై కోర్టు నుంచి ఎలాంటి నిర్ణయం వస్తుందనేదీ ఆసక్తికరంగా మారింది. మద్యం కేసులో ఏ33గా ఉన్న గోవిందప్పను వారం రోజుల పాటు కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏసీబీ కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది. మద్యం కేసులో ఏ30 పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. దిలీప్‌కు బెయిల్ మంజూరు చేస్తే విచారణకు విఘాతం కలుగుతుందని, ఈ కేసులో దిలీప్ ద్వారా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మొత్తం వ్యవహారం నడిపించారని సిట్ అధికారులు వివరించారు. ఇదే కేసులో ఏ6గా ఉన్న సజ్జల శ్రీధర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

వంశీ బెయిల్ పిటిషన్ నేటికి వాయిదా

నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. ఏలూరుజిల్లా నూజివీడు కోర్టులో ఈ కేసును సోమవారం విచారించారు. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు నూజివీడు రెండవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు పోలీసులను ఆదేశించింది.

ప్రొఫెసర్ అరెస్ట్‌పై సత్వర విచారణకు సుప్రీం ఓకే

(మొదటిపేజీ తరువాయి)

సీజేఐ ఎదుట హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోర్టును కోరారు. భారత న్యాయ సంహిత కింద దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను ప్రమాదంలో పడేసేలా చేయడం, వివిధ సమూహాల మధ్య శతృత్వాన్ని ప్రోత్సహించడం వంటి అభియోగాలపై అలీఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు న్యాయవాదుల్లో ఒకరైన కపిల్ బాల్యాన్ పేర్కొన్నారు. ఖాన్‌పై నమోదైన అభియోగాలు పనికిమాలినవని, సోషల్‌మీడియాలో చాలామంది రాజకీయ నేతలు, రిటైర్డ్ ఆర్మీ అధికారులు ఇటువంటి వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఆరేషన్ సిందూర్‌పై సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన అలీఖాన్ మహమూదాబాద్‌ను హర్యానా పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. రెండు కేసుల్లో ఒక దానిలో ఖాన్‌ను రెండు రోజుల పోలీస్ కస్టడీ విధించారు. జతేరి గ్రామ సర్పంచ్ యోగేశ్ జతేరి దాఖలు చేసిన రెండవ కేసులో ఆయనను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

77 మంది డీఎస్పీల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

ఏసీపీగా సుబ్బారామిరెడ్డి, హుస్నాబాద్ ఏసీపీగా సదానందం, గాంధీనగర్ (హైదరాబాద్) ఏసీపీగా ఎ.యాదగిరి బదిలీ అయ్యారు. చిక్కడపల్లి ఏసీపీగా ఉన్న ఎల్.రమేశ్ కుమార్, మేడ్చల్ ఏసీపీగా ఉన్న బి.శ్రీనివాస్ రెడ్డి, సంతోశ్‌నగర్ ఏసీపీ ఎండీ గౌజ్, మలక్‌పేట ఏసీపీ జి.శ్యామ్ సుందర్, హుస్నాబాద్ ఏసీపీ వి.సతీశ్‌ను డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

భారత్‌తో వాణిజ్య సమస్యలపై చర్చిస్తాం: బంగ్లాదేశ్

ఢాకా: బంగ్లాదేశ్‌లో ప్రధానిగా షేక్ హసీనా దిగిపోయినప్పట్నుంచి అక్కడి రాజకీయాలు మారిపోయాయి. ఇటీవల భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రికత్తలు పెరిగాయి. రెండుదేశాల మధ్య వాణిజ్య సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో భారత్‌తో నెలకొన్న వాణిజ్య సమస్యలను పరిష్కరించుకుంటామని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని అక్కడి తాత్కాలిక ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు బంగ్లా వాణిజ్య సలహాదారు షేక్ బషీరుద్దీన్ విలేకరులతో మాట్లాడుతూ... 'భారత్ తీసుకున్న చర్యలకు సంబంధించి అధికారిక సమాచారం అందలేదు. అధికారికంగా సమాచారం వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం. ఏమైనా సమస్యలు ఉంటే చర్చలతో వాటిని పరిష్కరించుకొంటాం. అఖౌరా, డాకి పోర్టులతో పాటు కొన్ని సరిహద్దు ప్రాంతాలకు సంబంధించి పలు నిర్ణయాలను భారత్ తీసుకున్నట్లు మీడియా ద్వారానే తెలిసింది. ఇది ఇరు దేశాలకు సంబంధించిన వాణిజ్య వ్యవహారం. వస్త్ర పరిశ్రమలో భారత్ అగ్రస్థానంలో ఉందని మేం భావిస్తున్నాం. అయినప్పటికీ.. ఆయా ఉత్పత్తులు మా దేశం నుంచి ఎగుమతి అవుతున్నాయి. ఇది మా సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. భారత్-బంగ్లాలు పొరుగుదేశాలు. వాణిజ్యం, రవాణా వంటి రంగాల్లో కచ్చితంగా పోటీ ఉంటుంది. ఈ క్రమంలోనే కొన్ని సార్లు మేం పరిమితులు విధిస్తాం. భారత్ కూడా అలాగే చేస్తోంది. ఇదంతా వాణిజ్య ప్రక్రియ. ఇందులో ఎలాంటి సమస్యలు ఉంటే ఇరు దేశాలు చర్చలతో పరిష్కరించుకుంటాయి' అని ఆయన తెలిపారు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే సరకులపై ఇటీవలే బంగ్లాదేశ్ ఆంక్షలు విధించింది. దీనికి ప్రతిగా భారత్.. ఢాకా దిగుమతులపై ఆంక్షలు పెట్టింది. ఇందులో అక్కడి నుంచి దిగుమతయ్యే రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ ఫుడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్, పత్తి, నూలు వ్యర్థాలు, ప్లాస్టిక్, పీవీసీ వస్తువులు, కలప ఫర్నీచర్ సహా వివిధ వస్తువులు ఉన్నాయి. ఈ ఉత్పత్తులను కోల్‌కతా పోర్టు, ముంబై జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు నుంచి మాత్రమే భారత్ లోకి అనుమతిస్తారు. అయితే, బంగ్లా నుంచి దిగుమతయ్యే చేపలు, ఎల్పీజీ, వనస్పతి, కంకర వంటి వాటికి ఈ ఆంక్షలు వర్తించవని భారత్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే బంగ్లాదేశ్ నుంచి స్పందన వచ్చింది.

మరోసారి బద్దలైన 'లకి లకి' అగ్నిపర్వతం

జకార్తా: ఇండోనేశియాలోని ఫ్లోర్స్ ద్వీపంలో ఉన్న లెవోటోబి లకి లకి అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. దీంతో అగ్నిపర్వత శిఖరం నుంచి 1.2 కిలోమీటర్ల ఎత్తు వరకు బూడిద ఎగసిపడింది. సోమవారం ఉదయం 9.36 గంటలకు అగ్నిపర్వతం విస్ఫోటనం చెందిందని ఇండోనేశియా వోల్కనాలజీ ఏజెన్సీ వెల్లడించింది. అంతకుముందు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా బద్దలైందని తెలిపింది. దీంతో శిఖరం నుంచి 6 కిలోమీటర్ల ఎత్తు వరకు బూడిద వెలువడిందని పేర్కొంది. బూడిద నుంచి తమనుతాము రక్షించుకునేందుకు ప్రజలు ఫేస్‌మాస్కులు ధరించాలని అగ్నిపర్వత సమీప ప్రాంతాల వాసులకు సూచించింది. ప్రజలు అగ్నిపర్వతం చుట్టుపక్కల ఆరు కిలోమీటర్ల వరకు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించవద్దని తెలిపింది. కాగా, 1,584 మీటర్ల (5,197 అడుగులు) ఎత్తున్న లకిలకి అగ్నిపర్వతం చాలా క్రియాశీలకంగా ఉంది. ఈ ఏడాది మార్చి 21న విస్ఫోటనం చెందింది. గతేడాది నవంబర్ 7న కూడా బద్దలైంది. అగ్నిపర్వత శిఖరం నుంచి 8 వేల మీటర్ల ఎత్తున బూడిద ఎగసిపడింది.

పథకాలు, సేవలపై
ఆకస్మిక తనిఖీలు

- జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఉండొచ్చు
- ప్రజల్లో పూర్తిస్థాయి సంతృప్తే లక్ష్యం: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో జూన్ 12 తరువాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వివిధ ప్రభుత్వ సేవలపై సోమవారం సచివాలయంలో సీఎం అధికారులతో సమీక్షించారు. ప్రతివారం నాలుగు శాఖల పరిధిలో పథకాలు, సేవలపై ప్రజలనుంచి వచ్చే సమాచారాన్ని సమీక్షిస్తున్న సీఎం... రేషన్, దీపం, ఏపీఎస్‌ఆర్టీసీ, పంచాయతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించారు. ఈ శాఖల పరిధిలో అమలు అవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల నుంచి ఐవీఆర్‌ఎస్, క్యూ ఆర్ కోడ్ వంటి విధానాల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ అభిప్రాయాలపై సీఎస్, సీఎంవో సెక్రటరీలతో ముఖ్యమంత్రి చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని, అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించాలని సీఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని, అయితే ఆర్టీసీ లాంటి విభాగాల్లో ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందన్నారు. దీపం 2 పథకం ద్వారా ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని సీఎం స్పష్టం చేశారు. లబ్ధిదారులు తమకు కావాల్సినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చునని, అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుందన్నారు. దీపం పథకం లబ్ధిదారుల నుంచి ఏజెన్సీ వాళ్లు కానీ, ఇతర స్థాయిల్లో గాని ఎక్కడా డబ్బులు అదనంగా వసూలు చేసే పరిస్థితి ఉండకూడదన్నారు.

రేషన్ సరుకుల పంపిణీపై 76 శాతం మంది సంతృప్తి

మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా... అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యతపై ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారని సీఎం ప్రజాభిప్రాయాన్ని విశదీకరించారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా... అనే అంశంలో 62 శాతం మంది లేదు అని చెప్పారు. కొన్ని చోట్ల ఈ విషయంలో సమస్య ఉందని, నేరుగా వారి ఖాతాల్లో ముందుగానే డబ్బులు వేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశించిన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని, ముఖ్యంగా బస్టాండ్‌లలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సీఎం సూచించారు. తాగునీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వెల్లడించారు. ఇక పంచాయతీ సేవల విషయానికి వచ్చేసరికి... ఇంటి నంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారు. గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సీఎం చెప్పారు.

వాట్సాప్ గవర్నెన్స్‌లో జూన్ నాటికి 500 సేవలు

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 325 సేవలు అందుతున్నాయి. మన మిత్ర ద్వారా వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 45 లక్షల మంది ఈ సేవలను విజయవంతంగా వినియోగించుకున్నారు. జూన్ 12వ తేదీ నాటికి 500 సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ సేవల విషయంలో డాటా అనలటిక్స్ కీలకమని, ఆయా ప్రభుత్వ శాఖల తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు దీనివల్ల అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం, లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సీఎం సూచించారు.

బంగాళాఖాతంలో ఆవర్తనం

దక్షిణకోస్తా, రాయలసీమకు భారీ వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడిందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది తమిళనాడు ఉత్తర ప్రాంతం దిశగా కదులుతోందని పేర్కొంది. ఫలితంగా తమిళనాడు ఉత్తర ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. వారం రోజులు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవడానికి అనుకూల వాతావరణం నెలకొని ఉందని తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశంతో పాటు వచ్చే 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆరెంజ్, ఎల్లో అలర్టు జారీ చేసింది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఆరెంజ్, బాపట్ల, నంద్యాల, అన్నమయ్య రాయచోటి, శ్రీసత్యసాయి పుట్టపర్తి, అనంతపురం, కడప జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మరోపక్క ఈ నెల 21వ తేదీ నాటికి అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని, 22న అల్పపీడనంగా మారుతుందని తెలిపింది. ఇది తమిళనాడు ఉత్తర ప్రాంతం దిశగా కదులుతుందని, ఇది రాయలసీమపై ప్రభావం చూపుతుందని పేర్కొంది.

గిరిపుత్రుల అభ్యున్నతికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

ఆనందకరంగా ఉందన్నారు. ఇళ్లకు, వ్యవసాయ అవసరాలకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించడంతో పాటు అవసరాలు తీర్చుకునేలా ఇళ్లకు సైతం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చినట్లు రేవంత్ తెలిపారు. రాబోయే వంద రోజుల్లో అచ్చంపేట నియోజకవర్గంలో ఉన్న రైతులందరికీ సోలార్ పంపుసెట్లను ఉచితంగా అందజేస్తామని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వరి వేస్తే ఉరి వేసుకున్నట్లేనని చెప్పారని కానీ తమ ప్రభుత్వంలో సన్నరకం వడ్లను పండించిన రైతులకు రూ.500 బోనస్ కూడా ఇవ్వడం జరుగుతుందని వివరించారు. రేషన్ దుకాణాల ద్వారా అర్హులందరికీ సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. రేషన్ బియ్యం ఆత్మగౌరవాన్ని పెంచేవిధంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా మూడు కోట్ల పది లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని... గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని పేర్కొన్నారు. ఆడబిడ్డలు, పొదుపు సంఘాల మహిళలకు ఆర్టీసీ బస్సులను సైతం ఇచ్చి వాటికి యజమానులను చేసిన ఘనత తమకే దక్కుతుందని అన్నారు. ఒకప్పుడు సోలార్ అంటే అదాని, అంబానీలకే అనుకునే వారని... ప్రస్తుతం ఆడబిడ్డలకు, గిరిజన పుత్రులకు సైతం అందించడం జరుగుతుందని వివరించారు. పెట్రోల్ బంకులు సైతం కేటాయించి వారే స్వయంగా నడిపే విధంగా తీర్చిదిద్దామన్నారు. శిల్పారామం పక్కన స్థలం కేటాయించి ఉత్పత్తులను అమ్ముకోవడానికి మార్గం సుగమం చేశామన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని... ఒక ఆడబిడ్డ ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబం, ఆ ప్రాంతం వృద్ధి చెందుతుందన్నారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులను ఆదుకున్న ఘనత తమకే దక్కుతుందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే సుమారు 60 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 12 వర్సిటీల్లో వీసీలను నియమించామన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేషన్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాంతిభద్రతల్లో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానం, పన్నుల వసూళ్లలో సైతం నెంబర్ వన్ రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పేదలకు 25 లక్షల ఎకరాల భూములను అందించి వారి ఆత్మగౌరవాన్ని నిలిపిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ప్రతి పేదవారి గుండెల్లోను, తండాల్లోను, గూడేల్లోను ఇందిరాగాంధీ ఉన్నారని... అందువల్లే ఈ పథకానికి 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకంగా పేరు పెట్టినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని ఈ విషయంలో కొందరు కుట్రలు చేస్తున్నారని వారిని ఎలా తిప్పి కొట్టాలో తమకు తెలుసన్నారు. 50 లక్షల కుటుంబాలు గృహజ్యోతి ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. బ్యాంక్ లింకేజీ ద్వారా ఆడబిడ్డలకు లబ్ధి చేకూర్చామని చెప్పారు. అనంతరం రూ.119 కోట్లు స్వయం సహాయక బృందాలకు ముఖ్యమంత్రి అందచేశారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు జ్ఞాపికలను అందజేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి తన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామి వారికి సీఎం పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో మాచారంకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు కలెక్టర్, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు.

దేశానికే తలవంపు

(మొదటిపేజీ తరువాయి)

సూచించింది. ఇలాంటి అనాలోచిత వ్యాఖ్యలు చేసే ముందు సున్నితత్వాన్ని పాటించాలని హితవు పలికింది.

తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ మంత్రి విజయ్ షా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ సందర్భంగా, మంత్రి క్షమాపణ చెప్పారా అని ధర్మాసనం ప్రశ్నించగా, ఆయన తరఫు న్యాయవాది ఇప్పటికే క్షమాపణ చెప్పారని తెలిపారు. అయితే, ఆ క్షమాపణలోని నిజాయతీని, ఉద్దేశాన్ని కోర్టు ప్రశ్నించింది. జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, 'ఈ విషయం చాలా సున్నితమైనది... మీరెలాంటి క్షమాపణ చెప్పారో మేం చూడాలనుకుంటున్నాం... క్షమాపణ అనే పదానికి ఓ అర్థం ఉంది... కొన్నిసార్లు పరిణామాల నుంచి తప్పించుకోవడానికి... కొన్నిసార్లు మొసలి కన్నీరు కార్చడానికి చెబుతారు... మీది ఏ రకం' అని ప్రశ్నించారు. ఈ కేసులో మంత్రి విజయ్ షా అరెస్టుపై స్టే విధిస్తూనే, ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి వీల్లేదని ధర్మాసనం హెచ్చరించింది. 'ఆయన తన చర్యలకు తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సిందే. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. దీన్ని రాజకీయం చేయడానికి మేం అనుమతించం' అని జస్టిస్ కాంత్ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేశారు. మంగళవారంలోగా సిట్‌ను ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ దర్యాప్తు బృందంలో రాష్ట్రం బయటి నుంచి ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు ఉండాలని, వారిలో కనీసం ఒకరు మహిళా అధికారి అయి ఉండాలని స్పష్టం చేసింది. మే 28వ తేదీ నాటికి సిట్ తన దర్యాప్తు నివేదికను సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. 'మనది చట్టబద్ధ పాలన అనుసరించే దేశం, ఇది అత్యున్నత స్థాయిలో ఉన్నవారి నుంచి అట్టడుగున ఉన్నవారి వరకు అందరికీ ఒకేలా వర్తిస్తుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జరగబోయే సిట్ దర్యాప్తు మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ఒక 'అగ్నిపరీక్ష' వంటిదని, ఈ కేసును తాము నిశితంగా పర్యవేక్షిస్తామని కోర్టు స్పష్టం చేసింది.

భారత్ ధర్మశాల కాదు

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించింది. కాగా, సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తన వాదన వినిపించారు. వీసాతో తాను భారత్ వచ్చానని, తన ప్రాణాలకు స్వదేశంలో ముప్పు ఉందని కోర్టుకు విన్నవించారు. తన భార్య, పిల్లలు భారత్‌లో స్థిరపడ్డారని, ఇప్పటికి తాను మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని, డిపోర్టేషన్ ప్రక్రియ మొదలు కాలేదని చెప్పారు. దీనిపై జస్టిస్ దత్తా స్పందిస్తూ... 'ప్రపంచంలోని శరణార్థులందరికీ భారత్ ఆతిథ్యం ఇవ్వాలా? ఇప్పటికే 140 కోట్ల జనాభాతో ఉన్నాం. విదేశీయులందరికీ ఇక్కడ ఆశ్రయం ఇవ్వడానికి ఇదేమీ ధర్మశాల కాదు' అని అన్నారు. ఇందుకు ప్రతిగా పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదన వినిపిస్తూ... ఈ అంశం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 19 కిందకు వస్తుందన్నారు. దీనిపై జస్టిస్ దత్తా మాట్లాడుతూ పిటిషనర్‌ను చట్టప్రకారమే కస్టడీలోకి తీసుకున్నందున అతని నిర్బంధం ఆర్టికల్ 21ని ఉల్లంఘించినట్టు కాదన్నారు. ఆర్టికల్ 19 అనేది భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. 'ఇక్కడ సెటిల్ కావడానికి మీకున్న హక్కు ఏమిటి' అని కోర్టు ప్రశ్నించింది. అతను శరణార్థి, అతని ప్రాణాలకు శ్రీలంకలో ప్రమాదం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించగా... మరో దేశానికి వెళ్లండి అంటూ ధర్మాసనం స్పష్టం చేస్తూ పిటిషన్ కొట్టివేసింది.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అధిక ప్రాణనష్టం

(మొదటిపేజీ తరువాయి)

దులుపుకోవడం కాకుండా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. ఐదు లక్షల నష్టపరిహారం సరిపోదని, ఇంటికి, వ్యాపారానికి తీవ్ర నష్టం జరిగిందని, వ్యాపారం ప్రారంభించుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. బీఆర్ఎస్ తరుపున బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కూడా రాష్ట్రాలకు తగిన సూచనలు ఇవ్వాలని ఆయన తెలిపారు.

గుల్జార్‌హౌస్ ఘటన కలచివేసింది...

చార్మినార్ పరిధిలోని గుల్జార్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడడం తీవ్రంగా కలసి వేసిందని చాడా వెంకటరెడ్డి అన్నారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. మృతులకు సంతాపం తెలిపారు.

చెంచు ప్రతినిధులను విడుదల చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఐటీడీఏ పీవోగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు కోరడం తప్పా అని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన పోడుపట్టా భూముల్లో సాగు చేసుకోనివ్వడం లేదనే విషయాన్ని మీకు తెలపాలని రావడమే వారు చేసిన తప్పా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఆరాధ్య దైవాల ద్వారా వచ్చే ఆదాయాన్ని తమ బాగు కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేయడం వారు చేసిన పాపమా అంటూ ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన చెంచు ప్రతినిధులు మల్లికార్జున్, పద్మ, గురువయ్యతోపాటు అమ్రాబాద్ పోలీసు స్టేషన్ లో నిర్బంధించిన చెంచులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అణు సంకేతాలు లేవు

(మొదటిపేజీ తరువాయి)

విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలనే నిర్ణయం ద్వైపాక్షిక స్థాయిలో కుదిరిందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అధ్యక్షత వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో 24 మంది పాల్గొన్నారు. భారత విమానాలకు జరిగే నష్టం గురించిన ఆందోళనలతో సహా సభ్యుల నుంచి వచ్చిన అనేక రకాల ప్రశ్నలకు విదేశాంగ కార్యదర్శి మిస్రి సమాధానమిచ్చారని ఆ వర్గాలు తెలిపాయి. సంఘర్షణను ఆపడంలో తన పాత్ర గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనల గురించి అడిగినప్పుడు, ఇది భారతదేశం, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక విషయం, తదనుగుణంగా కాల్పుల విరమణ నిర్ణయం తీసుకోవడం జరిగింది' అని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

విశాలాంధ్ర - కొమరం భీం : కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనుల పురోగతిని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధి లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. మున్సిపాలిటీ వార్డులలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వార్డులోని తడి చెత్త, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు.

బికేయంయు జిల్లా సభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - తొర్రూర్: జూన్ 8న జరిగే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం (బి కే యం యు) జిల్లా 3వ మహా సభలు జయప్రదం జయప్రదం చేయాలని బికేయంయు జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న పిలుపునిచ్చారు. సోమవారం తొర్రూర్ లైన్స్‌క్లబ్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశం ఘనపురంల లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ మహాసభలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక నిర్ణయాలు తీసుకో బోతున్నామన్నారు. నిరంతరం ఉపాధి హామీ కార్మికుల కోసం రైతాంగం కోసం పేద ప్రజల కోసం, పోరాటాలు చేసే వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఆదరించాలని అన్నారు. ఈ మహా సభలను జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ గ్రామీణ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హెూమ బిక్షపతి, పరిపల్లి వెంకన్న, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్, మందపురి శ్యామ్, సాయిరెడ్డి, నరసింహారెడ్డి, కోటగిరి యాకాంతం, జలగం శ్రీనివాస్, చింతల ఐలయ్య పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర- బ్యూరో మహబూబాబాద్/ తొర్రూర్: ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి, జిల్లా పరిశీలకులు రవళి రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు మండలం రెడ్డి గార్డెన్లో జరిగిన తొర్రూరు పట్టణం మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నిస్వార్థంగా ప్రజల కోసం పని చేస్తోందని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి శక్తిమేరకు కృషి చేయాలని వారన్నారు. ప్రాతినిధ్యానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సంస్థాగతంగా పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలని వారు కోరారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా ముందుకు వెళ్లాలని అన్నారు. మండలంలో పార్టీని శక్తివంతంగా నిలబెట్టేందుకు గ్రామాల వారీగా కార్యవర్గాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ప్రతి కార్యకర్తలో సాన్నిహిత్యం పెంపొందించి, బూత్ స్థాయిలో పార్టీ మద్దతుదారులను సమీకరించడం మా లక్ష్యమని తెలిపారు. ప్రతి మండలంలో తగిన సమన్వయంతో సమీకృతంగా పని చేయడం ద్వారా పార్టీని తిరిగి బలోపేతం చేయవచ్చని, యువతకు ప్రాధాన్యం ఇస్తూనే అనుభవజ్ఞుల సహకారం తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి సమర్థవంతమైన నాయకత్వం ఉన్నందున వచ్చే ఎన్నికల్లో విజయం సాధించగలగాలని విశ్వాసం ఉందని చెప్పారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం ప్రతినిధులు, యువనాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - గూడూరు: గ్రామ దేవత బొడ్రాయి పున:ప్రతిష్ట కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే భూక్ మురళి నాయక్, మాజీ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌లు పాల్గొని బొడ్రాయికి పూజలు చేశారు. గూడూరు మండలం దుబ్బగూడెం గ్రామంలో 17వ తారీకు శనివారం నుండి 19వ తారీకు సోమవారం వరకు బొడ్రాయి పునః ప్రతిష్ట మహెూత్సవంలో గ్రామస్తులందరూ పాల్గొన్నారు. బొడ్రాయితో పాటు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట గ్రామస్తులు నిర్వహించారు. గణపతి పూజతో మొదలై మంగళ తోరణాలు సుప్రభాత సేవ, గ్రామదేవతలకు పూజలు, కుంకుమ పూజలు అష్టలక్ష్మి పూజలు, మూర్తి హెూమం, శక్తి హెూమం శనివారం నిర్వహించి, మండప దేవత పూజలు క్షేత్రపాలక, నవగ్రహ, ఆవాహిత పూజలను 18వ తేదీన ఆదివారం జరిపారు. 19వ తేదీన బొడ్రాయి స్థాపన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట ను జరిపి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేశారు. సాయంత్రం 6 గంటలకు గ్రామంలో బలి చల్లారు. 20వ తేదీన మంగళవారం రోజున దుర్గమ్మ పండుగను నిర్వహిస్తున్నామని మాజీ సర్పంచ్ జోజి తెలిపారు. పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, మాజీ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బొడ్రాయి పూజలలో పాల్గొని టెంకాయలు కొట్టారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ కొమ్మలు, వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, జిల్లా నాయకులు ప్రదీప్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు తేజవత రవి, వార్డు మెంబర్లు బోడ శ్రీను, భూక్య బద్రు, ధరంసోతు లింగ్య, బానోతు వస్య, యూత్ అధ్యక్షులు బానోతు సరేష్ గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యా సంస్థలను సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థుల ప్రవేశానికి అవగాహనకై వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : మైనార్టీ విద్యాసంస్థల్లో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశానికై అర్హులైన విద్యార్థులు దగ్గర్లోని మైనార్టీ విద్యాసంస్థలలో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మైనారిటీ విద్యాసంస్థలలో విద్యార్థుల ప్రవేశానికి అవగాహనకై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. జిల్లాలో 13 మైనార్టీ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, వీటిలో 5 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు ఒక్కో తరగతిలో సుమారు 60 వరకు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులతో ఈ ఖాళీ సీట్లను భర్తీ చేయడం జరుగుతుందశని, ప్రవేశ ప్రక్రియ ఇదివరకే పూర్తయినప్పటికీ, ఖాళీలు ఉన్నందున ముందుగా వచ్చిన వారికి ముందుగా సీట్లు ఇచ్చే పద్ధతిని పాటిస్తున్నట్లు తెలిపారు. ఈ మైనార్టీ విద్యా సంస్థలలో సీటు సాధించిన విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను, ప్రత్యేకించి వసతి, భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జిల్లాలో (6) మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండగా, వాటిలో మూడు బాలురకు, మూడు బాలికలకు ఉన్నాయని, ఆయా తరగతులలో ప్రవేశం కోసం విద్యార్థులు ఆధార్ కార్డ్, స్టడీ సర్టిఫికెట్, కండక్ట్ సర్టిఫికెట్, రికార్డ్ షీట్ లేదా టిసిని జత చేయాలని, అలాగే తల్లిదండ్రుల ఆదాయం, కులం ధ్రువపత్రాలు జత చేయాలని చెప్పారు. జూన్ 12 లోపు మైనారిటీ పాఠశాలల్లో ప్రవేశం పొందే విధంగా అవసరమైన వారు దగ్గరలోని మైనార్టీ పాఠశాలను సంప్రదించాలన్నారు. ఇదివరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోనప్పటికీ, సీట్లు ఉంటే ఇవ్వడం జరుగుతుందని, అందువల్ల దగ్గర్లో ఉన్న మైనార్టీ పాఠశాలలో లేదా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల రీజినల్ కో-ఆర్డినేటర్ సెల్ నెంబర్ 7331170877 ను సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, ఇన్చార్జి డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఏ శేఖర్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, మైనార్టీ విద్యాసంస్థల జిల్లా అధికారి విజయేందర్ రెడ్డి, ఆర్ సి ఓ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - పినపాక: పినపాక నియోజకవర్గ పరిధిలో అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని తరుగు వంక చెప్పకుండా వెంటనే కొనుగోలు చేయాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టరెట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, ఐకేపి, సహకార సంఘాల ద్వారా ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, తడిసిన ధాన్యాన్ని రైతుల నుండి సత్వరమే కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని కోరారు. కొనుగోలును వేగంగా పూర్తి చేయాలని లేకుంటే అకాల వర్షాలు ఇంకా పెరిగే అవకాశముందన్నారు. ఇప్పటికి ధాన్యం కొనుగోలు కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మరో వైపు మిల్లర్లు తరుగు పేరుతో క్వింటాల్‌కు రెండు నుంచి 4 కిలోల వరకు తగ్గిస్తున్నా రని విమర్శించారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. రవి అభ్యర్థనలు విన్న కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలకు అధికారులను ఆదేశించారు.

ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర- వనపర్తి : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనప కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 45 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ప్రజావాణిలో వచ్చిన ప్రజల దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా ఆమె స్వీకరించారు. రైతు రుణమాఫీ, వైద్యం, విద్య, వ్యవసాయం, భూ వివాదాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల మంజూరు, పింఛను, తదితర సమస్యల పరిష్కారానికి ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాఖలవారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. పరిష్కార వివరాలను దరఖాస్తుదారులకు అందించడంతో పాటు, సంబంధిత ఫైళ్లలో స్పష్టమైన రిమార్కులు చేర్చాలని ఆదేశించారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రారంభించిన టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని కలెక్టర్ తెలిపారు. ఫోన్ ద్వారా వచ్చిన అర్జీలను నమోదు చేసి, వాట్సాప్ ద్వారా రసీదు పంపే విధానాన్ని అమలు చేశారు. జిల్లా లో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెలాఖరులోగా అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని, మండల ప్రత్యేకాధికారులు మండల స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల పరిశీలన, బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడం, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల చేరిక పెంచే చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: రామగుండం నగరంలో 37వ డివిజన్‌లో సోమవారం టీయుఎఫ్ఐడిసి నిధులతో రూ.30 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి విషయంలో ఉద్యోగ కల్పన విషయంలో ముందు వరుసలో నిలపెడుతున్నామని అన్నారు. 300 కోట్లతో వివిధ అభివృద్ధి పనుల జరుగుతున్నాయని అన్నారు. మంచినీటి వ్యవస్థ మెరుగుకోసం 90 కోట్లల రూపాయలు ఖర్చుచేస్తున్నామన్నారు. కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మొదటి సారిగా రాష్ట్రంలో 60 వేల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కౌటం సతీష్ తో పాటు పార్టీ సీనియర్ నాయకులు తాజా మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కొర్రీలు పెట్టకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్ల సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరిపెడ మండలం నీలికుర్తి గ్రామ శాఖ సమావేశం జరగగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో జరిగే అవకతవకలపై అధికారులను నిలదీసి ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరే విధంగా కమ్యూనిస్టు కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించడంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైనదని, ప్రజలలో భావోద్వేగాలను రెచ్చగొడుతూ పాలన చేస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను సంక్షోభంలో నెట్టే విధానాలకు పాల్పడాన్ని ప్రజాస్వామికవాదులు ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. నీలికుర్తి గ్రామ కార్యదర్శిగా అనపర్తి సత్యంను ఐదుగురినీ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నీలికుర్తి గ్రామ కమిటీ సభ్యులు ఇటీవల ఆత్మ మరిపెడ డివిజన్ చైర్మన్‌గా ఎన్నికైన నల్లు సుధాకర్ రెడ్డిని ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్ పోలేపాక వెంకన్న, గాడి పల్లి వెంకన్న మల్లేష్, శీను, రవి పాల్గొన్నారు.

మున్నేరు నీటిని పాలేరుకు తరలించడం అన్యాయం

విశాలాంధ్ర - గార్ల : కాంగ్రెస్ ప్రభుత్వం మున్నేరు నీటిని, పాలేరుకు తరలించడం అన్యాయం, రాజ్యాంగ విరుద్ధమని గోదావరి జల సాధన సమితి చైర్మన్ విశ్వ జంపాల ఆవేదన వ్యక్తం చేసారు. మున్నేరు నీటిని పాలేరుకు తరలించేందుకు విడుదల చేసిన జీవో నెంబర్ 98ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో గోదావరి జల సాధన సమితి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ జంపాల మాట్లాడుతూ మున్నేరు ప్రాజెక్టు నిర్మించి ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు త్రాగు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మున్నేరు ప్రాజెక్టును పెండింగ్ లో ఉంచి ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారని విమర్శించారు. మున్నేరు ప్రాజెక్టును జీవోలకు, సర్వేలకు పరిమితం చేసి ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలకు నీరు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టును ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు రాకుండా చేయడమే గాక మున్నేరు నీళ్లను సైతం ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు రాకుండా చేసే కుట్రలో భాగంగానే మున్నేరు నీటిని సీతారామ కెనాల్ ద్వారా పాలేరుకు తరలించడానికి 98 జీవోను విడుదల చేసినట్లు విమర్శించారు. దీనికోసం రూ.162 కోట్లు ప్రజా ధనాన్ని ఖర్చు పెట్టడానికి సిద్ధపడిందన్నారు. కానీ రూ. 100 కోట్ల మున్నేరు ప్రాజెక్టు నిర్మిస్తే గార్ల, డోర్నకల్, కారేపల్లి, కామేపల్లి, ఖమ్మం రూరల్ మండలాలకు సాగు, తాగు నీరు అందుతుందని వివరించారు. అఖిల పక్ష నాయకులు గుగులోత్ సక్రు, గౌని భద్రయ్య, జంపాల వెంకన్న, నాగేంద్ర పవన్ కుమార్, గిన్నారపు మురళి తారక రామారావు, ముంగి రాములు, మహిళా శ్రేణులు శారద, అనసూర్య, భారతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి అధ్యక్షుడిగా పండరి ఏకగ్రీవంగా ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సంగారెడ్డి టౌన్ యూనిట్ ఏకగ్రీవగా ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి అధ్యక్షులు కార్యదర్శులు మహమ్మద్ షరీఫ్ జె. నాగరాజు, తెలిపారు. సోమవారం స్థానిక తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో బైపాస్ రోడ్ నందు జరిగిన ఎన్నికలలో ముఖ్య అతిథులుగా నాయకులు వెంకటేశం, వి.యాదవ రెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పండరి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన బాధ్యత అప్పజెప్పిన జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షునిగా పండరి, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ జిల్లా పౌర సంబంధాల కార్యాలయం, మహమ్మద్ మసూద్ సహాయ అధ్యకుడు ఆఫీస్ ఆర్డినేట్, మిషన్ భగీరథ కార్యాలయం, ఎం. సాయిబాబా ఆఫీస్ సబ్ ఆర్డినేట్ సూపరిం టెండెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం ఇరిగేషన్ మహమ్మద్ అబ్దుల్ రహీం ఉపాధ్యక్షుడు -2ఆఫీస్ సబ్ ఆర్డినేట్ జిల్లా విశువైద్య శాఖ కార్యాలయం సుహాసిని ఉపా అధ్యక్షురాలు-3 ఆఫీస్ సబ్ ఆర్డినేట్ జిల్లా పౌర సంబంధాల కార్యాలయం సంగారెడ్డి కార్యదర్శ యస్.శ్రీకాంత్ ఆఫీస్ సబ్ ఆర్డినేట్ డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం- సంగారెడ్డి విద్యాసాగర్ సంయుక్త కార్యదర్శి ఆఫీస్ సబ్ఆర్డినేట్ రోడ్లు, జి. అనిల్ కుమార్ సంయుక్త కార్యదర్శి- 2 ఆఫీస్ సబ్ ఆర్డినేట్ సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాహనాల పన్నులు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: జిల్లాలో ఉన్న వాహనాలన్నిటికీ పన్నులు విధిగా చెల్లించాలని వరంగల్ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పురుషోత్తం కోరారు. సోమవారం కొత్తగూడెం రవాణా శాఖ కార్యాలయ పరిశీలనకు వచ్చిన కమిషనర్ పురుషోత్తం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు నిర్ణీత సమయంలో విధిగా పన్నులు చెల్లించాలన్నారు. లేకుంటే అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు. జిల్లాలో కొన్ని వాహనాల విషయంలో చెల్లింపులు పెండింగ్లో ఉన్నట్టు తెలుస్తుందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ఆరంభం నాటికి బస్సుల ఫిట్నెస్‌తో పాటు పన్నుల చెల్లింపులు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ వాహనాలు విధిగా రోడ్డు పన్ను చెల్లించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వాహనాలన్నింటికీ నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించుకోవాలని లేకుంటే ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, కొత్తగూడెం ఎం వి ఐ మనోహర్, ఎంవిఐ నిర్మలారెడ్డి, భద్రాచలం ఎం వి ఐ వెంకట పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమశేఖర్ మృతిపై విచారణ జరపాలి : సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం మున్సిపల్ శాఖలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న మేడి హరి కుమారుడు మేడి సోమశేఖర్ (15) అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా సంబంధిత పోలీస్ శాఖా అధికారులను కోరారు. సోమశేఖర్ మృతదేహాన్ని సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో సందర్శించి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను సాబీర్ ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశేఖర్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేసి న్యాయ విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలనీ కోరారు. తల్లిదండ్రులకు కడుపుకోత తీర్చలేనిదని, తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని కోరారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు లగడపాటి రమేష్, బత్తుల నాగరాజు, నవీన్, సుధాకర్ తదితరులు వున్నారు.

గౌడ కులస్తుల జీవనోపాధికి

నీరా కేఫ్ సెంటర్లు ఏర్పాటు చేయించాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : గౌడ కులస్తుల జీవనోపాధికి నీరా కేఫ్ సెంటర్లు ఏర్పాటు చేయించాలి ఆర్పిఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోట శివశంకర్ డిమాండ్ చేసారు. బిజెపి కిసాన్ మోర్చా చుంచుపల్లి మండల అధ్యక్షుడు సాంబయ్య గౌడ్‌తో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందించారు. నిరుపేద బీసీల జీవనోపాధి కోసం నీరా కేఫ్ సెంటర్లను ఏర్పాటు చేయించే విధంగా కలెక్టర్, ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవాలని శివశంకర్ కోరారు. ప్రభుత్వం ఆమె మద్యం కంటే ప్రజల ఆరోగ్యానికి మేలు చేసే నీరా మీరా పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. తాటి చెట్టు ద్వారా వచ్చే అద్భుతమైన పానీయాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా గౌడ సోదరులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. నీరా తీయడంలో హైదరాబాదులో సుమారు ఆరు నెలలు శిక్షణ పొందిన సాంబయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిరాకేఫ్ సెంటర్‌ను బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేయించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు. ఉత్పత్తులు, వాటికి కావాల్సిన యంత్ర సామాగ్రిని కలెక్టర్ నిధులు, లేదా సిఎస్ఆర్ నిధులనుంచి మంజూరు చేసి ఒక సొసైటీ ఏర్పాటు చేసి గౌడన్నలను ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జంగా రామచందర్, అంబటి పూర్ణచందర్, ఆర్‌పిఐ పార్టీ నాయకులు రాజు, సాల్మన్ రాజ్ పాల్గొన్నారు.

పోడు భూములు గిరిజనులకు ఇవ్వాలి

విశాలాంధ్ర - భద్రాచలం : దుమ్ముగూడెం మండలం చిన్న బండిరేవు పంచాయితీ లోని గద్దూరి గట్టు గ్రామంలో పోడు భూముల సాగు చేస్తున్న 25 మంది గిరిజనులకు భూములు అప్పగించాలని న్యూడెమోక్రసి నేతలు డిమాండ్ చేసారు. ఆ భూములు ఆర్ ఓ ఎఫ్ ఆర్ రిజిస్ట్రేషన్ కూడా అయ్యాయని, గిరిజనులు అనేక నిర్బంధను కూడా అనుభవించారన్నారు. ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా లాక్కున్న ఆ భూములను తిరిగి గిరిజనులకు ఇవ్వాలని కోరుతూ ఐటీడీఏ పిఓ రాహుల్ కు సోమవారం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ బృందం వినతిపత్రం సమర్పించారు. అనంతరం న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ మాట్లాడుతూ ఆర్ఎఫ్ఓఆర్ రిజిస్ట్రేషన్ అయినప్పటికీ పట్టాలు కల్పించలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కును కూడా ఈ అధికారులు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. ఫారెస్ట్ అధికారులు గతంలో ఆ గ్రామస్తులను 25 మందిని చెట్ల కట్టేసి చిత్ర హింసలు చేసి కొట్టారని గుర్తు చేసారు. వున్న వారికే చట్టాలు చుట్టాలుగా మారాయన్నారు. ఫారెస్ట్, పోలీస్ అధికారుల తీరును పేదలకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. గిరిజనులు పోడు కొట్టుకున్న 49 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకురాలు కప్పల సూర్యకాంతం, కోట నాగమణి, రాజమ్మ, రమేష్, రాజు గద్దురు గట్టు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు అండగా జిల్లా యంత్రాంగం

విశాలాంధ్ర - మరిపెడ: జిల్లా యంత్రాంగమంతా రైతులకు అండగా ఉందని పౌరస రఫరాల శాఖ అధికారి ఏ. ప్రేమ్ కుమార్, డీఎం సీఎస్ కృష్ణవేణి పేర్కొన్నారు. సోమవారం జిల్లాలోని మరిపెడ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, లతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మరిపెడలో గత రబీ సీజన్ 2023- 24, లో 6346, మెట్రిక్ టన్నులు కాగా ఈ రబీ సీజన్లో 2024- 25 ఇప్పటి వరకు అత్యధికంగా 35,571, మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలింపు జరిగిందన్నారు. యాసంగి 2024-25 కాలానికి సంబంధించి జిల్లాలో ఇప్పటివరకు లక్షా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని, గత రబీ సీజన్ తో పోలిస్తే ఈసారి ధాన్యం సేకరణ నాలుగింతలు దిగుబడి పెరిగిందని, ఇప్పటివరకు జిల్లాలో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తయినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ నిత్యం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, ధాన్యం సేకరణ, తరలింపును సమర్థవంతంగా నిర్వహించడానికి 18 మండలాల తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులను పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందన్నారు.

సంపాదకీయం

న్యాయవ్యవస్థను లొంగదీసే యత్నం

మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మన ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల స్తంభాలైన చట్టసభలు, కార్య నిర్వాహకవర్గం, కడకు న్యాయవ్యవస్థను కూడా గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన రంజన్ గొగోయ్ నుంచి ఇటీవల పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా కన్నా ముందు ఆ పదవిలో ఉన్న వారందరూ గుట్టు చప్పుడు కాకుండా న్యాయ వ్యవస్థను కార్యనిర్వాహకవర్గం కబళించే యత్నాలను చూస్తూ మౌన ప్రేక్షకులుగా ఉండి పోయారు. పూర్వ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ప్రభుత్వ ఒత్తిడిని ఖాతరు చేయలేదు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అయితే లొంగిపోకుండా ఉండడమే కాక ప్రభుత్వ పెత్తనాన్ని ప్రతిఘటిస్తున్నారు. అందుకే ఆయన రాజ్యవ్యవస్థలోని చట్టసభలు, కార్యనిర్వాహకవర్గం, న్యాయవ్యవస్థ ఒకదానికన్నా మరొకటి అధికం కాదని గవాయ్ ప్రధాన న్యాయమూర్తి అయిన కొద్ది రోజుల్లోనే అనేక సార్లు స్పష్టం చేశారు. అన్నింటికన్నా రాజ్యాంగమే అధికం అని నొక్కి చెప్తున్నారు. ఆయన ఈ మాట చెప్పడానికి కారణం మోదీ ప్రభుత్వం న్యాయవ్యవస్థను లొంగదీసుకునే ప్రయత్నాలను ఎదిరించే ఉద్దేశమే. న్యాయమూర్తి ఖన్నా, న్యాయమూర్తి గవాయ్ పదవీ విరమణ తరవాత ప్రభుత్వం ఇవ్వజూపే ఏ పదవులూ, బాధ్యతలూ అంగీకరించబోమని చెప్పారు. ఇది తాము స్వతంత్రంగా వ్యవహరిస్తామని, రాజ్యాంగానికి మాత్రమే నిబద్ధమై పని చేస్తామని చెప్పడంతో పాటు ప్రభుత్వానికి లొంగేది లేదని స్పష్టం చేయడం కూడా. న్యాయమూర్తి గవాయ్ ఇంత నిక్కచ్చిగా వ్యవహరిస్తారని కేంద్రంలోనూ, బీజేపీ పాలిత రాష్ట్రాలలోని బీజేపీ నాయకులకు సరిగ్గానే అర్థం అయింది. అందుకే ఏదో ఒక రీతిలో గవాయ్‌ని అవమానించడానికి నిర్ణయించుకున్నట్టున్నారు. గవాయ్ మహారాష్ట్రకు చెందిన వారు. మహారాష్ట్ర న్యాయవాదుల సంఘం ఆయనను సన్మానించింది. ఆయన ఆ సన్మానం కోసం ముంబై వెళ్లినప్పుడు మహారాష్ట్రలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కావాలనే ఆయనను విస్మరించింది. ఆయన ముంబైలో దిగిన తరవాత అధికార మర్యాదల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు డైరెక్టర్ జనరల్ స్వాగతం చెప్పడం అధికార మర్యాదల్లో భాగం. కానీ వారిద్దరూ ఆ పని చేయనే లేదు. ఇది ప్రధాన న్యాయమూర్తి మనసు నొప్పించడం అత్యంత సహజం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు డైరెక్టర్ జనరల్ స్వాగతం చెప్పాలనుకుంటారో లేదో వారి ఇష్టం కావొచ్చు. కానీ అధికార మర్యాద ఒకటి ఉంటుంది అని గవాయ్ గుర్తు చేశారు. రాజ్య వ్యవస్థలోని మూడు అంగాలు పరస్పరం గౌరవించుకోవాలని అన్నారు. తానూ మహారాష్ట్రకు చెందిన వాడినే అయినా, ప్రధాన న్యాయమూర్తిగా మొదటిసారి మహారాష్ట్రకు వెళ్లినా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు డైరెక్టర్ జనరల్ కనిపించకపోవడం కార్య నిర్వాహక వర్గం న్యాయ వ్యవస్థను గౌరవించకపోవడమేనని గవాయ్ స్వయంగా చెప్పక్కర్లేదు. ఈ కనీస మర్యాద గురించి అందరికీ తెలుసు. ఆ మర్యాద పాటించలేదంటే దాని వెనక ప్రభుత్వ వైఖరి ఏమిటో బలంగా కనిపిస్తూనే ఉంది. తాను ఇలాంటి చిన్న చిన్న విషయాలు పట్టించుకోనని, అయితే ప్రజలకు ఈ విషయం తెలియాలని కూడా ప్రధాన న్యాయమూర్తి గవాయ్ అన్నారు. కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం రాజ్య వ్యవస్థలోని మూడు అంగాల పరిధిని స్పష్టంగానే నిర్దేశించిన విషయాన్ని గవాయ్ గుర్తు చేశారు.

చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ ఆమోదం కోసం పంపితే వాటిని నెలల తరబడి ఏ నిర్ణయమూ తీసుకోకుండా అట్టి పెట్టడం చట్ట విరుద్ధమైందని ఈ మధ్యే సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పార్దీవాలా, మాహ్దేవన్ తీర్పు చెప్పారు. తమ కింద జోహుకుందార్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్లకు సుప్రీంకోర్టు బిల్లుల ఆమోదానికి నిర్ణీత గడువు విధించడం కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి ఏ మాత్రం మింగుడు పడలేదు. చోటా మోటా బీజేపీ నాయకులు కూడా ఈ అంశంపై వ్యాఖ్యానించి అత్యున్నత న్యాయస్థానానికి జ్ఞాన బోధ చేయడానికి ప్రయత్నించారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాలకు రాష్ట్రపతి ఆమోదించడానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలను సహించలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో 142వ అధికరణం కింద 14 అంశాలతో కూడిన లేఖ రాయించారు. గవాయ్ నాయకత్వంలోని సుప్రీంకోర్టు రాష్ట్రపతికి వెంటనే సమాధానం పంపించింది. 2016లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మార్గదర్శక సూత్రాల ప్రకారమే తాము ఈ గడువు విధించామని సుప్రీంకోర్టు అనుమానాలకు తావు లేకుండా చెప్పేసింది. గవర్నర్లు, రాష్ట్రపతి ఒక వేళ చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులను ఆమోదించకపోవడానికి అభ్యంతరాలు ఏమైనా ఉంటే అవేమిటో లిఖిత రూపంలో తెలియజేయాలని కూడా సుప్రీంకోర్టు కరాఖండిగా చెప్పేసింది. న్యాయవ్యవస్థ మీద కార్యనిర్వాహక వర్గం దాడి చేయడం, బెదిరించి లొంగ దీసుకోవాలనుకోవడం మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడైతే ఆయన న్యాయవ్యవస్థను వేలెత్తి చూపని రోజే లేదు. రాష్ట్రపతికి ఏ విషయంలోనైనా న్యాయ సంబంధ అనుమానాలు వస్తే 142వ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు సలహా కోరవచ్చు. లేఖ రాయొచ్చు. కానీ ఆ లేఖను బహిరంగ పరచవలసిన అవసరం ఏమిటో ఆమెకు తెలిసినా తెలియకపోయినా ఆమె చేత లేఖ రాయించిన కేంద్ర ప్రభుత్వ పెద్దలకు కచ్చితంగా తెలుసు. గవర్నర్లకు, చివరకు రాష్ట్రపతికి కూడా బిల్లులు ఆమోదించడానికి సుప్రీంకోర్టు గడువు విధించడాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ కూడా జీర్ణించుకోలేక పోయారు. సుప్రీంకోర్టు ఇలాంటి ఆదేశాలు చేయడం అణ్వస్త్రాలు ప్రయోగించినట్టు ఉందని అనవసరమైన అతిశయోక్తులతో ధన్కర్ తప్పు పట్టారు. ధన్కర్‌కు న్యాయవ్యవస్థ అనుపానులు తెలియక ఈ విమర్శ చేయలేదు. ఆయన సుదీర్ఘ కాలం హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ న్యాయవాదిగా పని చేశారు. కానీ ఉపరాష్ట్రపతి అయిన తరవాత, అంతకన్నా పెద్ద పదవి మీద ఆశలు పెంచుకున్న తరవాత ఆయన ప్రభుత్వ అనుకూల వాణి ఎడతెరిపి లేకుండా వినిపిస్తున్నారు. రాజ్యసభ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించే క్రమంలోనూ ఆయన ప్రభుత్వం తరఫున వకాల్తా పుచ్చుకున్నట్టుగానే వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష సభ్యులు ఏదైన అంశం లేవనెత్తగానే వారికి మాట్లాడే అవకాశమే ఇవ్వరు. ఒక వేళ ఇచ్చినా ఆ అంశాలకు అధికార పక్షం వారు సమాధానం ఇచ్చే దాకా ఆగకుండా తానే ప్రభుత్వ వైఖరిని వివరించే పనిలో నిమగ్నమైపోతారు. ఏ ప్రధాన న్యాయమూర్తికైనా పదవీ కాలం చిన్నదా పెద్దదా అన్నది అంత ముఖ్యం కాదు. పూర్వ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా పదవీ కాలం కూడా ఆరు నెలల కన్నా ఎక్కువ లేదు. గవాయ్ పదవీ కాలమూ అంతే. ఈ న్యాయమూర్తులకు న్యాయవ్యవస్థ స్వతంత్రతను నిలబెట్టే లక్ష్యం ఉంది. రాజ్యాంగమే సర్వోపరి అన్న స్పృహ ఉంది. మోదీ ప్రభుత్వ ఇబ్బందల్లా ఇదే. గాడిన పడ్తున్న న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేయడం క్షమించదగింది కాదు.

రాఫెల్ మార్కెట్‌కు ముప్పు!

ఎం కోటేశ్వరరావు

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మన మిలిటరీ జరిపిన ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించిన ఆయుధాలు, పాకిస్థాన్ ప్రయోగించిన వాటి గురించి దేశంలో, ప్రపంచ వ్యాపితంగా చర్చ జరుగుతోంది. ఉద్రిక్తతల సమయాల్లో వెలువడే అభిప్రాయాలు పూర్తిగా నిజమే లేదా పూర్తిగా అవాస్తవమే అని భావించినా పప్పులో కాలేసినట్లే. ఆయుధ దాడులు కొన్ని ప్రాంతాలకే పరిమితం అయితే దానికంటే ప్రమాదకరమైన తప్పుడు వార్తల ప్రచార దాడి ఎక్కువగా జరుగుతోంది. అందువలన వినదగు నెవ్వరు చెప్పిన... అన్నట్లుగా వేగిరపడకుండా నిదానంగా వాస్తవాలు తెలుసుకోవాలి. ఈ క్రమంలో సంక్షిప్తంగా కొన్ని అభిప్రాయాలను చూద్దాం. వాటితో ఎవరైనా విభేదించవచ్చు, ఏకీభవించవచ్చు. క్షిపణుల తయారీ మన శాస్త్రవేత్తల ఘనత తప్ప రాజకీయ నేతలది కాదు. మన దేశం ఆయుధాల ఎగుమతి గురించి గోరంతలను కొండంతలు చేస్తూ నరేంద్రమోదీ భజన చేస్తున్నది. ఇదీ ప్రచార దాడే !

చైనా బజార్ల పేరుతో అమ్మిన దిల్లీ నకిలీ సరుకునంతా చైనాకు అంటగట్టి తూలనాడిన రోజులున్నాయి. కొన్ని వస్తువుల నాణ్యత ప్రశ్నార్ధకంగా ఉండవచ్చు. వాటిని కొనాలని చైనా ఎవరినీ బలవంతం చేయలేదు. ఇప్పుడు దాని ఆయుధాల నాణ్యత గురించి చర్చ జరుగుతోంది. చైనా తయారీ నూతన ఆయుధాలను ఏ యుద్ధం లేదా ఘర్షణల్లో ప్రత్యక్షంగా వాడని మాట వాస్తవం. అమెరికా తన ఆయుధాలకు ఇరాన్, ఇరాక్, ఇతర యుద్ధాలను ప్రయోగశాలలుగా చేసుకున్నది. అందుకని అనేక మందికి చైనా వాటి సామర్థ్యం మీద అనుమానాలు ఉండటం సహజం. పాకిస్థాన్ వాటిని మనదేశం మీద ప్రయోగించిన తరువాత అనుకూలంగా వ్యతిరేకంగా విశ్లేషణలు వెలువడుతున్నాయి. తాజాగా కొత్త పల్లవి అందుకున్నారు. చైనా ఆయుధాల వెల తక్కువేగానీ, వాటి నిర్వహణ, మరమ్మతులు ఖర్చు ఎక్కువ అంటూ కొందరు అమెరికా, ఐరోపా ధనిక దేశాల ఆయుధాల నిపుణులు చాణక్య నీతిని ప్రయోగిస్తున్నారు. పాకిస్థాన్ ఉపయోగించిన చైనా ఆయుధాలను చూసిన తరువాత వాటి సామర్థ్యంపై నెలకొన్న ఆందోళనకు ముగింపు పలికినట్లు కనిపిస్తోందని అకడమిక్ గులాం అలీ పేర్కొన్నారు. "రాఫెల్ కూల్చివేత : ప్రపంచ వేదికపై చైనా ఆయుధాలకు ఒక మలుపు ?" అని సింగపూర్ ప్రెస్ హోల్డింగ్స్ అనే సింగపూర్ కంపెనీ నిర్వహిస్తున్న " థింక్‌చైనా " అనే పత్రిక(వెబ్) 2025 మే 16 వ తేదీన ప్రచురించిన విశ్లేషణలో ఉంది. పశ్చిమ దేశాలు అమ్మే ఆయుధాలకు షరతులు ఉంటాయి, చైనా ఎలాంటి ఆంక్షలు పెట్టదు. ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవచ్చు. వెల తక్కువ, పశ్చిమదేశాల వాటితో పోలిస్తే నాణ్యత తక్కువని భావించటానికి ప్రధాన కారణాలలో ఇది ఒకటి. 1979 తరువాత నేరుగా చైనా ఆయుధాలను ఉపయోగించిన దాఖలా లేదు గనుక నాణ్యత గురించి అనుమానం. అందుకే అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఆయుధాలకు ప్రాధాన్యత ఇస్తారు. మే నెల ఏడవ తేదీ చైనా జెట్ విమానాలకు అమర్చిన చైనా క్షిపణులతో పాకిస్థాన్ ఐదు భారత జెట్‌లను కూల్చివేసింది గనుక ఈ ఉదంతం చైనా ఆయుధాల గురించి ఉన్న అభిప్రాయాన్ని గణనీయంగా దెబ్బతీసింది. దీంతో మార్కెట్లో చైనా వాటా పెరిగింది. రంగంలో ఒక రాఫెల్ జెట్‌ను కూల్చివేయటం దాని చరిత్రలో ఇదే తొలిసారి, అదే విధంగా చైనా జె-10, పీఎల్-15 క్షిపణికి కూడా ఇదే ప్రథమం. మూడు రాఫెల్ జెట్‌లను కూల్చివేసినట్లు పాకిస్థాన్ ప్రకటించగానే వాటి తయారీ సంస్థ దసాల్ట్ వాటాల ధర ఆరు శాతం తగ్గింది, మరో ఐదు శాతం తగ్గవచ్చని భావిస్తున్నారు. చైనా జెట్‌ల తయారీ కంపెనీ ఏవీఐసీ ధర ఒక్క రోజే 17.05 శాతం, మరో కంపెనీ 6 శాతం, మొత్తంగా చైనా ఆయుధ కంపెనీల వాటాలు 1.6 శాతం పెరిగాయి. ఈ పరిణామం అనేక ప్రాంతాల్లో చైనా పలుకుబడి, విశ్వసనీయత పెరగటానికి తోడ్పడుతుంది.

స్విడ్జర్లాండ్ వెబ్ పోర్టల్ ఎన్‌జెడ్‌జెడ్.సిహెచ్ మే 16 వ తేదీన ప్రచురించిన విశ్లేషణకు " పాకిస్థాన్‌పై భారత్ దాడి సమయంలో ఫ్రెంచి రాఫెల్ కూల్చివేత పశ్చిమ దేశాలకు పాఠం చెబుతుంది " అని పెట్టారు. పాకిస్థాన్, దాని ఆక్రమణలో ఉన్న కశ్మీరుపై భారత్ జరిపిన దాడి సందర్భంగా చైనా నిర్మిత జెట్‌తో భారత్ కనీసం ఫ్రాన్సు నిర్మించిన ఒక ఆధునిక జెట్‌ను కోల్పోయింది. ఈ నష్టం తన సొంత మిలిటరీ వ్యూహాలను పరిశీలించుకొనేందుకు ఐరోపాకు ఒక మేల్కొలుపు. ఈ ఉదంతం పశ్చిమ దేశాల మిలిటరీ సాంకేతికతల సామర్థ్యం గురించి ఆందోళన కలిగించింది. ఐరోపా వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి రాఫెల్ మీద చాలా ఎక్కువగా ఆధారపడి ఉంది. పశ్చిమ దేశాల వైమానిక దళాలు చైనా, రష్యా రక్షణ వ్యవస్థలకు వ్యతిరేకంగా తమ సన్నద్ధతను మెరుగుపరచుకోవాలి. పరిస్థితికి తగిన జాగరూకత లేకపోతే ఆధునిక పరిజ్ఞానం మీదే ఆధారపడితే కుదరదు. అమెరికా, ఇజ్రాయెల్ మాదిరి ఎలాంటి నష్టం లేకుండా చూసుకొనేందుకు ముందస్తు సూచన లేకుండా భారత్ కూడా చేసింది, భారత వైమానికులు తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్నారు. సాంకేతికంగా ఉన్నతంగా ఉన్నామనే భావన మీద ఆధారపడి పాకిస్థాన్ సామర్థ్యాలను భారత్ తక్కువ అంచనా వేసింది. మరోవైపు చైనా జె-10 జెట్, పిఎల్-15 క్షిపణి సామర్థ్యం గురించి వైమానిక దళం తక్కువ అంచనా వేసింది.

డిఫెన్స్ ఇండస్ట్రీ యూరోప్ అనే వెబ్‌సైట్ " కశ్మీరు వివాదంలో భారత రాఫెల్ ఫైటర్ జెట్ కూల్చివేత " అనే శీర్షికతో విశ్లేషణ చేసింది. భారత్ ఒక రాఫెల్ జెట్‌ను కోల్పోయినట్లు పేర్కొన్నది. అనధికారికంగా ఫ్రెంచి అధికారులు నిర్ధారించారు, అమెరికా వర్గాలు కూడా చెప్పాయని తెలిపింది. డిఫెన్స్ సెక్యూరిటీ ఆసియా అనే వెబ్‌సైట్ మే 15 వ తేదీన వెల్లడించిన విశ్లేషణకు " రాఫెల్ కూల్చివేత? బిలియన్ల డాలర్ల ఒప్పందంపై ఇండోనేషియా పునఃసమీక్షలో పడటంతో ఫ్రెంచి జెట్ పరువుపై దాడి " అని పేరు పెట్టింది. మూడు భారత రాఫెల్ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ ప్రకటించటంతో ఇండోనేషియా ఉన్నత స్థాయి రక్షణ అధికారులు రాఫెల్ యుద్ధ సామర్థ్యం గురించి సమీక్ష చేస్తున్నట్లు తెలిసింది. ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి వెలువడిన ప్రకటనల ఆధారంగా నిర్ధారణలకు రాకూడదని నిపుణులు హెచ్చరించినట్లు కూడా దానిలో ఉటంకించారు. ఎంతో అనుభవం ఉన్న అమెరికా తయారీ ఎఫ్-16,18,22 రకాలను కూడా కూల్చివేశారని గుర్తు చేశారు. ఇటీవల జరిపిన పత్రికా గోష్టిలో భారత ఎయిర్ మార్షల్ ఏకే భారతి ఒక ప్రశ్నకు సమాధానంగా " మేం యుద్ధ తరహా పరిస్థితిలో ఉన్నాం పోరులో నష్టాలు భాగంగా ఉంటాయి " అన్న మాటలు పరోక్షంగా విమానాలను కోల్పోయినట్లుగా అంగీకరించినట్లే అని కొందరు విశ్లేషించారు. విమర్శలు వచ్చినప్పటికీ రాఫెల్ ప్రపంచంలో ఇప్పుడున్న వాటిలో మంచి వాటిలో ఒకటి అని కొందరు మద్దతు ఇచ్చినట్లు కూడా ఈ విశ్లేషణలో పేర్కొన్నారు. ఇండోనేషియా సామాజిక మాధ్యమంలో వస్తున్న వ్యాఖ్యలను కూడా ప్రస్తావించింది. " జె-10జెట్లతో దాన్ని ఎదుర్కోవచ్చని, అదెంతో చౌకని తెలుసుకొని ఒక ఇండోనేషియన్‌గా రాఫెల్ జెట్లను కొనుగోలు చేస్తున్నందుకు విచారపడుతున్నాను. మా అధ్యక్షుడు కొన్ని జె-10 జెట్లు, ఇతర చైనా మిలిటరీ పరికరాలను కొనుగోలు చేస్తారని భావిస్తున్నాను." అన్న ఎక్స్ పోస్టును మచ్చుకు ఉటంకించింది.

" భారత్ , పాకిస్థాన్ వివాదం తరువాత చైనా ఆయుధాలకు పెరిగిన విశ్వసనీయత " అనే శీర్షికతో మే 13 వ తేదీన బ్లూమ్‌బెర్గ్ మీడియా ఒక విశ్లేషణ వెలువరించింది. ఇదేమీ చైనా అనుకూల సంస్థ కాదు. చైనాలో తయారయ్యే ఆయుధాలు నాశిరకం అనే అభిప్రాయం ఉన్నవారు మరోసారి మదింపు చేసుకోవాలని పేర్కొన్నది. తైవాన్ ఏర్పాటు చేసిన మేథో సంస్థ పరిశోధకుడు షు హసియావో హువాంగ్ మాట్లాడుతూ " పీఎల్ఏ(చైనా మిలిటరీ) యుద్ధ సామర్ధ్యాల గురించి మరోసారి మదింపు చేసుకోవాల్సి ఉంది. తూర్పు ఆసియాలో అమెరికా మోహరించిన వైమానిక శక్తికి చైనా దగ్గరగా వస్తుండవచ్చు లేదా అధిగమించనూ వచ్చు " అన్నట్లు బ్లూమ్‌బెర్గ్ పేర్కొన్నది. పేద దేశాలకు చైనా ఆయుధాలు ఆకర్షణగా ఉంటాయని సింగపూర్‌లోని రాజారత్నం అంతర్జాతీయ అధ్యయనాల సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ జేమ్స్ చెప్పటాన్ని విశ్లేషణలో ఉటంకించారు. చైనా ప్రభుత్వ సంస్థలు ఆయుధ ఎగుమతులకు సంబంధించి వివరాలను వెల్లడించనప్పటికీ స్టాక్‌హోంలోని సిప్రి సంస్థ అంచనా ప్రకారం గడచిన ఐదు సంవత్సరాల్లో చైనా ఎగుమతులు మూడింతలకు పైగా పెరిగాయని బ్లూమ్‌బెర్గ్ పేర్కొన్నది. చైనా ఆయుధాలు నాణ్యమైనవి కాదనే వారు కొన్ని ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సి ఉంది.

అందమైన భామలు

పొద్దు గూట్లో పడ్డది. అప్పట్లో గూట్లో నూనె దీపాలు వెలిగించేవారు మరి. ఇప్పుడు స్విచ్చేస్తే వెలిగే దీపాలు కనుక స్విచ్చులేసే టైం అనాలేమో. అరుగు మీద అటూఇటూ వాకింగ్ చేస్తున్నది డాంకీ తిన్నదరగడానికి మనుషులు చేసే రొటీన్ వాక్ కాదది మనసు చీకాగ్గా ఉన్నప్పుడు, ఏం చేయాలో పాలో పెరుగో పోనప్పుడు అశాంతిగా అసహనంగా చేసే వాకింగ్.

డాంకీ ఇలాగ పచార్లు చేస్తూ మైదానంలో వెలుగుతున్న వీధి లైట్ల వైపు ముఖం చాచి చూస్తున్నది. ఇంత టైమయ్యాక కూడా డాగీ అరుగు ఎక్కలేదెందుకు? ఇదీ డాంకీ ఆందోళన. ఇలాగ ఎప్పుడూ అయింది లేదు. ఎప్పుడూ తనకంటే ముందే వచ్చి అరుగు మీద కూచుని వేయడానికి కొన్ని ప్రశ్నలు ఎంచుకుని యూపీఎస్సీ మెంబర్‌లా ఉండేది కదా. అడిగిందే అడిగి సతాయించేది కదా ఇప్పుడు ఎక్కడున్నట్టు అనుకుంటున్న డాంకీకి దూరంగా లైటు వెలుతురులో ఒక జీవం వస్తున్నట్టు కనిపించింది. థాంక్ గాడ్! డాగీ వచ్చేస్తున్నట్టుంది అని ఊపిరి పీల్చుకుంది. కాస్సేపటికి కాని అర్థం అవలేదు ఆ వస్తున్నది నాలుకాళ్ల జీవి కాదని, చేతులు ఊపుకుంటూ వస్తున్న రెండు కాళ్ల జీవమని. రెండు కాళ్ల మీద డెబ్బయి కేజీల బరువు మోసుకుంటూ వచ్చిన అబ్బాయి అరుగు ఎక్కాడు. డాంకీ

రంగస్థలం

అప్రయత్నంగా నువ్వా బ్రో అంది. నేను కాక ఇంకెవరు వస్తారు. ఒక గాడిద, ఒక కుక్క, ఓ తెలుగు అబ్బాయి మాట్లాడుకునే అరుగే కద ఇది అన్నాడు అబ్బాయి.

అవును బ్రో కాదని నేనన్ను 'రంగస్థలం' చదివే వారెవరూ అనరు. కాకపోతే సమస్య ఏమిటంటే అని డాంకీ అంటుండగానే డాగీ ఏది కనిపించడం లేదు అన్నాడు అబ్బాయి. అదే. అదే సమస్య. డాగీ ఇప్పటి వరకూ అరుగు ఎక్కలేదు. ఎక్కడికి పోయిందో తెలీదు. హలో ఎక్కడున్నారు? అని అడగడానికి 'సెల్లు' లేదు అంది డాంకీ. అరుగు మీద లేదంటే లోపల ఏ గదిలోనైనా ఉందేమో చూశావా? లేదు బ్రో. ఇల్లంతా వెదికా ఎక్కడా లేదు. ఈ పాటికి రావల్సింది రాలేదంటే నాకేదో భయంగా ఉంది. ఒకవేళ ఎవరైనా డాగీని కిడ్నాప్ చేశారా? అంది డాంకీ. నీ ముఖం సారీ అదేమైనా జాతి కుక్కా ఎవడైనా ఎత్తుకుపోయి అమ్మేసుకోడానికి. మనుషుల్లో ఏ పూటకా పూట తిండి కోసం వెతుక్కునే పేద జాతి మనిషి లాంటి కంట్రీ డాగది. దాన్ని ఎవ్వరూ కిడ్నాప్ చెయ్యరులే అన్నాడబ్బాయి. అయితే ఏ బెల్టు షాపులోనో కల్తీమందు తాగి లారీ నడుపుతున్న వాడెవడైనా గుద్దేశాడేమో. ఎన్ని డాగ్‌లు రోడ్డు మీద కుక్క చావు చావడం లేదు అంది దిగులుగా డాంకీ. కుక్కలే కాదు మనుషులు కూడా హత్యలో, యాక్సిడెంట్లో తెలియకుండా కుక్క చావు చస్తున్నారులే. చౌరస్తా దగ్గర్నించి వస్తున్నాను ఎక్కడా నేలకు అతుక్కున్న గోనెసంచీ లాంటి కుక్క శవమేదీ కనిపించలేదు అనవసరంగా కంగారుపడకు అని అబ్బాయి అంటుంటే లోపల నుంచి డాగీ 'భౌ' మని అరవడం వినిపించింది.

అదేంటి డాంకీ, లోపలే ఉందిగా మన గ్రామ సింహం. వెదికానన్నావు, కనపల్లేదన్నావు అంటూ అబ్బాయి లోపలికి అడుగేసి డాగీ లోపలే ఉన్నావా? నిన్ను ఎవరైనా కిడ్నాప్ చేశారేమోనని, యముడి మహిషం లారీ రూపంలో వచ్చి గుద్దేసిందేమోనని పాపం అప్పట్నించీ డాంకీ కంగారుపడుతున్నది అన్నాడబ్బాయి. అప్పుడు లోపలి నుంచి బయటకి వచ్చింది డాగీ. అబ్బ ఏమైపోయావు నువ్వు. మనుషులకైతే కాపలించుకునే 'ఫెసిలిటీ' ఉంది కాని మనకు లేదుకదా, 'అయాం సో హ్యాపీ' అంది డాంకీ. నువ్వు లోపలికి వచ్చావు కానీ నేనే నక్కి కూచుని ఉండటం చూడలేకపోయేవు. ఇప్పుడైనా అరవకుండా ఉండలేక, కంట్రోల్ తప్పి అరవాల్సి వచ్చింది అంది డాగీ.

ఎందుకు నక్కి దాక్కున్నావు. బహుశా నీ ఎనిమీ పిల్లి కనబడ్డం వల్ల కంట్రోల్ తప్పి బయటపడ్డావు లేకపోతే డాంకీ తెల్లార్లూ నిద్రపోయేది కాదు. ఇంతకీ నువ్వు దేనికి దాక్కున్నట్టు అన్నాడబ్బాయి. అదా! ఏం చెప్పను భయ్యా ఊరి నిండా అందమైన భామలు ఉంటే మాలాంటి కుక్కలకు రక్షణ ఎలా ఉంటుంది చెప్పు. ప్రాణ భయంతో బంకర్‌లో దాక్కోక తప్పలేదు అంది డాగీ. అందమైన భామలకు వీధి కుక్కలకు లింకేమిటి తమ్ముడూ అన్నాడబ్బాయి. నీకు తెలీదా? మన ఊళ్లో ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనడానికి దేశ దేశాల నుంచీ అందమైన భామలు వచ్చారు. ఇతర దేశాల అధ్యక్షులు వచ్చినప్పుడు కూడా దక్కని రాచ మర్యాదలు జరుగుతున్నాయి వాళ్లకు. మంగళ వాయిద్యాలు, పూల మీద నడవడాలు, కొత్త పళ్లెల్లో కాళ్లు కడిగి తువ్వాళ్లతో తుడవడాలు, బతకమ్మ ఆటలు, ప్యాలెస్‌లో విందులు, విహార యాత్రలు, ఆ దేవుళ్ల రాజు ఇంద్రుడి కబ్జాలో ఉన్న అప్సరసలకు కూడా ఇలాంటి గౌరవ మర్యాదలు దక్కెయో లేదో. ఏమిటో ఈ దరిద్రపు కుక్క జన్మ అని నిట్టూర్చింది డాగీ.

జేబు దులిపి చూపిస్తా, ఒళ్లు కోసుకోండి పైసా రాలదు ఆ ముఖం చూసి అప్పు ఎవ్వడూ ఇవ్వడం లేదు అని బీద అరుపులు అరుస్తూ ఏలిన వారి ఈ భామా కలాపం ఏమిటో అంది డాంకీ. అధికారం రక్తంలో కలిశాక రిమ్మ తెగులు తప్పదెవరికైనా. ఒకరికి 'రేసుల ఫ్యాషన్' అయితే మరొకరికి 'బ్యూటీ ఫ్యాషన్'. డబ్బులవసరం అయినప్పుడల్లా మందు ధరలు పెంచేసి 'డోసు బాబులు' దోచేసుకోవడం అలవాటయి పోయింది. రాజుల సొమ్ము విదేశీ బ్యాంకుల పాలు, పూజల సొమ్ము రాళ్ల పాలవుతున్నది అంది డాంకీ.

ఇంతకీ డాగీ, వీధి కుక్కలకూ అందాల భామలకూ లింకేమిటో, నువ్వు లోపల దాక్కోవడం దేనికో చెప్తే నేను బయలుదేరుతానన్నాడు అబ్బాయి. అందమైన భామలు మెయిన్ బజార్లో షాపింగ్ చేస్తారని, వాళ్లకు కుక్కలు కనిపిస్తే ఊరి పరువు కూడా పోతుందని వీధి కుక్కల న్నిటినీ వ్యాన్‌లో వేసుకు వెళ్తుండటం చూసి, ఎవడైనా వచ్చి నన్నూ పట్టుకుపోతాడేమోనన్న భయంతో లోపల దాక్కున్నా అంది డాగీ.

మన పట్నం విశ్వ నగరం కావాలంటే వీధుల్లో కుక్కలు కాదు ఉండాల్సింది కళ్లకి కలకలు పుట్టించే, కలవర పెట్టే అందమైన భామలే మరి అంది డాంకీ!

ఆపరేషన్ కగార్ ఎవరికోసం?



వీఎస్ బోస్

కేంద్రంలోని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ద్వారా ఒకదాని తర్వాత మరొకటి ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల చర్యలు ప్రకటించి దొంగచాటున చట్టాలుగా మారుస్తున్నది. 2014 లో తొలిసారి అధికారానికి వచ్చే ముందు మోదీ ప్రజల మనసులను ఆకర్షించటానికి ప్రత్యేకంగా యువతను లక్ష్యంగా చేసుకొని అనేక వాగ్దానాలు చేశారు. నేటి వరకు ఈ వాగ్దానాలు ఏవీ అమలు కాలేదు. ప్రజలు ఈ వాగ్దానాలపై ప్రశ్నించే సమయంలో ఒకే దేశం -ఒకే పన్ను అనే నినాదంతో ప్రజలను పక్కదారి పట్టించాడు. కానీ ఆ పేరుతో తీసుకొచ్చిన జీఎస్టీని ఇప్పటి వరకు అనేసార్లు మార్పులు, చేర్పులు చేశారు. అంటే ఒకే దేశం ఒకే పన్ను అనే విషయంలో మోదీ ప్రభుత్వానికి స్పష్టత లేదనేది అర్థమవుతోంది. నల్ల ధనం రద్దు, అవినీతి అంతంతో దేశంలో ఉగ్రవాదం నశిస్తుందని ప్రచారం చేశాడు. ఉగ్రవాదం దేశంలో నశించకపోగా పెరిగిన నేపథ్యంలో 370 ఆర్టికల్‌ను రద్దు చేసి దాని వ్యతిరేకించిన కశ్మీరీ భారతీయులను జైల్లో పెట్టారు. మెజారిటీ వాదం పేరుతో సమాజంలో ఉద్రిక్తతలు సృష్టించి రామమందిరం కట్టి హిందువుల కలకాల వాంఛ నెరవేరిందని చెప్పుకొచ్చాడు. మోదీ పాలనలో హిందువులలో పేదరికం, నిరుద్యోగం పెరుగుతుంటే మరో పక్క ఆదానీ, అంబానీ లాంటి హిందువులే శత కోటీశ్వర్లుగా అవతరించారు.

బ్రిటీష్ వారు తెచ్చిన పాత చట్టాల దుమ్ముదులిపి కార్మికులకు న్యాయం చేస్తామని ప్రచారం చేస్తూ 44 కార్మిక చట్టాలలో ఉన్న హక్కులను హరించి కార్పొరేట్లకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మికులకు మోదీ ప్రభుత్వం తీవ్రమైన ద్రోహం చేసింది. సామాజికంగా లాభం, న్యాయం చేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసి వాటి స్థానంలో దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలను బరితెగించి ప్రోత్సహిస్తున్నది. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బీఎస్ఎన్ఎల్‌లోని 90 వేల కార్మికులను అక్రమంగా తొలగించి దానిని నిర్వీర్యం చేసింది. ఆ రంగంలో ఆదానీని ప్రోత్సహించి అన్ని సౌకర్యాలు కలుగచేసింది. ప్రజా సౌకర్యాల కోసం ఉన్న రైల్వేను, పోస్టల్‌ను ఇతర ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసే కుట్రలకు మార్గం ఏర్పర్చి అమలు చేస్తున్నది. విద్యా చట్టం ద్వారా దేశంలో విద్యను, విద్యుత్ చట్టం ద్వారా విద్యుత్ రంగాన్ని, వ్యవసాయ చట్టాల ద్వారా వ్యవసాయాన్ని, పోస్టల్ చట్టం ద్వారా పోస్టల్ వ్యవస్థను అలా అనేక ప్రభుత్వ రంగాలను దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పచెపుతున్నారు. అబ్దుల్ కలాం మిస్సైల్ శాస్త్రవేత్త బ్రహ్మోస్ తయారీలో డీఆర్‌డీఎల్‌లో విశిష్ఠ కృషిసల్పి తయారు చేసిన విషయం భారతీయులందరూ తెల్సుకోవాల్సిన అవసరం ఉన్నది. ఈ రకంగా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ దేశం కోసం అంతా చేస్తున్నామని మోసపూరిత ప్రచారం చేయటం దేశ ద్రోహచర్యగా భావించాలి. పోర్టులు ఆదానీకి అప్పచెప్పిన తర్వాత దేశంలో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా పెరిగిందనేది ప్రభుత్వ లెక్కల ప్రకారమే తెలుస్తున్నది. దానితో పాటు కొత్తగా కేంద్ర ప్రభుత్వం సముద్ర గర్భంలోని ఖనిజాలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పటానికి టెండర్లు వేసి దేశ, విదేశీ సంస్థలను ఆహ్వానిస్తున్నది. పోర్టులు ఆదానీకి అప్పచెప్పటం మూలంగా సగం ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు సముద్రగర్భంలోని ఖనిజాలు కూడా కార్పొరేట్ సంస్థలకు అప్పచెపితే ఆదివాసీలను అడవుల నుంచి తరిమినట్లుగానే మత్స్యకారులను సముద్ర తీరాల నుంచి ఇతర ప్రాంతాలకు తరిమికొడతారనేది జగమెరిగిన సత్యం. అందుకే మత్స్యకారులంతా కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడుతున్నారు.

సమాజాన్ని విచ్ఛిన్నం చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్న ఉగ్రవాదులను, సమాజాన్ని దోపిడీ నుంచి, అసమానతల నుంచి, అన్యాయాల నుంచి కాపాడాలని పనిచేస్తున్న నక్సలైట్లను ఒకే గాటకట్టటం కేంద్రం చేస్తున్న అతి పెద్ద తప్పు. ఉగ్రవాదులకు కులం, మతం, ప్రాంతం లాంటి వాటిల్లో ఎలాంటి వ్యత్యాసం ఉండదు. కానీ పేదలు, కష్టజీవులు అన్యాయానికి గురవుతున్న ప్రజలు అంటే నక్సలైట్లకు ప్రత్యేకమైన ప్రేమ, అభిమానాలు ఉన్నాయి కాబట్టే వారు కష్టజీవుల తరఫున పోరాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన ఆపరేషన్ కగార్‌తో అడవుల్లో ఉన్న ఆదివాసీలను చంపి వారిని భయభ్రాంతులను చేసి వారు అడవులు వదిలిపెట్టి ఇతర ప్రాంతాలకు పోయేటట్లు చేయటమే మోదీ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ఆదివాసీలను వారికి అండగా నిలిచిన నక్సలైట్లను వేరు చేయటానికి ఎన్‌కౌంటర్ల పేరుతో నక్సలైట్లను లక్ష్యంగాచేసి చంపటం, నక్సలైట్లకు సహకరిస్తే ఆదివాసీలకు కూడా అదే గతి పడుతుందని బెదిరించటం వంటి చర్యలకు పాల్పడడం కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్ ఉగ్రవాదుల తరపున పాకిస్థాన్‌తో సంప్రదింపులు జరపటానికి సిద్ధపడుతోంది కానీ, భారతదేశంలో పుట్టి పెరిగిన భారతీయులైన నక్సలైట్లతో సంప్రదించేది లేదని చెప్పటం ద్రోహపూరిత చర్య. భారతదేశం తరఫున మోదీ రష్యాకు ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధాన్ని, ఇజ్రాయిల్‌కు పలస్తీనాకు మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి వారిద్దరి మధ్య సంప్రదింపులు జరగాలని ప్రతిపాదిస్తూ మన దేశంలో నక్సలైట్లతో ఎలాంటి సంప్రదింపులు లేవని చెప్పటంలో ఉన్న రహస్యాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం అటవీ సంపదను, ఆ ప్రాంతంలో ఉన్న ఖనిజాలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పే ఉద్దేశాన్ని మార్చుకొని ఆ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలకు ఆ సంపద, ఖనిజాలపై వారికున్న రాజ్యాంగ హక్కును గుర్తించి వారి హక్కులను కాపాడవల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నది. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారి హక్కులను గుర్తించటానికి నిరాకరిస్తూ బలవంతంగా కార్పొరేట్ సంస్థలకు అడవులను అప్పచెప్పే ప్రయత్నాన్ని మొండిగా అమలు చేస్తున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశం ఆపరేషన్ కగార్ అమలు చేసి దేశ సంపదను కాపాడటం, దేశ ప్రజలకు ప్రయోజనం చేకూర్చటం కాదనేది వారి చర్యల ద్వారా అర్థమవుతున్నది. కేంద్ర ప్రభుత్వం తమ తప్పుడు విధానాలను విడనాడి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి ఆదివాసి, నక్సలైట్ నాయకులతో సంప్రదించాల్సిన అవసరం ఏర్పడింది. నక్సలైట్లు తాము ఆయుధాలు 6 నెలల పాటు ఉపయోగించబోమని, శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించినప్పటికీ ఏదో ఒక పేరుతో అడవుల్లో ఉన్న నక్సలైట్లపై ఎన్‌కౌంటర్లు చేయటం భారత విధానం కాదనేది మోదీ ప్రభుత్వం గుర్తెరగాలి. కాల్పుల విరమణ ప్రకటించిన పాకిస్థాన్‌తో చర్చించటానికి లేని అడ్డంకులు మన దేశ నక్సలైట్లతో సంప్రదించటానికి ఏమిటో ఎవరికీ అర్థంకాని అంశం. కావున వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాలని, మావోయిస్టుల (నక్సలైట్ల)తో వెంటనే చర్చలు జరిగితే అటవీ ప్రాంతంలో శాంతి నెలకొంటుందని కేంద్ర ప్రభుత్వం ఎంత తొందరగా అర్థం చేసుకుంటే అంత మంచిది. హోం మంత్రి అమిత్ షా నక్సలిజాన్ని అంతం చేస్తానని తేదీలు ప్రకటించటం అవినీతిని అంతం చేస్తానని, నల్లధనాన్ని విదేశాల నుంచి తీసుకొస్తానని చెప్పిన అనేక ప్రగల్భాలలో ఇది కూడా ఒకటిగా మిగిలిపోతుందని తెల్సుకోవటం మంచిది. దేశంలో నిరుద్యోగం, అసమానతలు, దోపిడీ ఉన్నంతకాలం ఏదో ఒక రకంగా, ఏదో ఒక పేరుతో తిరుగుబాట్లు తప్పవని ప్రపంచ గమనం తెలియజేస్తున్న విషయాన్ని పాలకులు అర్థం చేసుకోవాలి. కార్మికులు, కర్షకులు, ఆదివాసీలు, మత్స్యకారులు, బాధితులు ఏకమై తిరుగుబాటు చేసే సమయం కోసం కేంద్ర ప్రభుత్వ ఎదురు చూడకూడదు.

- సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఫోన్:9391356527

మంత్రి జైశంకర్ మౌనం విపత్కరం

భారత్ ఎన్ని విమానాలు కోల్పోయింది: రాహుల్

న్యూఢిల్లీ: కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించ డానికి ముందు కేంద్రం ఆ సమా చారాన్ని పాక్‌కు తెలియజేయడం తప్పదమే కాకుండా, నేరమని రాహుల్ పునరుద్ఘాటించారు. 'విదేశాంగ మంత్రి మౌనం కేవలం సమాచారాన్ని వెల్లడించడం కాదు... అది విపత్కరం' అని రాహుల్ సోమవారం తాజా ట్వీట్‌లో పేర్కొన్నారు. గతంలో అడిగిన ప్రశ్ననే మళ్లీ అడుగుతున్నానని, పాకిస్థాన్‌కు ముందుగానే సమాచారం తెలిసినందు వల్ల మనం ఎన్ని విమానాలు కోల్పోయాం? ఇది తప్పిదం కాదు... నేరం. దేశానికి నిజం తెలియాలని ఆ ట్వీట్‌లో రాహుల్ విదేశాంగ మంత్రిని ప్రశ్నించారు. రాహుల్ విమర్శలపై బీజేపీ వెంటనే స్పందించింది. మంత్రి వ్యాఖ్యలను విపక్ష నేత వక్రీకరిస్తున్నారని, ఆయన ఇలాంటి ప్రశ్నలు వేస్తున్న సమయం చూస్తే దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారనే విషయం అవగతమవుతుందని ఎదురుదాడికి దిగింది. జైశంకర్ మీడియాతో మాట్లాడినప్పటి వీడియోను రాహుల్ గాంధీ గత శనివారం షేర్ చేశారు. 'ఆపరేషన్ ప్రారంభంలో పాకిస్థాన్‌కు మెసేజ్ పంపాం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మీద దాడి చేస్తామే కానీ మిలటరీ మీద కాదని చెప్పాం. అందువల్ల సైన్యం ఈ విషయంలో జోక్యానికి దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. అయితే మంచి మాటలు చెవికెక్కని విధానాన్నే వాళ్లు ఎంచుకున్నారు' అని చెబుతున్నట్టుగా ఉన్న వీడియోను రాహుల్ షేర్ చేశారు. దాడికి ముందే పాకిస్థాన్‌కు సమాచారం ఇవ్వడం నేరమని, భారత ప్రభుత్వం ఈ పని చేసిన విషయాన్ని విదేశాంగ మంత్రి బహిరంగంగానే అంగీకరించారని రాహుల్ పేర్కొన్నారు. ఫలితంగా ఎన్ని విమానాలను భారత్ కోల్పో యిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇదే వీడియోను రాహుల్ రీపోస్ట్ చేశారు. 'మరోసారి అడుగుతున్నాను. పాకిస్థాన్‌కు సమాచారం తెలియడం వల్ల మనం ఎన్ని విమానాలు కోల్పోయాం? దేశం నిజం తెలుసుకోవాలనుకుంటోంది' అని అన్నారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేర సైతం రాహుల్ ఆరోపణలను తిరిగి ప్రస్తావిస్తూ, పాక్‌కు ముందుగానే సమాచారం ఇవ్వడాన్ని ప్రశ్నించారు. విదేశాంగ మంత్రికి, పాకిస్థాన్‌కు మధ్య ఎలాంటి సంబంధం ఉందని నిలదీశారు. ఇది దౌత్యం కాదని, గూఢచర్యం అని అన్నారు. కాగా, రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. మంత్రి వ్యాఖ్యలను పదేపదే వక్రీకరిస్తున్నారని, కొన్నిశక్తుల తరఫున రాహుల్ పనిచేస్తున్నట్టు కనిపిస్తోందని ఆ పార్టీ ప్రతినిధి తుహిన్ సిన్హా అన్నారు. మంత్రి విదేశాల్లో ఉన్నప్పుడు రాహుల్ గుచ్చిగుచ్చి ఇలాంటి ప్రశ్నలు వేయడం ఏమిటని నిలదీశారు. మన దౌత్య ప్రతినిధుల బృందాలు విదేశాలకు వెళ్తున్న తరుణంలో దేశానికి అపకీర్తి తెచ్చిపెట్టాలని రాహుల్ అనుకుంటారని విమర్శించారు.

ప్రజలపై 'డబుల్ దాడి'

- ఆకాశాన్నంటిన ధరలు... పెరిగిన పన్నులు
- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ: 'ఆకాశాన్ని అంటుతున్న ద్రవ్యోల్బణం', పెరుగుతున్న పన్నుల 'ద్వంద్వ దాడి'ని ప్రజలు ఎదుర్కొంటు న్నారని కాంగ్రెస్ సోమవారం విమర్శించింది. సామాన్య ప్రజలు దాని ప్రభావాన్ని ఎలా తట్టుకుంటారో సమాధానం చెప్పాలని మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రజలపై పన్నుల భారం పెరుగుతోందని పేర్కొంటూ వచ్చిన మీడియా వార్తలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్) జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పంచుకున్నారు. 'స్వయంగా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అని చెప్పుకునే పాలనలో భారతదేశ ప్రజలు ద్రవ్యోల్బణం, పన్నుల పెరుగుదల అనే రెండు రకాల దాడులు ఎదుర్కొంటున్నారు. పదేళ్లలో ద్రవ్యోల్బణం, పన్ను భారం భారీగా పెరిగింది' అని హిందీలో పేర్కొన్నారు. వైద్యం, విద్యపై ఖర్చు యేటా 12-15 శాతం పెరిగిందన్నారు. 'పాఠశాల ఫీజులు, పుస్తకాలు, యూని ఫాంలు... ప్రతిదీ ఖరీదైనవిగా మారాయి. బ్యాంకులు చిన్న సేవలకు కూడా రుసుములు వసూలు చేస్తున్నాయి. కారు, నెట్ బ్యాంకింగ్‌పై పన్ను, పాలు, పెరుగు, పిండి వంటి ముఖ్యమైన వస్తువులపై జీఎస్టీ, ఫాస్ట్ ట్యాగ్ కూడా ఉన్నాయి' అని పేర్కొన్నారు. అయితే ఆదాయాలు పెరగలేదు కానీ పన్నులు, ఖర్చులు ప్రజల వెన్ను విరిచాయని జైరాం రమేశ్ ఆరోపించారు. 'ఈ పన్ను దోపిడీ, విపరీత ద్రవ్యోల్బణం నుంచి సామాన్య ప్రజలు ఎలా బయట పడతారో మోదీ ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అని అన్నారు.

యూకో బ్యాంక్ మాజీ సీఎండీ అరెస్ట్

న్యూఢిల్లీ: యూకో బ్యాంక్ మాజీ సీఎండీ సుబోధ్ కుమార్ గోయెల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. బ్యాంకు రుణ మోసం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయనను అరెస్ట్ చేసినట్లు ఈడీ వెల్లడించింది. కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు రుణాల మంజూరులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో సుబోధ్ కుమార్ గోయెల్‌ను అరెస్ట్ చేసి కోల్‌కతాలోని ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం కోర్టు ముందు ఈడీ హాజరుపరచింది. ఈ నెల 21 వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీకి పంపినట్లు ఫెడరల్ దర్యాప్తు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. యూకో బ్యాంక్ సీఎండీగా గోయెల్ పనిచేసిన సమయంలో కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు భారీ మొత్తంలో నిధులను మంజూరు చేశారు. ఇలా మంజూరైన రూ. 6,210.72 కోట్ల నిధులను ఆ సంస్థ దుర్వినియోగం చేసిందని సీబీఐ దర్యాప్తులో తెలిసింది. రుణ మంజూరులో సుబోధ్ కుమార్ గోయెల్‌కు ముడుపులు అందినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

కారు నదిలో పడి ఐదుగురి మృతి

ముంబై: అతివేగంతో వెళుతున్న కారు జగ్బుడి నదిలో పడిపోయి ఐదుగురు ప్రయాణికులు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున మహారాష్ట్ర రత్నగిరి జిల్లాలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖేడ్ సమీపంలో ప్రమాదం జరిగింది. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా నల్లసోపారా నుండి దేవ్రుఖ్ టౌన్ వైపు వెళుతున్న కారును డ్రైవర్ అతివేగంతో నడుపుతున్నప్పుడు మొదట డివైడర్‌ను ఢీకొట్టి... ఆ తర్వాత నీరులేని జగ్బుడి నదిలో పడిపోయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. గాయాలపాలైన వారిని చికిత్స కోసం రత్నగిరిలోని ఆసుపత్రికి తరలించారు. మృతులను మితాలి వివేక్ మోర్ (43), మేఘా పరాద్కర్ (22), సౌరభ్ పరాద్కర్ (22), నిహార్ మోర్ (19), శ్రేయాస్ సావంత్ (23)గా గుర్తించినట్లు పోలీసు అధికారి తెలిపారు. ఈ ఘటనపై ఖేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

దేశంలో విద్రోహం

12 మంది పాక్ గూఢచారుల అరెస్ట్ / 20-35 మధ్య వయస్కులే

- అనేకసార్లు పాక్‌కు ప్రయాణాలు
- సైనిక స్థావరాలు, సున్నిత సమాచారం అందజేత
- పోలీసులు, ఎన్ఐఏ ముమ్మర దర్యాప్తు
- కేంద్ర హోంశాఖ నిశిత పరిశీలన

చండీగఢ్/లక్నో: చండీగఢ్/లక్నో: దేశంలో ఉగ్రమూలలా గుట్టు రట్టవుతోంది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలతో గత రెండు వారాల్లో పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లలో యూట్యూబర్ సహా కనీసం 12 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఉత్తర భారతదేశంలో పనిచేస్తున్న పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌లో వారు భాగంగా ఉన్నారని దర్యాప్తులో తేలింది. వీరిలో ఆరుగురు పంజాబ్ నుంచి, నలుగురు పొరుగున ఉన్న హర్యానా నుంచి పట్టుబడ్డారు. అరెస్టయిన వారిలో హర్యానాకు చెందిన యూట్యూబర్ సహా ఇద్దరు మహిళలు, న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లో విధులు నిర్వహిస్తున్న పాకిస్థాన్ అధికారి ఎహసాన్-ఉర్-రహీమ్ అలియాస్ డానిష్‌తో సంప్రదింపులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. గూఢచర్యానికి పాల్పడుతున్నారనే ఆరోపణలతో పాకిస్థాన్ అధికారిని భారతదేశం మే 13న బహిష్కరించింది. నిందితులు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ (పీఐవోలు)కు సున్నితమైన సమాచారం అందజేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయిందని, వారి ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు, ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ జరుగుతోందని అధికారులు తెలిపారు. పంజాబ్, హర్యానా నుంచి జరిగిన అరెస్టులతో పాటు పాకిస్థాన్ నిఘా సంస్థ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ఏజెంట్‌గా భావిస్తున్న వ్యక్తిని ఆదివారం ఉత్తర ప్రదేశ్‌లోని రాంపూర్‌లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ అరెస్టు చేసింది. మే 4న పంజాబ్ పోలీసులు అమృత్‌సర్‌లోని అజ్నాలా నివాసితులు ఫలక్‌షేర్ మాసిహ్, సూరజ్ మాసిహ్‌ను అరెస్టు చేశారు. సైన్యం కదలికలు, బీఎస్‌పీ శిబిరాలు, విమానాశ్రయాల స్థానాలు, ఛాయాచిత్రాలు, ఇతర సున్నితమైన డేటా వంటి కీలకమైన సమాచారాన్ని సేకరించి పాకిస్థాన్‌లోని వారి నిర్వాహకులకు బదిలీ చేయడంలో ఇద్దరూ పాల్గొన్నారని పోలీసులు తెలిపారు. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం అరెస్టయిన వారందరూ 20-35 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. హోం మంత్రిత్వ శాఖ దర్యాప్తును నిశితంగా పర్యవేక్షిస్తోంది. ఈ అరెస్టులు డబ్బు, నకిలీ వాగ్దానాలు, హనీట్రాప్ ద్వారా భారత పౌరులను నియమించుకోవడానికి జరిగిన సమన్వయ ప్రయత్నాన్ని బయటపెట్టాయి.

జ్యోతి మల్హోత్రా: జ్యోతి మల్హోత్రాది హర్యానాలోని హిసార్. 33 ఏళ్ల జ్యోతికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ట్రావెలింగ్ వీడియోలు చేస్తూ ఉంటుంది. యూట్యూబ్‌లో ట్రావెల్ విత్ జో పేరిట ఛానల్ ఉంది. జ్యోతి మూడుసార్లు పాకిస్థాన్ వెళ్లి వచ్చింది. దిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్‌కు చెందిన డానిష్ అనే ఉద్యోగితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో పాకిస్థాన్ కోసం గూఢచారిగా పనిచేయటం మొదలెట్టింది. అతనికి సున్నితమైన సమాచారం అందజేసిందని ఆరోపణలు వచ్చాయి. 'అతనితో పాటు ఇండోనేషియాలోని బాలికి కూడా ఆమె వెళ్లింది' అని నివేదికలు పేర్కొన్నాయి. ఆమెపై అధికారిక రహస్యాల చట్టం, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు హర్యానా పోలీసులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాక్ మధ్య నాలుగు రోజుల ఉద్రిక్తతల సమయంలో ఆమె డానిష్‌తో సంప్రదింపులు జరిపిందని హిసార్ పోలీసు సూపరింటెండెంట్ శశాంక్ కుమార్ సావన్ చెప్పారు.

ప్రియాంక సేనాపతి: జ్యోతి అరెస్టు తర్వాత ఒడిశాకు చెందిన వ్లాగర్ ప్రియాంక సేనాపతిని పోలీసులు అరెస్టు చేశారు. పూరీకి చెందిన వ్లాగర్ ప్రియాంక సేనాపతి, జ్యోతి మల్హోత్రా మధ్య ఉన్న సంబంధాలపై ఒడిశా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ప్రియాంక పాకిస్థాన్ సందర్శించినట్లు బయటపడింది. ఆమె మూడు నెలల క్రితం కర్తార్‌పూర్ సాహిబ్‌కు వెళ్లి, ఆ సందర్శన వీడియోలను తన యూట్యూబ్ ఛానెల్‌లో పంచుకుంది. అయితే జ్యోతి ఆమెతో పాటు రాలేదని పోలీసులు నిర్ధారించారు. పోలీసులు ప్రియాంకను ఆమె ఇంట్లో ప్రశ్నించగా, జ్యోతితో కలిసి ఆమె కశ్మీర్, కేరళ సహా అనేక భారతీయ కీలక ప్రాంతాల్లో పర్యటించినట్లు గుర్తించారు.

దేవేంద్ర సింగ్ దిల్లన్: పంజాబ్‌లోని మస్తఖర్‌కు చెందిన దేవేంద్ర సింగ్ దిల్లన్ పాటియాలలోని ఖల్సా కళాశాలలో ఎంఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొన్నేళ్ల క్రితం ఇతనికి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్, ఐఎస్ఐతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి భారత్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో పిస్టళ్లు, తుపాకుల ఫొటోలు పెట్టి అరెస్ట్ అయ్యాడు. పోలీసుల విచారణలో పాకిస్థాన్ కోసం పని చేసినట్లు ఒప్పుకున్నాడు. 2023లో పాకిస్థాన్‌లోని నాన్‌కానా సాహిబ్‌కు వెళ్లాడు. ఈ పర్యటనలో అతను పాకిస్థాన్ నిఘా కార్యకర్తలతో సంబంధాలు ఏర్పరచుకున్నాడని, భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత వారితో సంబంధాలు నెరపుతున్నాడని తెలిసింది.

తారిఖ్: తారిఖ్‌ది హర్యానాలోని కంగర్కా గ్రామం. పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నాడన్న కారణంతో హర్యానా పోలీసులు, కేంద్ర నిఘా వర్గాలు సంయుక్తంగా అతనిని అదుపులోకి తీసుకున్నాయి.

అర్మన్: 26 ఏళ్ల అర్మన్ భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతల సమయంలో దిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లో నియమించబడిన ఉద్యోగి ద్వారా భారత సైన్యం, ఇతర సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్‌తో పంచుకున్నాడు. హర్యానాలోని నోహ్‌లో అర్మన్‌ను అరెస్టు చేశారు. చాలాకాలంగా వాట్సాప్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సమాచారాన్ని పంచుకుంటున్నాడని ఆరోపణలు ఉన్నాయి.

నౌమన్ ఇల్లహి: 24 ఏళ్ల నౌమన్ ఇల్లహిది ఉత్తర ప్రదేశ్‌లోని కైరానా. మే 13న హర్యానాలోని పానిపట్‌లో అరెస్టయ్యాడు. నౌమన్ హర్యానాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇతను పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐతో సంబంధం పెట్టుకున్నాడు. పాకిస్థాన్‌కు సమాచారం అందించిన ప్రతీసారి డబ్బులు వచ్చేవి. అవి అతని బావ మరిది అకౌంట్‌లో పడేవి. 'అతని వద్ద ఎనిమిది పాస్‌పోర్ట్‌లు ఉన్నాయి. నాలుగుసార్లు పాకిస్థాన్ వెళ్లాడు' అని అధికారులు తెలిపారు. దళాల కదలికలు, రైలు మార్గాల గురించి సున్నితమైన వివరాలను అతను అందజేసినట్లు తెలుస్తోంది. నౌమన్ అత్త, మేనత్త పాకిస్థాన్‌లో నివసిస్తున్నారు. ఇది అతనికి సరిహద్దు దాటడానికి మార్గం సుగమం చేసింది. ఇక్బాల్ సహచరుడు ఖలీం అరెస్టు తర్వాత అతను ఈ కేసులో చిక్కుకున్నాడు.

షాజాద్: ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన షాజాద్ అనేకసార్లు పాకిస్థాన్ వెళ్లాడని, సరిహద్దు దాటి సౌందర్య సాధనాలు, బట్టలు, సుగంధ ద్రవ్యాలు, ఇతర వస్తువులను అక్రమంగా రవాణా చేస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. మే 18న మొరాదాబాద్‌లో అరెస్టయ్యాడు. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో సంబంధం పెట్టుకున్నాడు. ఆదివారం కూడా దేశానికి సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేశాడు. దీంతో ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ షాజాద్‌ను అరెస్టు చేసింది.



గజాలా: పంజాబ్‌కు చెందిన ఈమె పాకిస్థాన్‌కు డబ్బులు చేరవేస్తూ ఉండేది. మే 8న పంజాబ్‌లోని మలేర్‌కోట్లలో అరెస్ట య్యింది. ఫిబ్రవరి 2025లో వీసా పొందడానికి పాకిస్థాన్ హైకమిషన్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. అక్కడ ఆమె డానిష్ అనే పాకిస్థాన్ అధికారిని కలిసింది. 'ఆమె సైనిక స్థావరాలు, సైనిక ట్రక్కులు, ఇతర సున్నితమైన ప్రదేశాల గురించి డేటాను పంపడం ప్రారంభించింది' అని అధికారులు తెలిపారు. ఆమె ఏప్రిల్‌లో తన స్నేహితురాలు బాను నస్రినాతో కలిసి డానిష్ ద్వారా మళ్లీ రాయబార కార్యాలయానికి వెళ్లింది.

మహ్మద్ ముర్తాజా అలీ: మహ్మద్ ముర్తాజా అలీ పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐతో కలిసి పనిచేస్తున్నాడు. మే 16న పంజాబ్‌లోని జలంధర్‌లో అతనిని గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో భారత వార్తల క్లిప్పింగులు, అంతర్గత నవీకరణలను సరిహద్దు దాటి హ్యాండ్లర్లకు ప్రసారం చేసే యాప్‌ను రూపొందించడంలో పాల్గొన్నాడని నివేదికలు చెబుతున్నాయి.

యామిన్ మహ్మద్: పాకిస్థాన్ ఇతనిని విభిన్నమైన పనులు చేయడానికి ఎంపిక చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు.

సుఖ్‌ప్రీత్ సింగ్: పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌కు చెందిన సుఖ్‌ప్రీత్ సింగ్‌ను పాకిస్థాన్ కోసం గూఢచారిగా పని చేస్తున్నట్లు గుర్తించారు. పంజాబ్ పోలీసులు అతనిని అరెస్టు చేశారు.

కరణ్‌బీర్ సింగ్: పంజాబ్‌కు చెందిన కరణ్‌బీర్ సింగ్‌కు నేరుగా ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నాయి. ఇతను భారత సైన్యానికి చెందిన కీలక సమాచారాన్ని ఐఎస్ఐకి చేరవేసినట్లు తేలింది. పంజాబ్ పోలీసులు గుర్‌దాస్‌పూర్‌లో కరణ్‌బీర్ సింగ్‌ను అరెస్టు చేశారు.

పాక్ లక్ష్యం స్వర్ణదేవాలయం

- సమర్థంగా తిప్పికొట్టిన భారత సైన్యం
- గీత కూడా పడనివ్వలేదు: మేజర్ జనరల్ కార్తీక్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ తర్వాత అక్కసుతో పాకిస్థాన్ జరిపిన క్షిపణి, వైమానిక దాడులను భారత సాయుధ దళాలు సమర్థంగా తిప్పికొట్టిన సంగతి విదితమే. అయితే అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని పాక్ లక్ష్యంగా చేసుకుందని 15 పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ కార్తీక్ సీ శేషాద్రి వెల్లడించారు. ఈ దాడులను ఎలా అడ్డుకున్నదీ ఆయన వివరించారు. "నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం స్వర్ణదేవాలయం వంటి మతపరమైన ప్రదేశాలతో సహా భారత పౌర, సైనిక స్థావరాలను పాక్ లక్ష్యం చేసుకుంటుందని భారత సైన్యం ఊహించింది. పాక్ సైన్యానికి ఎటువంటి చట్టబద్ధ లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు కనిపించాయి. ముందుగానే ఊహించడంతో స్వర్ణ దేవాలయానికి అదనపు రక్షణ కల్పించాం. మే8న తెల్లవారుజామున స్వర్ణ దేవాలయం లక్ష్యంగా పాక్ డ్రోన్లు, దీర్ఘ శ్రేణి క్షిపణులను ప్రయోగించింది. ముందే సిద్ధమై ఉన్న ఇండియన్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్ పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టింది. స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారు" అని మేజర్ జనరల్ కార్తీక్ సి శేషాద్రి పేర్కొన్నారు. పహల్గాంలో అమాయక భారత, విదేశీ పర్యాటకులే లక్ష్యంగా జరిపిన ఉగ్రదాడి ఫలితంగానే ఇండియా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిందని కార్తీక్ తెలిపారు. ఇందులో భాగంగా పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసిందని వివరించారు. తొమ్మిది స్థావరాలలో, ఏడింటిని భారత సైన్యం పూర్తిగా నాశనం చేసిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాలు సంపూర్ణ కచ్చితత్వంతో అనేక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థల ప్రధాన కార్యాలయాలు ఉన్న మురిద్కే, బహవల్పూర్ వంటి ప్రాంతాలపై దాడి చేశాయన్నారు. భారత సైన్యం పాకిస్థాన్ సైనిక, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోలేదని తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదు

ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని... పాక్ కవ్వింపులకు పాల్పడితే గట్టి ప్రతిస్పందన తప్పదని కార్తీక్ తెలిపారు. పాక్ సైన్యం లోపాలు, ఎదుర్కొన్న ఒత్తిడి గురించి తెలుసునన్నారు. పాక్ సైన్యం ఏవైనా దాడులకు యత్నిస్తే వినాశకరమైన ప్రతిస్పందనను ఇస్తామని అవసరమైతే పాకిస్థాన్‌ను పూర్తిగా నాశనం చేయడానికైనా సిద్ధమేనని కార్తీక్ తెలిపారు. మరోవైపు, పాకిస్థాన్ దాడుల నుంచి తమ ప్రాణాలు కాపాడినందుకు అమృత్ సర్ ప్రజలు ఇండియన్ ఆర్మీకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గోల్డెన్ టెంపుల్ సహా సరిహద్దు ప్రాంతాలలోని మతపరమైన ప్రదేశాలను రక్షించడానికి సైన్యం అన్ని ప్రయత్నాలను చేసిందని, సాయుధ దళాలకు ప్రజలు తమ సామర్థ్యాల మేరకు సహాయం చేయడానికి ప్రయత్నిస్తున్నారని స్థానికుడు ఒకరు తెలిపారు. భారత సాయుధ దళాలతో భుజం భుజం కలిపి నిలబడతామని పేర్కొన్నారు.

భారీ వర్షంతో 'టెక్' నగరం అతలాకుతలం

లోతట్టు ప్రాంతాలు జలమయం... ఇళ్లల్లోకి చేరిన నీరు

బెంగళూరు: కర్నాటక రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత 48 గంటల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బెంగళూరు నగరంలోని అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వరదలు వచ్చాయి. మాన్యత టెక్ పార్క్, హంపీనగర, కాటన్ పేట్, అంజనాపుర, బాగలకుంటె, జక్కూరు, హెుూరమావు, శెట్టిహళ్లి, విశ్వేశ్వరపురా, విద్యాపీఠ, హెమ్మిగెపురా, సిల్క్ బోర్డు ప్రాంతాలు నీట మునిగాయి. బెంగళూరు రూరల్, కోలార్, చిక్కబళ్లాపూర్, రామ నగర, మైసూరు, హాసన్, తుమకూరుతో పాటు ఇతర జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. యలహంక, కేఆర్‌పురం, ఇతర ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే బస్వరావు సహాయక చర్యలను పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోకి జేసీబీపై వెళ్లారు. స్థానికులను పరామర్శించి... వరద సహాయక చర్యల్లో పాల్గొన్నారు. నివాసితుల ఇళ్లలోకి నీరు ప్రవేశించిన ప్రాంతాల్లో అధికారులు ఎక్స్‌కవేటర్‌లను ఉపయోగిస్తున్నారు. మరోవైపు ఆకస్మిక వర్షాల కారణంగా బెంగళూరు డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. అనేక చెట్ల కొమ్మలు పడిపోయాయి. వాహనాలు ధ్వంసమయ్యాయి. బెంగళూరు సహా 22 జిల్లాలకు వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' ప్రకటించింది. ఈ నెల 22 వరకు ఉడిపి, బెలగావి, ధారవాడ, గడగ్, హావేరి ప్రాంతాల్లో 30-40 కిమీ వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. దాదాపు వారం రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు ప్రయాణించవద్దని సూచించింది. కాగా, తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజులు వివిధ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

లోక్‌సభ, 8 రాష్ట్రాల్లో

డిప్యూటీ స్పీకర్లు లేరు

- సంవత్సరాలు గడుస్తున్నా జరగని ఎన్నిక
- రాజ్యాంగబద్ధ పదవిని పట్టించుకోని బీజేపీ పాలిత రాష్ట్రాలు
- జార్ఖండ్‌లో 20 ఏళ్లుగా ఖాళీ

న్యూఢిల్లీ: లోక్‌సభతో పాటు ఎనిమిది రాష్ట్రాలకు డిప్యూటీ స్పీకర్లు లేరు. సంవత్సరాలు గడుస్తున్నా రాజ్యాంగ బద్ధ హోదా ఖాళీగా ఉంది. జార్ఖండ్‌లో ఈ రాజ్యాంగబద్ధ స్థానం గత 20ఏళ్ల రెండు నెలలుగా భార్తీ కాలేదు. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగని రాష్ట్రాల్లో బీజేపీ పాలిత రాష్ట్రాలే ఎక్కువగా ఉండటం గమనార్హం. 2019 జూన్ (మోదీ 2.0 హయాంలో) నుంచి లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేరు. మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ స్థానాన్ని భర్తీ చేయడంపై దృష్టిపెట్టలేదు. చత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీర్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో డిప్యూటీ స్పీకర్ పదవి దీర్ఘకాలంగా భర్తీ కాలేదు. ఈ పదవి ఖాళీగా ఉన్న సమయం ఐదు నెలల నుంచి 20ఏళ్లకుపైగా ఉన్నట్లు పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. 'రాజ్యాంగంలోని అధికరణ 93 ప్రకారం లోక్‌సభకు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక అనివార్యం. స్పీకర్ రాజీనామా చేయాలంటే డిప్యూటీ స్పీకర్‌కు లేఖ పంపుతారు. అదే అసెంబ్లీలకు సంబంధించి అరికల్ 178కు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ కట్టుబడాలి. డిప్యూటీ స్పీకర్‌కు రాజ్యాంగం కొన్ని అధికారాలు ఇచ్చింది. స్పీకర్ (రాజీనామా/మరణం) లేకపోతే ఆ బాధ్యతలను డిప్యూటీ స్పీకర్ చేపడతారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు అందుకొని, ఆ తీర్మానంపై చర్చలు నిర్వహిస్తారు.' అని నివేదిక వెల్లడించింది. 2005, మార్చి 6 తర్వాత జార్ఖండ్ అసెంబ్లీకి డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కాలేదు. చివరి డిప్యూటీ స్పీకర్‌గా సబా అహ్మద్ వ్యవహరించారు. 2002, ఆగస్టు 24 నుంచి 2004, మే 29 వరకు రాష్ట్రానికి డిప్యూటీ స్పీకర్‌గా బగున్ సంబ్రాయ్ ఉన్నారు. బీజేపీ పాలిత రాజస్థాన్‌లో గత ఆరేళ్ల మూడు నెలలుగా, మధ్యప్రదేశ్‌లో ఐదేళ్ల రెండు నెలలుగా, ఉత్తరాఖండ్‌లో మూడేళ్ల మూడు నెలలుగా డిప్యూటీ స్పీకర్ స్థానం ఖాళీగా ఉంది. అలాగే, బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్ గత అసెంబ్లీ చివరి సమావేశంలో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకున్నది కానీ ప్రస్తుత అసెంబ్లీలో అంటే మూడేళ్లుగా ఆ పదవిని ఖాళీగానే ఉంచింది. చత్తీస్ గఢ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చి సంవత్సరం నాలుగు నెలలు అయినాగానీ డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోలేదు. దీర్ఘ కాలం తర్వాత జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి కానీ ఆరు నెలలుగా డిప్యూటీ స్పీకర్ స్థానం ఖాళీగా ఉంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో సంవత్సరం నాలుగు నెలలుగా ఈ పదవికి ఎన్నిక జరగలేదు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై పోటీకి కాంగ్రెస్ నేత కొడిక్కున్నిల్ సురేశ్‌ను గత జూన్‌లో ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన నిలబెట్టింది. డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వాలన్న సంప్రదా యాన్ని కాపాడేందుకే ఇలా చేసినట్లుగా వివరించింది. కాగా, 2019లో డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షానికి దక్కలేదు. పార్లమెంటరీ విధానాలను ఉల్లంఘించారంటూ మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ స్పీకర్ ఓం బిర్లాకు పిటిషన్‌ను ఇండియా ఐక్య సంఘటన అందించడం విదితమే.

చట్టబద్ధ పోరాటం చేద్దాం

ప్రభుత్వాన్ని నమ్మండి... టీచర్లకు మమత సూచన

కోల్‌కతా: 'చట్టబద్ధంగా పోరాడండి... రాష్ట్ర ప్రభుత్వాన్ని నమ్మండి' అని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం కోరారు. 'ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని విశ్వసించాలి. నేను ఉద్యమాలకు వ్యతిరేకం కాదు. కానీ ప్రతి ఉద్యమానికి సరిహద్దు రేఖ ఉంటుంది' అని ఉత్తర బెంగాల్ పర్యటనకు బయలుదేరే ముందు మీడియా ప్రతినిధులతో అన్నారు. 'చట్టబద్ధంగా పోరాడండి. మాకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలతో మేము కూడా చట్టబద్ధంగా పోరాడుతున్నాం' అని తెలిపారు. గతేడాది కలకత్తా హైకోర్టు, ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు 2016 రాష్ట్రస్థాయి పరీక్షలో ఎంపికయిన 25,753 మంది బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు రద్దు చేయడంతో మమత ప్రభుత్వానికి ఏడాది వ్యవధిలో రెండుసార్లు దెబ్బ తగిలింది. తృణమూల్ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర విద్యా బోర్డు, స్కూల్ సర్వీస్ కమిషన్‌లోని అధికారులు ఉద్యోగాల కోసం డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలకు కోర్టు తీర్పు ముద్ర వేసింది. ఎంపిక ప్రక్రియను 'పెద్ద ఎత్తున అవకతవకలు, మోసాలతో దుర్వినియోగం' చేశారని పేర్కొంది. కాగా, తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం, స్కూల్ సర్వీస్ కమిషన్ వేర్వేరుగా రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. 'మేము రివ్యూ పిటిషన్ దాఖలు చేశాం. కోర్టు ఏది నిర్ణయిస్తే దానిని మేము అంగీకరించాలి' అని ముఖ్యమంత్రి అన్నారు. గతవారం వికాస్ భవన్‌లో జరిగిన హింసకు బయటి వ్యక్తులే కారణమని మమత ఆరోపించారు. ఈ హింసలో నిరసనకారులు, పోలీసులు కూడా గాయపడ్డారు. 'ఉపాధ్యాయులు కనీస గౌరవం చూపించాలని, సమాజానికి సేవ చేయాలని, పిల్లలకు బోధించాలని మేము ఆశిస్తున్నాము. వారు ఇతరులను గంటల తరబడి గదుల్లో బంధించలేరు. బయటి వ్యక్తులు కూడా ఇందులో పాల్గొన్నారు' అని పేర్కొన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజావాణితో సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమంతో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 101 దరఖాస్తులను అయన స్వీకరించారు. అట్టి అర్జీలను శాఖాధికారులు సత్వరమే పరిశీలన చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో హౌసింగ్ 46, పెన్షన్ 16, ఇతర శాఖలకు సంబంధించినవి 39 దరఖాస్తులు అందాయని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, జి. ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ. వెంకటచారి, జిల్లా అధికారులు జి. ఆశన్నా, సురేందర్, రమేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో ఎంపికైన తెలంగాణ నేతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మే 15-18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతిలో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలో తెలంగాణ రాష్ట్రం నుండి ఆరుగురు నేతలను జాతీయ కౌన్సిల్‌లోకి ఎంపిక చేయడం జరిగింది. జాతీయ కార్యదర్శిగా వలి ఉల్లా ఖాద్రీ, జాతీయ వర్కింగ్ కమిటీ కార్యవర్గ సభ్యులుగా కల్లూరు ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్, జాతీయ సమితి సభ్యులుగా నానబాల రామకృష్ణ, లింగం రవి, వెంకటేశ్వర్లను ఎన్నిక కోసంకావడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపికైన నేతలు మాట్లాడుతూ 17వ జాతీయ మహాసభలలో అనేక యువజన, విద్యార్థి, మహిళా, కార్మిక, కర్షక సమస్యలపై చర్చలు జరిగాయని, పాలకులు అవలంబిస్తున్న విధానాలపై నిర్దిష్టమైన చర్చలు జరిపి, తీర్మానాలు రూపంలో భవిష్యత్ పోరాటాలను ఈ మహాసభ కార్యాచరణ ద్వారా రూపొందించినదని వారు అన్నారు. అదే విధంగా నేడు దేశంలో కేంద్ర ప్రభుత్వం యువతను మతం పేరుతో విభజిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను హరిస్తున్న పాలకుల పై సంఘటిత ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు ద్వారా మాత్రమే నిరుద్యోగం తగ్గుతుందన్నారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ నుండి 75 మంది ప్రతినిధులుగా హాజరుకావడం జరిగిందన్నారు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సిపిఎం పార్టీ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మౌలాలి డివిజన్ పిల్లినరసింగ్ రావు నగర్ కాలనీ శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి సభలో మల్కాజిగిరి మండల కమిటీ సభ్యురాలు పి.మంగ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో భారతదేశానికి కమ్యూనిస్టులు అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కమ్యూనిస్టులు ప్రజల మధ్య గ్యాప్ ఏర్పడుతుందని, ఈ గ్యాప్ వల్ల ప్రజలు యువత, కమ్యూనిస్టులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా సుందరయ్యని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. సుందరయ్య విద్యార్థి దశలోనే కుల వివక్ష గురించి పోరాటం నిర్వహించారు. ఈయన ఊర్లో స్టోర్స్ నడిపి అందరికీ చవుకగా సరుకులు అందించే వారని అదే విధంగా ఊర్లో వైద్య సహాయం కూడా ఈయనే స్వయంగా చేసేవారని తెలిపారు. ఈయన్ని ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టులు బలపడాలంటే ప్రజలతో మమేకం అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజలక్ష్మి, అనూష, అనిత, షాహిద్, నరసమ్మ, లక్ష్మి, రజిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీసెల్టింగ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సెయింట్ యాన్స్ పివిఎస్ కాలనీ నుండి సత్య రాఘవేంద్ర కాలనీ వరకు నాలా డిసెల్టింగ్ పనులను కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ సోమవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని డివిజన్‌లో ఉన్న నాళాలను డీ సెల్టింగ్ చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, కిషోర్, ఉదయ్ కుమార్, జాలయ్య గౌడ్, వెంకటేశ్, జాయ్, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మొయినాబాద్: ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ రామంతపూర్ గ్రామ సమీపంలోని శ్రీ శంభో మహాదేవ పార్వతీదేవి గణపతి, సుబ్రహ్మణ్యస్వామి శివలింగం, నంది, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరైయ్యారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై మంత్రి పొంగులేటి సమీక్ష

ఐదువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల పోస్టులకు 10 వేల దరఖాస్తులు

ఈనెల 26 నుంచి 2 నెలల పాటు సర్వే ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ

రెండు రోజుల్లో మూడు గ్రామాల్లో విలేజ్ మ్యాప్‌ల డిజిటలైజేషన్‌కు శ్రీకారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో భూపరిపాలనను మరింత మెరుగుపరచడానికి ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జతపరచడం తప్పనిసరి చేశామని ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకురావడానికి పెద్ద సంఖ్యలో సర్వేయర్ల అవసరాన్ని గుర్తించడం జరిగిందన్నారు.

ఇందుకోసం ఐదువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించగా 10,031 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై సోమవారం మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 26వ తేదీ నుంచి గచ్చిబౌలిలోని సర్వే ట్రైనింగ్ అకాడమీలో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం వలన గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూ వివాదాలను పరిష్కరించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

డిజిటలైజేషన్ ఆఫ్ విలేజ్ మ్యాప్స్....

టిజిఆర్ఏసి (తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను (మ్యాపులు) డిజిటలైజేషన్ చేపడుతన్నామని మంత్రి తెలిపారు. ప్రయోగాత్మకంగా నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని లింగాల గ్రామం, జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని తక్కలపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి మూడు గ్రామాలలో ఈ ప్రక్రియను రెండు రోజుల్లో ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఈ డిజిటల్ మ్యాప్‌లను ఎక్కడినుండైనా సులభంగా యాక్సెస్ చేయవచ్చని, మాన్యువల్ పద్ధతుల కంటే వేగంగా తక్కువ ఖర్చుతో ఖచ్చితమైన సమాచారం పొందవచ్చన్నారు.

డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూక్షేత్రాల పరిమాణం, ఆకృతి వంటి వివరాలు ఖచ్చితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెరగడంతో పాటు మ్యుటేషన్ ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. పునరుద్ధరణ భద్రత డిజిటల్ రూపంలో భద్రంగా నిల్వ చేయవచ్చు కాలానుగుణంగా అప్డేట్ చేయవచ్చు అని వివరించారు.

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులలో ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పనులలో తాత్సారం ఉండకూడదని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, సంబంధిత అధికారులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం సూచించారు. సోమవారం అల్వాల్ లోని టిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నిర్మాణ పనుల పురోగతి పై సమీక్షా సమావేశానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అన్నారు. ఆసుపత్రి పనుల పురోగతి పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత కాంట్రాక్టరు కలెక్టరు వివరించారు. 90 శాతం పనులు పూర్తయ్యాయని ఇంకొకరెండు నెలలో మిగిత నిర్మాణ పనులు పూర్తవుతాయని, కొన్ని చోట్లరీ డిజైన్ వలన కొంత అదనపు నిధులు అవసరమవుతున్నాయని కాంట్రాక్టర్ కలెక్టరుకు వివరించారు. చట్టబద్ధమైన ఆమోదాలు అటవీ శాఖ, ఏఏఐ, పర్యావరణ అనుమతి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డునిర్మాణానికి ఎన్ఓసి జారీ, నిర్మాణం కోసం విద్యుత్ మరియు నీటి కనెక్షన్ పొందబడింది. కాలుష్య నియంత్రణ బోర్డు స్థాపనకు సమ్మతిని జారీ చేసిందని సంబంధిత అధికారులు కలెక్టరుకు వివరించారు. అదేవిధంగాఈ ఆసుపత్రిలో టీచింగ్ ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీలు కూడా నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలో ఫర్నిచర్ ఏవిధంగా అందిస్తారని కలెక్టరు అడుడగా, అధునాతన పరికరాలైన మెడికల్ ఎక్విప్ మెంట్, ఆపరేషన్ థియేటర్లు నిర్మించేందుకు అగ్రిమెంట్‌లో ఒప్పందం జరిగిందని అదేవిధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని అధికారులు వివరించారు. కొన్ని అంశాలకు అవసరమైన డిఎంఎ అనుమతుల విషయంలో కలెక్టరు సంబంధిత అధికారులతో మాట్లాడుతానని కలెక్టరు తెలిపారు. ఎప్పటివరకు ఆసుపత్రి పనులు పూర్తి చేసి అప్పగిస్తారని కలెక్టరు అడుడగా, డిసంబరు 2025 నాటికి పూర్తి చేసి అప్పగిస్తామని కాంట్రాక్టరు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బిఈఈ వనజ,ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ఓ ఉమాగౌరీ, అల్వాల్ తహసీల్దారు రాములు, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలను తక్షణం పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఇంఛార్జి అదనపు కలెక్టరు హరిప్రియ స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (66) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఇంఛార్జి అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి అదనపు కలెక్టరు మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సుదీర్ఘ కాలంగా ఉద్యోగులకు రిటైర్డ్ బెనిఫిట్స్ రాక అనేక అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ పనిచేస్తుందని అయన వివరించారు. సోమవారం తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేయగా శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, దేవీ ప్రసాద్, విఠల్, పాతూరి సుధాకర్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అవిర్భావ దినోత్సవం నాటికి 5 డీఎలు, పీఆర్సీ, పెన్షన్ ఇవ్వాల న్నారు. అలాగే హెల్త్ కార్డుతో ప్రతి ఒక్కరికి క్యాష్ లెస్ ట్రీట్ మెంట్ అందించాలన్నారు. హోమ్ గార్డ్ ఉద్యోగులకు ఇంకా జీతం రాలేదని, ఉద్యోగుల 5 ప్రధాన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. హోమ్ గార్డ్‌లకు జీతాలు రాకపోవడంతో ఇల్లు రెంట్ కట్టని పరిస్థితి ఉందని, హోమ్ గార్డ్‌లకు హెల్త్ కార్డులు ఇవ్వకపోవడంతో హాస్పిటల్‌లో ఇబ్బందులు ఎదురుకుంటున్నారని కావున వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. 10 వేల మంది రిటైర్ అయిన ఉద్యోగుల ప్రయోజనాలు వెంటనే చెల్లించాలి, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి వారికి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 3లక్షల మందికి రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని, వెంటనే ఉద్యోగుల సమస్యల కోసం ఒక కమిటీ వేసిన ఇంతవరకు స్పందన లేదన్నారు. మంత్రుల కమిటీ వేసి ఆరు నెలలు వేసిన అడుగు కూడా ముందుకుపడ లేదన్నారు. కమిటీలతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. నవీన్ మిట్టల్ నేతృత్వంలో వేసిన కమిటీ ఏం చేస్తుందని నిలదీశారు. మీ మేనిఫెస్టోలో పెట్టిన డిమాండ్స్‌ను వెంటనే నెరవేర్చాలని అన్నారు. ఈ సమావేశంలో యం.ఏ.హమీద్, భుజంగరావు లక్ష్మణ్, శ్యాంరావు, బాలమల్లు, హసన్, రంగరాజు, ఆదినారాయణ రెడ్డి, కళ్యాణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాలి

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్: ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాలని ప్రైవేట్ వ్యాపారులకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ అన్నారు. షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు స్థానిక పాలకవర్గం సభ్యులతో కలిసి మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాబర్ మాట్లాడుతూ ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని వికరించవద్దని ప్రభుత్వానికి ఇస్తే క్వింటాలుకు రూ.2,350తో పాటు 500 తెలంగాణ ప్రభుత్వం బోనస్ ఇస్తుందని తెలిపారు. మార్కెట్ యార్డులో డైరెక్టర్లు కరుణాకర్, మల్లేష్, భరత్ లాహోటి తదితరులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్ యార్డులో తదితర రైతులతో పాలకవర్గం సభ్యులు మాట్లాడడం జరిగింది. ప్రభుత్వానికి ధాన్యం ఇవ్వడం ద్వారా మద్దతు ధర కలుగుతుందని ప్రైవేట్ వ్యాపారులకు ఇవ్వడం వల్ల ఇష్టం సారంగా ఉంటుందని అన్నారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులను కూడా కమిటీ సభ్యులు హెచ్చరించారు. ప్రభుత్వ మద్దతు ధరకు తక్కువగా ధాన్యం తీసుకోవద్దని సూచించారు. ఒకవేళ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే లైసెన్సులు క్యాన్సల్ చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఇలాంటి ఇబ్బందులు ఎదురైనా కమిటీ సభ్యులను సంప్రదించాలని తమకు ఫోన్ చేయాలని అన్నారు.

దేశ ప్రధాన న్యాయమూర్తిని గౌరవించకపోవటం భారత సంస్కృతికి విఘాతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత 52 ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన భూషణ్ రామ్‌క్రిష్ణ గవాయ్ ప్రథమంగా తన స్వరాష్ట్రమైన మహారాష్ట్రకు ఆ రాష్ట్రం, గోవా లోని బార్ అసోసియేషన్ సభ్యుల ఆహ్వానం మేరకు సమావేశానికి హాజరైతే తనకు, తన పదవికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోవటం నూటికి నూరుశాతం మహారాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అధికారులు చీఫ్ జస్టిస్‌కు ప్రొటోకాల్ ప్రకారం ఇవ్వవల్సిన మర్యాదలు ఇవ్వటంలో జరిగిన లోపాలు ఉద్దేశపూర్వకంగా జరిగినాయా.. లేక మరోరకంగా జరిగాయో విచారణ జరిపించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రభుత్వం, పాలన, న్యాయ వ్యవస్థల మధ్య సమతూకం ఉండాలని అన్నింటికి మార్గదర్శకం భారత రాజ్యాంగం అని స్పష్టంగా తెలియజేసిన చీఫ్ జస్టీస్ గవాయ్‌కి జరగవల్సిన న్యాయం జరగకపోవటం విచారకరమన్నారు. ప్రభుత్వ అధికారులను వెంటనే సస్పెండ్ చేసి విచారణ జరిపి వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర న్యాయశాఖను కోరారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలను న్యాయవ్యవస్థ, పౌర సమాజం స్పందించి కేంద్ర ప్రభుత్వ కళ్లు తెరిపించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

విశాలాంధ్ర - మొయినాబాద్ : నేటి నుండి 24వ తేదీ వరకు మండల పరిధిలోని వివేకానంద ఇంటర్నే షనల్ స్కూల్ నందు ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఎల్. పురం దాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు సమయానికి హాజరుకావాలన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు తెలుగు, ఇంగ్లీష్, మాథ్స్, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులపై శిక్షణ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులందరూ డిఆర్పిల నుండి శిక్షణ పొందిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్పీలు, సీఆర్పీలు, కృష్ణ, శంకర్, నరసింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్ పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి



విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఉభయ సభలలో బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్స్ కల్పిస్తూ బిల్లులు ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపినా కేంద్రంలో ఎలాంటి స్పందన లేకపోవడం బీసీల ఎడల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చితశుద్ధి ఏమిటో అర్థమవుతుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో విమర్శించారు. గ్రామ పంచాయతీలలో, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో, మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగక ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహిస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉభయ సభలలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ బిల్లు కేంద్రం ఆమోదించే విధంగా ఒత్తిడి తేవడానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో, బీసీ సంఘాల ప్రతినిధులతో కూడిన అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని చేసిన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి తక్షణమే ఆచరణలో పెట్టాలన్నారు. రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు బిజెపి ఎంపీలు ప్రధానమంత్రిపై ఒత్తిడి పెంచి స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ బిల్లు 9వ షెడ్యూల్లో చేర్చే విధంగా చిత్త శుద్ధితో కృషి చేయాలని లేనిచో బీసీల ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని హెచ్చరించారు. బీసీలకు రిజర్వేషన్ పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ప్రకాశ్‌కు పీహెచ్‌డీ అవార్డు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబాబాద్ జిల్లాలోని చిన్న గూడూరు మండల కేంద్రానికి చెందిన ప్రతాపని కృష్ణమూర్తి, సువర్ణం దంపతుల మూడవ కుమారుడైన ప్రతాపని ప్రకాశ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో జియాలజీ విభాగం నుండి జియాలజీలో పిహెచ్ డీ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ (జియోలాజీ విభాగం), యూనివర్సిటీ - సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ అయిన డాక్టర్ జి. ప్రభాకర్ మార్గదర్శకత్వంలో "తెలంగాణ రాష్ట్రంలోని జనగాం జిల్లా, రఘునాథపల్లి వాటర్షెడ్లో భూగర్భ జలాలు, ఉపరితల జలనిర్వహణ కోసం ఇంటిగ్రేటెడ్ రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ అధ్యయనాలు" అనే అంశంపై డాక్టర్ ప్రకాశ్ పరిశోధన చేశారు. ఆయన జలవనరులు, భూగర్భ శాస్త్ర రంగాలలో రిమోట్ సెన్సింగ్, జిఐఎస్ టెక్నాలజీలను ఉపయోగించడంలో ప్రత్యేకత కలిగి ఉన్నారు. గతంలో, ఆయన కర్నాటకలో ప్రపంచ బ్యాంక్ నిధులతో నడిచే "జల్ నిర్మల్ ప్రాజెక్టు"లో, "రాజీవ్ గాంధీ త్రాగునీటి మిషన్" ప్రాజెక్టు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్)లలో పని చేశారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ ప్రభుత్వ ప్రణాళిక విభాగం కింద తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ (టిజిఆర్ఏసి)లో సైంటిఫిక్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. పిహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా ఆయన గైడ్ జి.ప్రభాకర్‌కి, జియాలజి విభాగం సిబ్బంది (ఉస్మానియా విశ్వవిద్యాలయం), టిజిఆర్ఏసి సిబ్బంది, కుటుంబసభ్యులు, స్నేహితులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : చందా నగర్ పోస్ట్ ఆఫీసును శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ ఇంచార్జ్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్‌తో కలిసి సందర్శించిన సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై ఈనెల 15వ తేదీన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వివరించారు. సోమవారం టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి లేఖను, సంబంధించిన అధికారి డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ అధికారి బి. అరుముగంకి కలిసి, మొదటి అంతస్తులో కాకుండా, ప్రజల సౌకర్యార్థం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండే విధంగా ప్రయత్నం చేయాలని, వెంటనే సమస్యను పరిష్కరించగలరు అని చందా నగర్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు గొల్లపల్లి రాంరెడ్డితో కలిసి వారిని కోరడం జరిగింది.

హైదరాబాద్ పేలుళ్ల కుట్ర కేసులో సంచలన విషయాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలో కలకలం రేపిన హైదరాబాద్ పేలుళ్లకు సంబంధించిన కుట్ర కేసులు సంచలన విషయాలు వెలుగు చూసాయి. ఈ మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్న సిరాజ్, సమీర్ రిమాండ్ రిపోర్ట్‌లో పలు కీలక అంశాలను పోలీసులు ప్రస్తావించారు. వీరు ఇన్‌స్టాలో గ్రూప్ క్రియేట్ చేసుకుని ఆరుగురు సభ్యులుగా ఏర్పడినట్లు వెల్లడించారు. సిరాజ్, సమీర్‌తో పాటు టీమ్‌లో కర్నాటక, మహారాష్ట్ర యువకులు ఉన్నట్లు వివరించారు. ఈ ఆరుగురు కూడా హైదరాబాద్‌లో 3రోజుల పాటు కలిసి ఉన్నారని ఐసిస్ హ్యాండ్లర్ సౌదీ నుంచి ఇచ్చే ఆదేశాలు అమలు చేయడంపై సమావేశం కూడా అయ్యారని తెలిపారు. నగరంలో పేలుళ్ల కోసం టిఫిన్ బాక్స్ బాంబులు తయారు చేయాలని ఇద్దరికి ఆదేశాలు అందగా మిగితా నలుగురికి బాంబ్‌లు పెట్టే టార్గెట్లు గుర్తించాలని ఆదేశాలు ఇచ్చారు. అమేజాన్‌లో టిఫిన్‌బాక్స్‌లు, వైర్లు, రిమోట్ సెల్స్‌ను సిరాజ్ ఆర్డర్ చేయగా, ఆదివారం విజయనగరంలో సిరాజ్, హైదరాబాద్‌లో సమీర్‌ను పోలీసులు అరెస్ట్ అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ విజయనగరం కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. అరెస్టు సమయంలో సిరాజ్ దగ్గర భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు గుర్తించారు. సిరాజ్ నుండి పోలీసులు అమ్మోనియం నైట్రేట్, సల్ఫర్, అల్యూమినియం పౌడర్ సీజ్ చేయడం జరిగింది.

కూకట్‌పల్లిలో హైడ్రా కూల్చివేతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కూకట్‌పల్లి పరిధిలోని డైమండ్ ఎస్టేట్ లేఅవుట్‌లో ఆక్రమణలను హైడ్రా కూల్చివేసింది. హైకోర్టు ఆదేశించినా ఆక్రమణలను తొలగించకపోవడంతో సోమవారం రంగంలోకి దిగిన హైడ్రా లేఅవుట్‌లోని షెడ్లను బుల్డోజర్లతో తొలగించింది. ఈ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులకు ఎట్టకేలకు న్యాయం చేసింది. దీంతో హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు అధికారులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ థ్యాంక్స్ చెప్పారు. హైడ్రా కూల్చివేతలపై హర్షం వ్యక్తం చేస్తూ బాధితులు కృతజ్ఞతలు చెబుతున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. బాధితుల వివరాల ప్రకారం హైదర్‌నగర్ డివిజన్‌లోని సర్వే నెంబర్ 145లో 9 ఎకరాల 27 గుంటల స్థలంలో డైమండ్ ఎస్టేట్స్ లేఅవుట్ విస్తరించింది. 2000 సంవత్సరంలో ఈ లేఅవుట్ లో 79 మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే, ఆ స్థలం తనదని శివ దుర్గాప్రసాద్ అనే వ్యక్తి మరి కొంతమందితో కలిసి ఆక్రమించాడు. హైకోర్టుకు వెళ్లి తనకు అనుకూలంగా స్టే తెచ్చుకున్నాడని వివరించారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారిని వెంచర్‌లోకి అడుగుపెట్టకుండా అడ్డుకున్నట్లు తెలిపారు. దీంతో న్యాయం కోసం 79 మంది బాధితులు కోర్టును ఆశ్రయించగా గతేడాది సెప్టెంబర్‌లో బాధితులకు అనుకూలంగా కోర్టు తీర్పు వెలువరించింది. శివదుర్గాప్రసాద్, ఆయన అనుచరులు ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశించింది. అయినా శివ దుర్గాప్రసాద్ ఖాళీ చేయకపోవడంతో బాధితులు హైడ్రాను ఆశ్రయించారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు సోమవారం రంగంలోకి దిగి ఆక్రమణలను కూల్చివేశారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తా : కొలను

విశాలాంధ్ర-దుండిగల్: మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి 125 డివిజన్ రుడా మేస్త్రి నగర్ నిరుపేద మైనారిటీ నాయకులు కైసర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు కొరకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విన్నపించారు. కొలను హన్మంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి అతి త్వరలో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వారికీ హామీ ఇచ్చారు. అనంతరం మైనారిటీ నాయకులు కొలను హన్మంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియ దళిత సేన అధ్యక్షులు డా. అవిజే జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, ఎండి అజమ్, రహీమ్, ఖలీమ్, మైనారిటీ నాయకులు సుల్తాన్ మీర్జా, కయ్యూమ్, రాకేష్, ఆఫీజ్, ముస్తఫా, షాహిన్ బేగమ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ స్వాగత్ నగర్‌లో నూతన సిసి రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు. అనంతరం కాలనీ వాసులు కార్పొరేటర్ సురేష్ రెడ్డిని శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రెటరీ శివాజీ, కాలనీవాసులు మైముద్ భాయ్, సునీల్, యువరాజ్, సాయిరాజ్, లావణ్య, శివశంకర్, ధనుంజయ్, ప్రవీణ్ రెడ్డి, నవీన్ రెడ్డి, వీరేష్, బిట్టు, ప్రభాకర్, విజయ్ నారాయణ రెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలి

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని సంస్కృతి సంప్రదాయాలను కాపాడడంతో పాటు ఐక్యతగా వర్ధిల్లాలని రంగారెడ్డి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ జిల్లా మాజీ చైర్మన్, కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దంపతులు అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామంలో బొడ్రాయి పండుగ, శివాలయ పునర్నిర్మాణం ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమాలకు విశాల శ్రావణ్ రెడ్డి హాజరయ్యారు. గ్రామస్తులు వారికి ఆహ్వానం పలికి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిన నాడే గ్రామాల్లో శాంతి వాతావరణం నెలకొంటుందని అన్నారు.

సీఎస్బీ బ్యాంక్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ క్రాస్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి సీఎస్బీ బ్యాంక్‌ను కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ సీఎస్బీ బ్యాంకు వారి కొత్త బ్రాంచ్‌ను ఇక్కడ ప్రాంభించుకోవడం చాల సంతోషకర మైన విషయం అని, ఇక్కడి ప్రాంత వాసులకు ఎంతగానో తోడ్పడుతుంది అన్నారు. వినియోగదారులు దేవుళ్ళతో సమానం కావున వినియోగదారులకు మంచి సేవలు అందించి వారి మన్ననలు పొంది మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి అభివృద్ధి చెందాలని గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, గణేష్ ముదిరాజు పాల్గొన్నారు.

ప్రజావాణి విన్నపాలను సత్వరమే పరిష్కరించాలి

కమిషనర్ ఆర్‌వి కర్ణన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై విన్నపాలను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలను వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు వాటిని బాధ్యతతో పరిష్కరించాలని తెలిపారు. ప్రజల నుండి అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారం కాని యెడల అందుకు గల కారణాలను సంబంధిత అర్జీదారునికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 66 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 33, ఇంజనీరింగ్ 6, ట్యాక్స్ సెక్షన్ 5, ఎలక్ట్రిక్, ల్యాండ్ అక్విజిషన్, ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్, హౌసింగ్, విజిలెన్స్ విభాగాలకు రెండు చొప్పున, హెల్త్, ఎస్టేట్, లేక్స్, యు.బి.డి విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 113 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 40, శేరిలింగంపల్లి జోన్‌లో 14, ఎల్బీనగర్ జోన్‌లో 9, సికింద్రాబాద్ జోన్‌లో 17, చార్మినార్ జోన్‌లో 3, ఖైరతాబాద్ జోన్ 30 అర్జీలు అందాయి. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు వేణు గోపాల్, పంకజ, గీతా రాధిక, నళిని పద్మావతి, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి లు గంగాధర్, వెంకన్న, ఎల్.ఏ.ఓ రాము నాయక్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, హార్టికల్చర్ అధికారి సునంద, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్, జలమండలి డీజీఎం సాయి రమణ, డిప్యూటీ సిఈ పనస రెడ్డి, పి వి రావు, హౌసింగ్ ఈ ఈ రాజేశ్వర రావు, జాయింట్ కమీషనర్ రెవెన్యూ మహేష్ కులకర్ణి, అడ్వర్టైజ్మెంట్ ఆఫీసర్ వెటర్నరీ పర్యవేక్షకులు శైలజ, మెయింటెనెన్స్ ఏ ఈ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ కోసం హైకోర్టుకు ఓఎంసీ దోషులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓబులాపురం మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసీ) కేసులో దోషులుగా తేలిన నలుగురు తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డితో పాటు బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్, అలీ ఖాన్‌లు నేడు ఉన్నత న్యాయస్థానంలో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. తమ పిటిషన్లలో, తమను దోషులుగా నిర్ధారించడానికి సీబీఐ కోర్టు తగిన ఆధారాలను పరిగణనలోకి తీసుకోలేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో తాము మూడున్నరేళ్లకు పైగా జైలు జీవితం గడిపామని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. గతంలో విచారణ సమయంలో తమకు బెయిల్ మంజూరైనప్పుడు ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని, కోర్టు విధించిన షరతులకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని వారు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా బెయిల్ మంజూరు చేస్తే, కోర్టు నిర్దేశించిన అన్ని నిబంధనలను తప్పకుండా పాటిస్తామని పిటిషనర్లు తమ అభ్యర్థనలో వివరించారు. ఈనెల 6వ తేదీన హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఓఎంసీ కేసుకు సంబంధించి తుది తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

ఈ తీర్పులో గాలి జనార్దనరెడ్డి, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్, అలీఖాన్‌లను దోషులుగా నిర్ధారిస్తూ కోర్టు శిక్ష ఖరారు చేసింది. తీర్పు వెలువడిన నాటి నుంచి వీరంతా చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. తమకు విధించిన శిక్షను సవాలు చేస్తూ, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు ఇప్పుడు హైకోర్టు తలుపు తట్టారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు, 4వ వార్డు, 19వ, 20వ వార్డు, 21 వ వార్డులలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాయకులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని తెలిపారు. గతంలో కూడా కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరిగిందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని ఆయన అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. పేదలకు అండగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, బాబర్ అలీ ఖాన్, విశ్వం,చెన్నయ్య, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, బస్వం, చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, జమ్రుద్ ఖాన్, అందే మోహన్, ఇబ్రహీం, ముబారక్, ఖదీర్, సీతారాం, అశోక్, మురళీమోహన్, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సొంత నిధులతో చితిమంటపాల నిర్మాణాలు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : చితిమంటపాలను మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత నిధులతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందని పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం పటాన్చెరువు పట్టణంలోని యాదవ సంఘం స్మశాన వాటికలో మెట్టు శాంతమ్మ, మెట్టు సత్తయ్య యాదవ్ జ్ఞాపకార్థం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సొంత నిధులతో చితిమంటపాల నిర్మించి సోమవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యాదవ సంఘం స్మశాన వాటికలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు ప్రజలకు గురవుతున్నారు అన్న ఉద్దేశంతో శితిమంటపాలను నిర్మించడం జరిగిందన్నారు. స్మశాన వాటికకు వచ్చే ప్రజలకు కూర్చోవడానికి త్వరలోనే షెడ్డులను నిర్మించడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. పట్టణంలోని అన్ని వర్గాల స్మశాన వాటికలలో మౌలిక వసతుల కల్పనకు జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో ఇప్పటికీ అనేక రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఆయా స్మశానవాటికలలో సొంత నిధులతో ప్రహరీ గోడలను నిర్మించామని తెలిపారు. స్మశానవాటికలలో చేతులు కాళ్లు కడుక్కోవడానికి సొంత నిధులతో బోర్లను సైతం వేయించి నీటి సదుపాయాన్ని కల్పించామన్నారు. ఆయా అన్ని వర్గాల స్మశాన వాటిక లకు వెళ్లే రోడ్లను సైతం సీసీ రోడ్లుగా నిర్మించామని ప్రజలకు ఎక్కడ సౌకర్యం లేకుండా జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు దేవయ్య యాదవ్, నాయకులు జి శ్రీశైలం యాదవ్, జి మల్లేష్ యాదవ్, మెట్టు మదన్ యాదవ్, బి నాగరాజు యాదవ్, బిక్షపతి, కొండి మల్లేష్ యాదవ్, మేకల వెంకటేష్ యాదవ్, ఎన్ యాదగిరి యాదవ్, మెట్టు ఎల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార కమిషనర్ పదవుల నియామకాల్లో కొరవడిన సామాజిక న్యాయం



విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఇటీవల నియమించిన రాష్ట్ర సమాచార కమిషనర్ నియామకాల్లో సామాజిక న్యాయం పూర్తిగా కొరవడిందని, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా బీసీలకు ఒక్కటీ కూడా అవకాశం ఇవ్వకుండా, అగ్రకులాలకే సమాచార కమిషనర్ పదవులు కట్టబెట్టడాన్నీ తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, తెలంగాణలో జరిగిన కులగనన లెక్కల ప్రకారం ప్రతి నామినేటెడ్ పోస్టులో 56 శాతం బీసీలకు వాటా కల్పించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ మేధావుల వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ ఏం బాగయ్య, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమలతో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని బీసీలకు ఖాళీగా ఉన్న మిగతా మూడు సమాచార కమిషనర్ పదవులను బీసీలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమాచార కమిషనర్లు నామినేటెడ్ పోస్టులన్నింటిని అగ్రకులాలకు కట్టబెట్టడాన్ని బీసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, కనీసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు చేసిన విధంగా 42 శాతం పదవులు ఇవ్వాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ మేధావుల వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.బాగయ్య, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకురుమ, గౌడ జన హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభూ, ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కదారి వెంకటేష్ పాల్గొన్నారు.

దుంప కూరగాయలతో పోషకాహార భద్రత

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : అనాదిగా వస్తున్న దుంప కూరగాయల సాగుతో దేశంలో పోషకాహార భద్రత సాధించడంతో పాటు, ఉపాధి, ఎగుమతి అవకాశాలు చాలా మెండుగా ఉంటాయని దుంప కూరలపై హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సదస్సులో తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రతినిధులు అన్నారు. హైదరాబాదులోని రాజేంద్రనగర్‌లో ఉద్యాన కళాశాల వేదికగా జరిగిన దుంప కూరగాయలపై అఖిలభారత పంటల సమన్వయ పరిశోధన పథకం 25వ వార్షిక గ్రూప్ సదస్సును కేరళలోని దుంప కూరగాయల పరిశోధన సంస్థ, తెలంగాణలోని కూరగాయల పరిశోధన కేంద్రం సంయుక్తంగా రెండు రోజులపాటు 19, 20వ తేదీల్లో నిర్వహిస్తున్నాయి. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి మాట్లాడుతూ తరుముకొస్తున్న పర్యావరణ మార్పులను దీటుగా తట్టుకోవడంతోపాటు దేశం మొత్తానికి పోషకాహార భద్రత, అలాగే రైతులకి అధిక ఆదాయాన్నిచ్చేందుకు దుంపకూరలు భవిష్యత్తు ఆశాజనకాలుగా ఉన్నాయన్నారు. తక్కువ కాలంలో వచ్చే నూతన రకాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లకి అనుసంధానం చేసి, దేశంలోని ప్రతి పట్టణం చుట్టుపక్కల 50 కిలోమీటర్ల దూరంలో దుంపకూరగాయల సాగును ప్రోత్సహిస్తే వీటి అందుబాటు వినియోగదారులకు పెరుగుతుందని తెలిపారు. ఇటీవల అధ్యయనం ప్రకారం ఉద్యాన పంటల సాగుతో రైతు కుటుంబాల సరాసరి ఆదాయం నెలకు 13000 నుండి14000 రూపాయలు ఉంటే ఇతర పంటల సాగుతో కేవలం 3000 నుండి 4000 రూపాయలు మాత్రమే ఉందని అన్నారు.

అంబులెన్సులు రాలేదనేది అవాస్తవం

సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లచే 108 అంబులెన్స్‌ల ఆకస్మిక పరిశీలన : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మే 18న గుల్జర్ హౌస్ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్సు రాక బాధితులకు ఆక్సిజన్ అందలేదనేది కొన్ని పత్రికలలో వచ్చిన వార్త అవాస్తవమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. మే 18న గుల్జర్ హౌస్‌లో అగ్ని ప్రమాదమునకు గురైన 15 మంది బాధితులను 7అంబులెన్సులు108 వాహనములలో సమీప ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తక్షణమే తరలించి ఆక్సిజన్ అందిస్తూ సహాయక చర్యలు అందించడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ఈ ప్రమాద సమాచాము 108 జిల్లా కోఆర్డినేటర్ భూమా నాగేందర్‌కు తెలియజేయడం జరిగిందన్నారు. ప్రమాదమునకు సంబంధించిన సమాచారము ఉదయం 6.17 నిమిషాలకు 108 కాల్ సెంటర్ కు అందిన వెంటనే గోషామహల్ 108 అంబులెన్స్ ts 08 ul 5682 వాహనము సిబ్బందితో ఉదయం 6.25 నిమిషాలకు (8 నిమిషాలలో) ప్రమాద స్థలానికి చేరి సహాయ చర్యలు అందించామని తెలిపారు.. తదుపరి అగ్ని ప్రమాద తీవ్రతను గుర్తించి తిరిగి (06) 108 అంబులెన్స్ వాహనంములు టిజి 09యుబి 9280, టిజి 08 టి 8252, టిజి 08 టి 7933, టిజి 08 టి 7274, టిజి 08టి 8202,టిజి 08 టి 8113 అగ్ని ప్రమాద స్థలానికి వెంటనే చేరుకుని సహాయ చర్యలు అందించినాయని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు నేడు మే 19న ఏడు108 అంబులెన్స్ వాహనాలను ఆకస్మికంగా పరిశీలించగా అందులో అవసరమైన ఆక్సిజన్ వసతులు, నిలువలు ఉన్నట్లు సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు ధ్రువీకరించినారని కలెక్టర్ తెలిపారు.

కమర్షియల్ షెటర్స్‌పై అధికారులు స్పందించాలి

విశాలాంధ్ర - కాప్రా : జై జవాన్ కాలనీలో ఉన్నటువంటి జిహెచ్‌ఎంసి కి సంబంధించిన పది కమర్షియల్ షెటర్స్ స్వాధీనపరచుకునేది ఎప్పుడు...? అలాగే అధికారుల నిర్లక్ష్యానికి ఇప్పటివరకు కోల్పోయిన దాదాపు కోటి రూపాయల సంగతి ఏమిటి...? అనే విషయంలో ఎన్నో సంవత్సరాలు గడుస్తున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ఇట్టి విషయం పై పూర్తి ఆధారాలతో సోమవారం కాప్రా జిహెచ్‌ఎంసి కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షలో కూర్చునా వెంటనే కుషాయిగూడ పోలీస్ అధికారులు ప్రివెంటు అరెస్టు చేసి కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్తులు కాపాడటమే లక్ష్యంగా కాప్రా జిహెచ్‌ఎంసిపై అధికారులు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయమని చెప్పుతున్నప్పటికీ ఆరు నెలలుగా కప్రా జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యానికి ప్రతినెల దాదాపు 50 నుండి 60 వేల రూపాయలు కోల్పోతుందన్నారు. ఇప్పటికైనా 10 కమర్షియల్ షెటర్స్‌పై జిహెచ్‌ఎంసి అధికారులు వెంటనే స్పందించకపోతే, ఇందిరాపార్క్ వద్ద దీక్షకు కూర్చునేందుకు వెనుకాడనని తెలియజేస్తూ, ప్రివెంటు అరెస్టులో నాతో పాటు భారతీయ మౌనజాతుల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు ముస్త్యాల రామ్ చంద్రం, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి, కాప్రా కార్పెంటర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టిముక్కుల నరసింహచారి, నాగేష్, రాజు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితునికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - అమనగల్లు : ఆమనగల్లు మండల పరిధిలోని శంకర్ కొండ తండాకు చెందిన వినోద్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు సోమవారం వినోద్‌ను ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం వినోద్ కుటుంబ సభ్యులకు తోటి మిత్రులు కొంత పోగు చేసుకొని 16,000 రూపాయలను అందజేశారు. పరామర్శించిన వారిలో తోటి స్నేహితులు రాజు, శ్రీను, రాజేష్, నవీన్, ప్రవీణ్, శ్రీనివాస్, ఫుల్ సింగ్, జై లాల్, శ్రీను, విజయ్, సాయికుమార్, రమేష్, వినోద్, వరుణ్, సుమన్, రాజా తదితరులు ఉన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన రామచందర్‌యాదవ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : కర్చర్ల ఎల్లేష్ అన్నయ్య సత్యనారాయణ కుమార్తె పెళ్లికి హాజరై వధూవరులను తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులుబేరీ రామచంద్ర యాదవ్, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆశీర్వదించారు. ఎల్లేష్ ఆహ్వానం మేరకు పి.వీ.కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పెళ్లికి బేరి రామచంద్ర యాదవ్, సదానంద్ యాదవ్, కుమార్ యాదవ్ సత్యనారాయణ యాదవ్, ఆర్కే సాయన్న ముదిరాజ్ పెళ్లికి హాజరై పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారునికి ఆశీర్వదించి తల్లిదండ్రులను కలిసి ఆనందాక్షణాల్లో ధన్యవాదాలు తెలుపుకోవడం జరిగింది. ఎస్ ఏఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎస్సై గంగారం యాదవ్ కుమారుని పెళ్లికి హాజరై రామచంద్ర యాదవ్ బృందం వధూవరులను ఆశీర్వదించి భోజనాధులను స్వీకరించి రావడం జరిగింది. అడ్వకేట్ రమేష్ అన్నయ్య గంగారాం పోలీస్ డిపార్ట్మెంట్ ఎస్సై కుమారుని పెళ్లికి హాజరై బేరి రామచందర్ యాదవ్, బృందం అందెల సత్యనారాయణ యాదవ్, అందేలా కుమార్ యాదవ్, ఆర్కే సాయన్న ముదిరాజ్ శ్రీశైలం యాదవ్, మారబోయిన సదానంద యాదవ్ వధూవరులను ఆశీర్వదించి సంతోషంగా జీవించాలని భగవంతుని ప్రార్థిస్తూ కోరడం జరిగింది.

జూన్ 13న థియేటర్లకు హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : యూనివర్సల్ పిక్చర్‌ల (వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ ద్వారా పంపిణీ చేయబడింది) హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్ జూన్ 13, 2025న థియేటర్‌లోకి తిరిగి రావడంతో ఒక తరం మాయాజాలాన్ని తిరిగి రగిలించనుంది. ఈసారి ఉత్కంఠభరితమైన లైవ్-యాక్షన్ అనుసరణలో అకాడమీ అవార్‌కు నామినేట్ చేయబడిన, గోల్డెన్ గ్లోబ్ విజేత చిత్రనిర్మాత డీన్ డెబ్లోయిస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా హృదయాలను దోచుకున్న ప్రియమైన యానిమేటెడ్ గాథను తిరిగి ఊహించుకుంటుంది. ధైర్యవంతుడైన యువ వైకింగ్ హికప్‌గా మాసన్ థేమ్స్, నిర్భయమైన ఆస్ట్రిడ్‌గా నికో పార్కర్, స్టోయిక్ ది వాస్ట్‌గా తన ఐకానిక్ పాత్రను తిరిగి పోషించిన గెరార్డ్ బట్లర్ ప్రధాన తారాగణం. వారితో నిక్ ఫ్రాస్ట్, జూలియన్ డెన్నిసన్, గాబ్రియేల్ హెావెల్, బ్రాన్విన్ జేమ్స్, హ్యారీ ట్రెవాల్డ్విన్, రూత్ కాడ్, పీటర్ సెరాఫినోవిచ్, ముర్రే మెక్‌ఆర్థర్ వంటి నక్షత్ర బృందం చేరింది. దర్శకుడు డీన్ డెబ్లోయిస్ మాట్లాడుతూ "రచయిత కోవెల్ కోసం, కథ మూలాలు ఆశ్చర్యకరంగా వ్యక్తిగతమైనవన్నారు.

పీఎస్ఎల్వీ సీ-61 వైఫల్యం దురదృష్టకరం

ఈ ఏడాది మరో 13 రాకెట్ల ప్రయోగం: ఇస్రో ఛైర్మన్

చెన్నై: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ద్వారా ఈ ఏడాది మరో 13 రాకెట్లను ప్రయోగించనున్నట్లు ఇస్రో ఛైర్మన్ వీ నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన చెన్నై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. పీఎస్ఎల్వీ సీ-61 రాకెట్ ప్రయోగం విఫలం కావడం చాలా దురదృష్టకర మన్నారు. జాతీయ భద్రత, విపత్తు నిర్వహణ, వాతావరణ అంచనా, అటవీ పర్యవేక్షణ, పట్టణ ప్రణాళిక, వ్యవసాయం వంటి ప్రాజెక్టుల కోసం ఇస్రో ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ-61 రాకెట్ విఫలమైనట్లు చెప్పారు. అంతరిక్షంలోకి భారత్ ప్రయోగించిన 101వ రాకెట్ ఇదని వివరించారు. అలాగే, విఫలమైన రాకెట్ గురించి ఆయన క్లుప్తంగా చెప్పారు. పీఎస్ఎల్వీ సీ-61 అనేది నాలుగు దశల రాకెట్ అని నారాయణన్ అన్నారు. నాలుగు దశలు సరిగ్గా పనిచేస్తేనే రాకెట్ విజయవంతం అవుతుందన్నారు. మొదటి రెండు దశలు విజయవంతంగా పనిచేసినప్పటికీ, మూడో దశలో చిన్న లోపం ఏర్పడినట్లు వివరించారు. మూడో దశలో సాంకేతిక సమస్య కారణంగా రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించలేక పోయినట్లు చెప్పారు. అయితే లోపం ఎలా జరిగిందో తెలియదని, రాకెట్ వైఫల్యాన్ని పరిశోధించడానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు నారాయణన్ తెలిపారు. ఈ ఏడాది ప్రయోగించనున్న 13 రాకెట్ల ప్రయోగాల్లో ఇటువంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్‌కు తలనొప్పిగా శశిథరూర్

న్యూదిల్లీ: కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఇప్పుడు తన సొంత పార్టీకి తలనొప్పిగా మారారు. థరూర్‌ను పార్టీలో కొనసాగించాలా...లేదా అనే అంశంపై కాంగ్రెస్ తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఉద్దేశించిన ఏడు బృందాల్లో ఒకదానికి శశిథరూర్ నాయకత్వం వహిస్తున్నారు. కాంగ్రెస్ అధినాయకత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తోన్న వేళ... కేంద్ర ప్రభుత్వం ఈ కీలక బాధ్యత అప్పగించడం కాంగ్రెస్‌కు ఏ మాత్రం రుచించటం లేదు. ఆయనపై వేటు వేయాలా... వేచి చూద్దామా అని కాంగ్రెస్ పార్టీలో తర్జనభర్జనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పాక్‌ను ఎండగట్టే దౌత్యబృందంలో కేంద్రం అన్ని పార్టీల సభ్యులకు చోటు కల్పించింది. ఎంపీలను ఎంపిక చేసే క్రమంలో రాజకీయ పార్టీల సిఫార్సులను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ పరిగణనలోకి తీసుకుంది. శశిథరూర్ పేరును కాంగ్రెస్ పార్టీ ప్రస్తావించకపోయినా కమిటీలోకి తీసుకున్నారు. పేర్లు ప్రతిపాదించాలని తమను కోరి... పార్టీతో సంబంధం లేకుండా ప్రభుత్వమే నేరుగా థరూర్ పేరు ప్రకటించడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల ప్రధాని మోదీ కేరళ పర్యటనలో భాగంగా ఒకే వేదికపై ఈ ఇద్దరు నేతలు కనిపించారు. 'ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ కార్యక్రమం కొంతమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది' అని మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ మధ్య ఓ కేంద్రమంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం జరిగింది. ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ థరూర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. థరూర్ పార్టీలోనే కొనసాగుతూ... బీజేపీ చెప్పినట్లుగా ఆడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ అనుమానిస్తోంది. 2026లో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో థరూర్ వ్యవహారశైలితో పార్టీకి నష్టం జరగకముందే... ఆయనపై ఓ నిర్ణయానికి రావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్రం ఆ బాధ్యతలు అప్పగించగానే ఆయన అంగీకరించడం, కనీసం కాంగ్రెస్ ప్రస్తావన తేకపోవడం రుచించలేదని తెలుస్తోంది. కానీ.. పార్టీ పూర్తి సందిగ్ధతలో ఉంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ విషయాల్లో కేంద్రానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. ఇలాంటి సమయంలో థరూర్‌పై వేటు వేస్తే బీజేపీ చేతికి ఆయుధాలు ఇచ్చినట్లు అవుతుందని కొంతమంది నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి ఆయన భవిష్యత్తులో తీసుకోబోయే నిర్ణయాలను ఓ కంట కనిపెట్టాలని సూచిస్తున్నారు.

హైకోర్టు మాజీ న్యాయమూర్తులందరికీ సమాన పెన్షన్: సుప్రీం

న్యూదిల్లీ: కొంతమంది హైకోర్టు విశ్రాంత న్యాయ మూర్తులకు తక్కువ పెన్షన్ ఇస్తుండడంపై తాజాగా సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఇందులోభాగంగా హైకోర్టు మాజీ న్యాయమూర్తులందరికీ పూర్తిస్థాయిలో సమాన పెన్షన్ అందజేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగంలో చేరిన తేదీ, ఇతర విషయాలతో సంబంధం లేకుండా మాజీ న్యాయమూర్తులకు పెన్షన్ ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) న్యాయమూర్తులకు, అన్ని జిల్లాల న్యాయమూర్తులకు పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు సమానంగా ఉండాలని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థకు ఉన్న స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి, గౌరవాన్ని నిలబెట్టడానికి న్యాయమూర్తుల జీతాల మాదిరిగానే, పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు కూడా ఒకేరకంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. శాశ్వత, అదనపు న్యాయమూర్తుల మధ్య ఎటువంటి తేడా చూపకూడదని పేర్కొన్నారు. వితంతువులు, ఇతర ఆధారపడిన వారికి గ్రాట్యూటీ, కుటుంబ పెన్షన్ వంటి ప్రయోజనాలు కూడా న్యాయమూర్తులు అందరికీ ఒకేరకంగా అందించాలన్నారు. టెర్మినల్ ప్రయోజనాల కోసం పదవీవిరమణ తర్వాత న్యాయమూర్తుల మధ్య ఎటువంటి వివక్ష చూపినా అది ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లు అవుతుందని సీజేఐ పేర్కొన్నారు. అందువల్ల అన్ని హైకోర్టుల న్యాయమూర్తులు... వారు ఎప్పుడు ప్రవేశించారనే దానితో సంబంధం లేకుండా పూర్తి పెన్షన్ పొందడానికి అర్హులని అన్నారు. ఇకపై అన్ని హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తులకు ఏడాదికి రూ.15 లక్షల పెన్షన్... రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులకు రూ.13.5 లక్షల పూర్తి పెన్షన్ చెల్లించాలని జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

విశాఖ ఉక్కు కార్మికుల సమ్మెకు మద్దతుగా

రేపు వామపక్షాల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ ఉక్కు పరిరక్షణకు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్న కార్మికులకు మద్దతుగా బుధవారం విజయవాడలో వామపక్ష పార్టీలు నిర్వహిస్తున్న ఆందోళనలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, పి.ప్రసాద్ (సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ), జాస్తి కిశోర్‌బాబు (సీపీఐ ఎంఎల్), కాటం నాగభూషణం (ఎంసీపీఐ-యూ), బి.బంగార్రావు (సీపీఐ-ఎంఎల్ లిబరేషన్), బీఎస్ అమర్‌నాథ్ (ఎస్‌యూసీఐ(సీ)), పీవీ సుందర రామరాజు (ఫార్వర్డ్ బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) సోమవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నదని తెలిపారు. అందులో భాగంగానే కాంట్రాక్టు కార్మికులు మూడు వేల మందిని తొలగించిందని, రెండవ దఫాలో 2,600 మందిని తొలగించేందుకు సిద్ధమైందని వివరించారు. శాశ్వత కార్మికులు 1,400 మందిని తగ్గిస్తోందని, ఎనిమిది నెలల నుంచి కార్మికులకు సగం జీతాలే చెల్లిస్తోందని, సొంత గనులు ఇవ్వకుండా మోసం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనల ఫలితంగా కేంద్రం రూ.11,440 కోట్లు ప్రకటించిందని, కుడిచేతో ఇచ్చి ఎడమచేతితో లాగేసుకునే చందంగా రూ.9,346 కోట్లు వివిధ బకాయిల పేరుతో తిరిగి లాగేసుకుందని పేర్కొన్నారు. ఇలాంటి కుట్రలకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు పోరాడుతుంటే... వారిని అణచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను నియమించి కేంద్ర దుర్మార్గానికి వత్తాసు పలుకుతోందన్నారు. ఈ ద్వంద్వ వైఖరి విడనాడి కూటమి ప్రభుత్వం ఉక్కు రక్షణకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

మహిళల భద్రతకు ఇతర భాషల్లోనూ శక్తి యాప్

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహిళల భద్రత కోసం అత్యంత అధునాతన ఫీచర్లు కలిగిన 'శక్తి యాప్' ఇపుడు హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనూ యూజర్లకు అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్లేస్టోర్ ద్వారా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 1,52,16,440 మంది తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. అత్యవసర సహాయం కోసం 11,60,146 మంది కాల్ చేయగా, వీటిలో 34,192 తక్షణమే స్పందించవలసిన కాల్స్‌గా నమోదు చేసుకొని, 3,193 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ యాప్ ద్వారా 242 ఫ్యామిలీ కౌన్సిలింగ్ రిక్వెస్టులు, సేఫ్ ట్రావెల్ కోసం 160, తప్పిపోయిన పిల్లల కోసం 18 మంది ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గడచిన 10 నెలల్లో పోక్సో, వరకట్న హత్యలు, మహిళల హత్యలు, రేప్, గ్యాంగ్ రేప్ కేసుల్లో 169 మంది నిందితులకు న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించినట్లు వెల్లడించారు. మహిళలు, బాలికల భద్రతకు ఆంధ్ర ప్రదేశ్ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలపై జరిగే వ్యవస్థీకృత నేరాలను అరికట్టడానికి ఐజీపీ రాజకుమారి నేతృత్వంలో 'ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో 164 శక్తి టీమ్‌లు ఏర్పాటు చేశామని, ఈ టీమ్‌లు మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ మఫ్టీలో నిరంతరం పహారా కాస్తున్నాయన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత, ఉపయోగాల గురించి అవగాహన కల్పిస్తూ రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో గ్రామీణ ప్రాంతాల మహిళలకు విస్తృత స్థాయిలో 12,119 అవగాహన శిబిరాలు నిర్వహించామని, 'ఈవ్ టీజింగ్' కు పాల్పడే 254 మందిని గుర్తించి వీరి మీద నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు.

మహిళకు అన్యాయం చేస్తే కఠిన చర్యలు

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఏ ఒక్క మహిళకు అన్యాయం జరిగినా, వారి హక్కులను కాలరాసేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మంగళగిరిలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆమె ముందుగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శైలజ మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా పని చేస్తానని తెలిపారు. ఐదేళ్లలో మహిళా కమిషన్‌లో ఫిర్యాదులను పట్టించుకోలేదని, పాత ఫిర్యాదుల దుమ్ముదులిపి ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా వేదికగా మహిళలపై అసభ్య పోస్టులు పెడుతున్నారని, వారు తమ తీరు మార్చుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, ప్రముఖ వ్యాపార, విద్యా వేత్త రాయపాటి గోపాలకృష్ణ, రమేశ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రమేశ్‌బాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు శివ నాగమల్లేశ్వరరావు, బంధువులు, కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు అభినందించారు.

నేడు స్థానిక సంస్థల నేతలతో జగన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కోనసీమ జిల్లా రామచంద్రాపురం మునిసిపాలిటీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మునిసిపాలిటీ, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కార్పొరేటర్లతోను, వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం సమావేశం కానున్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి పార్టీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మునిసిపల్ చైర్ పర్సన్లు, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లను ఆహ్వానించారు. వీరితో పాటు ఆయా జిల్లాలకు సంబంధించిన పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారు.

సుప్రీంలో టెల్కోలకు షాక్

న్యూదిల్లీ: టెలికాం సంస్థలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి బకాయిల నుంచి ఊరట కల్పించాలంటూ టెలికాం కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో వొడాఫోన్ ఐడియా షేర్లు కుప్పకూలాయి. సోమవారం ఇంట్రాడేలో వీఐ షేర్లు 10 శాతం క్షీణించాయి. ఏజీఆర్ బకాయిలపై వడ్డీ, పెనాల్టీలు, పెనాల్టీలపై వడ్డీ నుంచి తమకు మినహాయింపు కల్పించాలని టెలికాం సంస్థలు వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలీ సర్వీసెస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ నిర్ణయంతో టెలికాం సంస్థలపై భారం పడనుందన్న భయంతో షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయి. వీఐ షేర్లు నష్టాల్లో ట్రేడవుతుండగా... భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ఫ్లాట్‌గా ఉన్నాయి.

విశాఖ 'కూటమి'లో చిచ్చు?

డిప్యూటీ మేయర్ ఎన్నికకు టీడీపీ సభ్యుల డుమ్మా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక కూటమి పార్టీల్లో చిచ్చు రేపింది. విశాఖ మేయర్ పదవి టీడీపీ దక్కించుకున్న నేపథ్యంలో డిప్యూటీ మేయర్ పదవి జన సేనకే ఇవ్వాలని ఆ పార్టీ కార్పొరేటర్లు పెద్ద ఎత్తున డిమాండ్ చేయడంతో ఇరు పార్టీల అధినేతలు నిర్ణయించి డిప్యూటీ మేయర్ పదవికి జనసేన 64 వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ రాజును ఎంపిక చేశారు. కాగా సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక సమావేశానికి 56 మంది సభ్యులు హాజరు కావలసి ఉన్నప్పటికీ, 54 మంది సభ్యులు హాజరు కావడంతో కోరం సరిపోకపోక డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా టీడీపీ కార్పొరేటర్లంతా మరో హోటల్లో సమావేశమై ఈ డిప్యూటీ మేయర్ ఎన్నికను వాయిదా వేయించేందుకు వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. గత నెల 28వ తేదీన మేయర్ అవిశ్వాస పరీక్షకు హాజరై చేతులెత్తిన టీడీపీ ప్రజాప్రతినిధులు సైతం సోమవారం జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికలకు దూరం కావడంతో పొత్తులో చిచ్చు మొదలైందని ఇరు పార్టీల నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

అణు ఇంధన చట్టాల్లో సవరణలు

కేంద్రం యోచన

న్యూదిల్లీ: అణు విద్యుత్ రంగానికి సంబంధించిన చట్టాల్లో సవరణలు చేయాలని కేంద్రప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఈ రంగాన్ని పర్యవేక్షించే ప్రభుత్వ నియంత్రణ సంస్థలోనూ సంస్కరణల ద్వారా ప్రైవేటు పెట్టుబడులను ఈ విభాగంలోకి అనుమతించాలని కేంద్రం యోచిస్తోంది. దీనివల్ల 2047 నాటికి 100 గిగావాట్ల అణు ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే దేశ దీర్ఘకాలిక లక్ష్యం సాకారం అవుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. 'సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్'లో సవరణలు చేసి అణు ఇంధన ప్లాంట్ల నిర్మాణానికి పరికరాలను సరఫరా చేసే కంపెనీల బాధ్యతను మరింత తగ్గించాలని భావిస్తున్నారు. భారత అంతరిక్ష రంగ నియంత్రణ సంస్థ పేరు 'ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్'. దీన్ని సంక్షిప్తంగా 'ఇన్ స్పేస్' అని పిలుస్తారు. దీన్ని 2020 సంవత్సరంలో ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి భారత్‌లోని అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహం లభిస్తోంది. అచ్చం ఇదే తరహాలో అణు విద్యుత్ రంగ నియంత్రణ సంస్థ కూడా ఉండాలని... అందుకవసరమైన సంస్కరణలన్నీ చేయాలని ప్రభుత్వం అనుకుంటోంది. భారత్‌లో పెరుగుతున్న ఇంధన అవసరాలకు అనుగుణంగా అణు విద్యుత్ ఉత్పత్తిని పెంచుతామని ఇటీవలే కేంద్ర అణు ఇంధన విభాగం అధికార వర్గాలు వెల్లడించాయి.

ఇరిగేషన్ పనులకు రూ.344 కోట్లు

మంత్రి నిమ్మల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ నెలాఖరు నాటికి ఓఅండ్ఎం పనులు పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఇరిగేషన్ పనులు, నిర్వహణ, మరమ్మతుల కోసం సీఎం చంద్రబాబు రూ.344 కోట్లు విడుదల చేశారని, ఆ నిధులను సద్వినియోగం చేసుకుంటూ పనులు వెంటనే మొదలుపెట్టాలని అన్నారు. ఓఅండ్ఎం పనులపై ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులతో సోమవారం మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓఅండ్ఎం పనుల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు... ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయటం ముదావహమన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందు అంటే, నేటి నుంచి కేవలం పది పన్నెండు రోజులే ఉన్నందున తక్షణం పనులను ప్రారంభించి పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఇందుకు సూపరింటెండెంట్ ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణ చేయటం ద్వారానే సకాలంలో పూర్తి కాగలవన్నారు. గత ప్రభుత్వం ఓఅండ్ఎం పనులను గాలికి వదిలేసిందని, కాలవల్లో తట్ట మట్టి తీయలేదని చెప్పారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసుకుంటూ ఇరిగేషన్ రంగాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నట్లు స్పష్టం చేశారు. టెలికాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల ఎమ్మెల్యేలు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, కడా కమిషనర్ రామసుందర్‌రెడ్డి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఈలు, ఎస్ఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎవరు వెళ్లాలో మేము నిర్ణయిస్తాం

పాక్‌కు వ్యతిరేకంగా దౌత్య ప్రచారంపై తృణమూల్

న్యూదిల్లీ: ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రపంచానికి భారతదేశ సందేశం పంపే లక్ష్యంలో ఏర్పాటు చేసిన కమిటీలు వివాదాస్పదమవుతున్నాయి. కమిటీల్లో సభ్యులను రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా కేంద్రం తనకు ఇష్టమొచ్చినట్లు నియమిస్తోంది. దీనిపై ఇప్పటికే కాంగ్రెస్ మండిపడుతుండగా తాజాగా తృణమూల్ కాంగ్రెస్ కూడా మోదీ సర్కారు తీరును ఎండగట్టింది. తమ అనుమతి లేకుండా తమ ఎంపీలను బృందాల్లో ఎలా నియమిస్తారని కేంద్రాన్ని ప్రశ్నించింది. పాకిస్థాన్‌కు చెందిన సీమాంతర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి మొదటిసారి లోక్‌సభ ఎంపీ, మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ లేదా తమ పార్టీకి చెందిన మరో ఎంపీ ప్రతినిధి బృందంలో ఉండరని తృణమూల్ నాయకత్వం కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసినట్లు సమాచారం. ప్రతినిధి బృందంలో పేర్ల కోసం తమ పార్టీకి ఎటువంటి అభ్యర్థన రాలేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. 'వారు సభ్యుడి పేరును స్వయంగా నిర్ణయించలేరు. అది వారి ఎంపిక కాదు. పార్టీ (తృణమూల్) నిర్ణయిస్తుంది. వారు అభ్యర్థిస్తే పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. విదేశాంగ విధానాలపై మేము పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాం' అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు చెందిన శశి థరూర్, శివసేన (యూబీటీ)కు చెందిన ప్రియాంక చతుర్వేది సహా ఏడుగురు ఎంపీల నేతృత్వంలోని బృందాలను కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. 'ఇది ఎవరు చెప్పారో నాకు తెలియదు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటం, పార్టీ జాతీయ ప్రయోజనాలను రక్షించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా... మేము భుజం భుజం కలిపి నిలబడతాము' అని తృణమూల్ ప్రధాన కార్యదర్శి, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీ పీటీఐకి తెలిపారు. 'ప్రతినిధులు వెళుతుంటే... భారతదేశంలో శాంతికి విఘాతం కలిగించడానికి పాకిస్థాన్ చేసిన ప్రయత్నాన్ని మేము ఖండిస్తున్నాము. కానీ ఎవరు వెళ్లాలో టీఎంసీ నిర్ణయిస్తుంది. కేంద్రం దానిని ఏకపక్షంగా నిర్ణయించదు. దీనిని పార్టీ నాయకత్వం నిర్ణయించాలి' అని చెప్పారు. రాజ్యసభలో తృణమూల్ ఉప నాయకురాలు సాగరికా ఘోష్ మాట్లాడుతూ విదేశాంగ విధానం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోనిదని, అది మన విదేశీ సంబంధాలకు పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. 'పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమర్థవంతమైన దీర్ఘకాలిక నిరోధం కోసం తృణమూల్ కాంగ్రెస్ మన సాయుధ దళాలతో భుజం భుజం కలిపి నిలుస్తుంది. దేశం, జెండా, మన జాతీయ సంకల్పం భారతదేశమంతటికీ, గర్వించదగిన ప్రతి పౌరుడికి చెందినవి' అని ఘోష్ అన్నారు. ఇదిలాఉండగా, టీఎంసీ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ కూడా ఆరోగ్య కారణాల వల్ల తాను ప్రతినిధి బృందంలో చేరలేనని ధ్రువీకరించారు.

ఉగ్రదాడికి ముందు పహల్గాంకు జ్యోతి

న్యూదిల్లీ: పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ అరెస్టయిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గాంలో ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలల ముందు ఆమె ఆ ప్రాంతానికి వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న ఆ దేశ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతికి సన్నిహిత సంబంధాలున్నట్లు నిర్ధారణ అయింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై భీకర ఉగ్రదాడి జరిగడానికి మూడు నెలల ముందు జ్యోతి అక్కడికి వెళ్లి వీడియోలు తీయడం, వాటిని పాక్ ఏజెంట్లకు చేరవేయడంపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గూఢచర్యం ఆరోపణల కింద గతవారం జ్యోతిని హర్యానా పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఆమె గురించి అనేక విషయాలు బయటికొచ్చాయి. పహల్గాం దాడికి ముందు ఆమె పలుమార్లు పాకిస్థాన్‌లో పర్యటించిందని, ఒకసారి చైనాకూ వెళ్లొచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో ఆమె దిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలోని అధికారి డానిష్‌తో టచ్‌లో ఉన్నట్లు నిర్ధారించారు. జ్యోతిని అతడు ట్రాప్ చేసినట్లు గుర్తించారు.

ప్రజలకిచ్చిన హామీలు గాలికి

'ఆడబిడ్డ నిధి'కి మంగళం

కూటమి ప్రభుత్వంపై బొత్స ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేశాయని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఆడబిడ్డ నిధి పేరుతో పద్దెనిమిది ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని హామీ ఇచ్చాయన్నారు. మూడు రోజుల క్రితం చంద్రబాబు మాట్లాడుతూ ఈ పథకాన్ని పీ4లో పెట్టానని, దానిలో చూస్తానని చెప్పారన్నారు. పీ4కి, ఆడబిడ్డ నిధికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని దాదాపు అర్హులైన కోటి మందికి పైగా మహిళలకు ఎప్పుడు ఆడబిడ్డ నిధి పథకం కింద ఆర్థిక సాయం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, జనసేనలు కూడా చంద్రబాబు మాటలను సమర్థిస్తున్నాయా? స్పష్టం చేయాలన్నారు. మహిళలను సునాయాసంగా నమ్మించి మోసగించడం చంద్రబాబుకు అలవాటేనని ఆరోపించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో డ్వాక్రా రుణమాఫీ అంటూ మహిళలను ఇలాగే మోసం చేశారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా ఇచ్చిన హామీల అమలుపై మాట్లాడటం లేదన్నారు. మహిళలకు 'ఉచిత బస్సు' ఆగస్టు 15న ప్రకటిస్తామని లీకులు వదులుతున్నారని... తల్లికివందనం గత ఏడాది పూర్తిగా ఎగ్గొట్టేశారన్నారు. ఈ ఏడాది స్కూల్స్ తెరిచిన తరువాత ఇస్తామంటూ చెబుతున్నారే తప్ప అది కార్యరూపంలోకి వస్తుందా అనేది అనుమానం ఉందన్నారు. హామీలను ఎగ్గొట్టే చర్యలను ప్రతిపక్షంగా చూస్తూ ఊరుకో బోమని, అక్కచెల్లెమ్మలకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ వారికి అండగా నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంగా అస్తవ్యస్త పాలన సాగుతోందని బొత్స మండిపడ్డారు. అన్నిచోట్లా సంఖ్యాబలం లేకపోయినా అధికార దుర్వినియోగంతో, పోలీసులను అడ్డం పెట్టుకుని, దౌర్జన్యాలతో పదవులను దక్కించుకుంటున్నారన్నారు. జీవీఎంసీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ నుంచి బయటకు వెళ్లిన 27 మంది కార్పోరేటర్లకు విప్ జారీ చేశాం. చట్టప్రకారం ఎన్నికల అధికారి పదిరోజుల్లో దానిపై స్పందించి ఆ 27 మందికి నోటీసులు ఇచ్చి, వారి స్పందనను మాకు తెలియచేయాలి. కానీ ఎన్నికల అధికారి నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. అంటే చట్టాన్ని ఏ విధంగా నిర్వీర్యం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఎన్నికల అధికారికి రిమైండర్ ఇచ్చామని... వేసవి సెలవులు పూర్తయిన తరువాత దీనిపై న్యాయస్థానంను ఆశ్రయిస్తామని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైసీపీ పూర్తి వ్యతిరేకం

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బొత్స అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అంగీకరించేది లేదని, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు దేనికైనా సిద్ధమని ప్రకటించారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.